www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కీలక దశకు మిస్ వరల్డ్ పోటీలు

టాప్ 24ను ప్రకటించిన నిర్వాహకులు.. జాబితాలో మిస్ ఇండియా నందినీ గుప్తా

'హెడ్ 2 హెడ్' పోటీల్లో 84 మంది ఔట్.. నాలుగు ఖండాల నుంచి మిగిలిన పోటీదారులు

రేపు ఖరారు కానున్న టాప్-10 జాబితా.. అందరి దృష్టి నందిని పైనే 14

భారత్‌కు శ్రీలంక, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా సుందరీమణుల నుంచి పోటీ

నేడు విక్టోరియా మెమోరియల్ హోంను సందర్శించనున్న బ్యూటీలు

గురువారం | 22-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 36

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా.1:13 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పూర్వాభాద్ర సా.5:47 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.2:41-4:10; దుర్ముహూర్తం: ఉ.10:02-10:54, మ.3:12-4:04; అమృతఘడియలు: ఉ.10:10-ఉ.11:41; రాహుకాలం: మ.1:30-3:00; సూర్యోదయం: 5:45; సూర్యాస్తమయం: 6:38

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





మావోయిస్టు చీఫ్ ఎన్‌కౌంటర్

అబూజ్‌మఢ్‌లో నేలకొరిగిన నంబాల కేశవరావు



నంబాల కేశవరావు

మరో 26 మంది నక్సల్స్ కూడా.. ఎన్‌కౌంటర్‌లో ప్రధాన కార్యదర్శి మృతి ఇదే తొలిసారి

మావోయిస్టు పత్రిక జంగ్ చీఫ్ ఎడిటర్ నాగేశ్వర్‌రావు మృతి చెందినట్లు ప్రచారం

అబూజ్‌మఢ్‌లో 72 గంటలపాటు ఆపరేషన్

కేశవరావుపై రూ. 1.5 కోట్ల రివార్డు

ఒక జవాన్ మృతి.. ఐదుగురికి గాయాలు

అబూజ్‌మఢ్‌లో కొనసాగుతున్న కూంబింగ్

ఆపరేషన్‌లో నాలుగు జిల్లాల బలగాలు

కేశవరావు స్వస్థలం ఏపీలోని శ్రీకాకుళం

వరంగల్‌లో ఇంజనీరింగ్ పూర్తి

రాడికల్ ఉద్యమం నుంచి నక్సలిజం వైపు

గణపతి తర్వాత మావోయిస్టు పార్టీ చీఫ్ పదవి

ఏడేళ్లుగా ఉద్యమానికి కేశవరావు సారథ్యం

చర్ల/హనుమకొండ/టెక్కలి/చింతపల్లి/సీలేరు/చీరాల, మే 21 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్'తో అతలాకుతలమవుతున్న మావోయిస్టు పార్టీకి మరో గట్టి దెబ్బ తగిలింది..! ఇప్పటికే అగ్రనాయకులను పోగొట్టుకుని, క్యాడర్ లొంగుబాట్లతో సతమతమవుతున్న మావోయిస్టు పార్టీ బుధవారం పెద్ద దిక్కును కోల్పోయింది. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు(71) ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జీయన్న పేటకు చెందిన కేశవరావు వరంగల్ ఆర్‌ఈసీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాక.. అజ్ఞాతంలోకి వెళ్లారు. నక్సలిజంపై పోలీసులు జరుపుతున్న ఐదు దశాబ్దాల పోరులో.. ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మృతి చెందడం ఇదే తొలిసారి. బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మరో 26 మంది నక్సల్స్ చనిపోగా, వారిలో

మిగతా 13వ పేజీలో...



అద్భుత విజయం

మీ (భద్రతా బలగాల) అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి, ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

- ఎన్‌కౌంటర్‌పై ప్రధాని మోదీ

నక్సలిజం నిర్మూలనలో మైలురాయి: షా

సిక్కోలులో పుట్టి.. అంచెలంచెలుగా..

మిలటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తుడు 13

అలిపిరి సహా 27 దాడుల్లో పాత్ర.. నంబాల ప్రస్థానం

వెన్ను విరిగినట్టే!

దళపతిని కోల్పోయిన మావోయిస్టులు

ఒక్క ఏడాదిలోనే 540 మంది ఎన్‌కౌంటర్ 13

ఖాళీ అయిన దండకారణ్య స్పెషల్ జోన్

ఉనికిని కోల్పోయిన ఏవోబీ కమిటీ

ఈ మారణహోమాన్ని ఆపాలి: జస్టిస్ చంద్రకుమార్ 12

చర్చలతో సమస్యకు పరిష్కారం: డి.రాజా, కూనంనేని

రోడ్డు ప్రమాదంలో కుటుంబం బలి! 3

డివైడర్‌ను దాటి బస్సును ఢీకొన్న కారు

వెనుక నుంచి బస్సును ఢీకొట్టిన కంటైనర్

కారులోని దంపతులు, ఇద్దరు పిల్లల మృతి

కారు డ్రైవర్, బస్సు డ్రైవర్ కూడా దుర్మరణం

కర్ణాటకలోని విజయపుర జిల్లాలో దారుణం

బాధిత కుటుంబానిది గద్వాల జిల్లా కేంద్రం



లండన్‌లో ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ స్వీకారం సందర్భంగా బాను ముస్తాక్ (ఎడమ), దీపా భస్తీ

కన్నడ రచయిత్రికి ఇంటర్నేషనల్ బుకర్ 2

'హార్ట్ ల్యాంప్' కథలకు ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని గెలుచుకున్న బాను ముస్తాక్

బుకర్ దక్కించుకున్న తొలి కన్నడ పుస్తకం

కథల అనువాదకురాలు దీపా భస్తీతో కలిసి లండన్‌లో పురస్కారం స్వీకరించిన బాను

బహుమతిగా ఇద్దరికీ చెరో 25 వేల పౌండ్లు

అఫ్ఘానిస్థాన్‌లోకి చైనా-పాక్ ఎకనమిక్ కారిడార్ 2

విస్తరించాలని మూడు దేశాల నిర్ణయం

సీపెక్ తదుపరి సమావేశం అఫ్ఘాన్‌లో..

సుఖోయ్‌ల బేరం కోసం.. రాఫెల్‌లపై బురద!

మూడు భారత రాఫెల్‌లను కూల్చామన్న పాక్ ప్రకటనలను సమర్థిస్తూ రష్యా కథనాలు

రాఫెల్‌ల కొనుగోలుపై ఇండోనేషియా వెనక్కి తగ్గవచ్చంటూ వాదనలు 2



మెదక్ జిల్లా ఝరాసంగంలో పొంగుతున్న త్యాలవరం వాగు

మరో 4 రోజులు వానలు

నేడు 8 జిల్లాలకు ఎల్లో అలర్ట్

అరేబియా సముద్రంలో అల్పపీడనం

వాయుగుండంగా మారే అవకాశం

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

వర్షాలపై ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్

బుధవారం విస్తారంగా వానలు..

పిడుగుపాటుకు నలుగురు బలి

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు పడుతున్నాయి. బుధవారం పలుచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు నమోదయ్యాయి. కొన్ని పట్టణాల్లో కాలనీలు నీట మునిగాయి. రోడ్లు జలమయం అయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలుల ధాటికి చెట్లు కూలిపడ్డాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. మరోవైపు అరేబియా సముద్రంలో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది ఉత్తర దిక్కులో కదులుతూ క్రమేపీ బలపడి వాయుగుండంగా మారుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో మరో నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వానలు పడతాయని

మిగతా 3వ పేజీలో...

ట్రంప్ ఒత్తిడికి లొంగిన కేంద్రం

పాక్‌కు గుణపాఠం చెప్పకుండా వెనకడుగేసింది.. అమెరికా పెత్తనాన్ని నాడే ఇందిర తిరస్కరించారు

కేంద్ర బలగాలకు మేము అండగా నిలబడితే కిషన్‌రెడ్డి దుప్పటి కప్పుకొని పడుకున్నారు

తప్పు కప్పిపుచ్చుకునేందుకే రాహుల్‌పై విమర్శలు.. దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్‌గాంధీ

రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



రాజీవ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి ప్రధాని మోదీ సర్కారు లొంగిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్ కాలు దువ్వితే శాశ్వత గుణపాఠం చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ సహా అందరూ అండగా నిలబడ్డా.. వెనకడుగు వేసిన దుస్థితి మోదీ సర్కారుదని అన్నారు. కానీ, 1971లో పాక్‌తో యుద్ధం జరిగినప్పుడు.. అమెరికా అధ్యక్షుడు మధ్యవర్తిత్వం వహిస్తానన్నా నాటి ప్రధాని ఇందిరాగాంధీ తిరస్కరించారని తెలిపారు. "మాపై పెత్తనం చెలాయించాలనుకుంటే మా దేశం సహించబోదని, ఎవరి మధ్యవర్తిత్వమూ మాకు అవసరం లేదని మా దేశాన్ని మేమే రక్షించుకోగలమని విస్పష్టంగా చెప్పిన ఘనత ఇందిరాగాంధీది" అని రేవంత్ అన్నారు. బుధవారం మాజీ ప్రధాని

మిగతా 12వ పేజీలో...

ఆర్థిక వృద్ధికి మేధోమథనం!

మేధావులు, నిపుణులతో త్వరలో 'తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు'

రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్న బోర్డు 12

24న నీతి ఆయోగ్ భేటీలో బోర్డు గురించి ప్రస్తావించనున్న సీఎం

రాహుల్, సోనియాకు ₹142 కోట్ల లబ్ధి!

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్‌లో వారికి అనుచిత ప్రయోజనం

'యంగ్ ఇండియా' మోసపూరిత సంస్థ.. కాంగ్రెస్‌కు ప్రజలిచ్చిన విరాళాలను ప్రైవేటు ఆస్తిగా మార్చే ఏర్పాటు.. ఢిల్లీ కోర్టులో ఈడీ

కేసు డాక్యుమెంట్లు 5 వేల పేజీలున్నాయి

మా స్పందన తెలిపేందుకు సమయం ఇవ్వండి: అభిషేక్ సింఘ్వీ

జూలై 2-8 దాకా రోజువారీ విచారణ జరుపుతామన్న కోర్టు



న్యూఢిల్లీ, మే 21: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ రూ.142 కోట్ల అనుచిత ప్రయోజనం పొందారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. కాంగ్రెస్ పార్టీకి ప్రజలిచ్చిన విరాళాలను ప్రైవేటు ఆస్తులుగా మలచుకునేందుకే 'యంగ్ ఇండియా' కంపెనీని ఏర్పాటు చేశారని.. నిజానికి అదో మోసపూరిత కంపెనీ అని పేర్కొంది. బుధవారం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఎదుట ఈడీ

మిగతా 2వ పేజీలో...



వైట్‌హౌస్‌లో అమెరికా గోల్డెన్ డోమ్‌పై మీడియాకు వెల్లడిస్తున్న డొనాల్డ్ ట్రంప్

అంతరిక్షంలో ఆయుధాలు!

శత్రు క్షిపణుల నుంచి రక్షణకు రూ.15 లక్షల కోట్లతో అమెరికా 'గోల్డెన్ డోమ్'

మూడేళ్లలో అందుబాటులోకి.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

వచ్చే 20 ఏళ్లలో రూ.42 లక్షల కోట్ల మేర ఖర్చవుతుందని అంచనా

అంతరిక్షం యుద్ధరంగంగా మారే ముప్పు.. రష్యా, చైనా ఆందోళన

గోల్డెన్ డోమ్ ప్రాజెక్టులో భాగంగా రోదసిలో లేజర్ ఆయుధాలు

కృత్రిమ మేధతో పనిచేసే స్పేస్‌బేస్డ్ సెన్సర్లు, ఇంటర్‌సెప్టర్ల ఏర్పాటు!

వాషింగ్టన్, మే 21: హమాస్ దాడుల నుంచి తన ప్రజలను కాపాడుకోవడానికి ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' అనే రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టే.. శత్రు దేశాల క్షిపణుల నుంచి రక్షణకు అమెరికా 'గోల్డెన్ డోమ్'ను ఏర్పాటు చేసుకోనుంది. అందులో భాగంగా.. చరిత్రలో తొలిసారి అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం దీనిపై ఒక ప్రకటన చేశారు. 175 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.15 లక్షల కోట్లు) దాకా ఖర్చయ్యే ఈ 'గోల్డెన్ డోమ్ మిసైల్ షీల్డ్ సిస్టమ్' మూడేళ్లలో (అంటే తన పదవీకాలం పూర్తయ్యేసరికి) అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇందుకోసం ప్రాథమికంగా

మిగతా 2వ పేజీలో...

ఇన్వర్టర్ నిప్పురవ్వలతోనే ప్రమాదం!

షార్ట్‌సర్క్యూట్‌తో అంటుకున్న నిప్పు

నగల దుకాణంలోని చెక్క ఫ్రేమ్‌పై పడి.. మంటలు.. నిపుణుల ప్రాథమిక నిర్ధారణ

ప్రమాదంపై నేడో రేపో సమగ్ర నివేదిక

ప్రమాదాన్ని గుర్తించాక గంటపాటు నిప్పు ఆర్పేందుకు యత్నించిన బాధితులు

పరిస్థితి చేయిదాటడంతో 'ఫైర్'కు ఫోన్

మీడియాతో ఇష్టాగోష్ఠిలో అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారి

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్ ప్రాంతంలో ఒకే కుటుంబంలో 17 మందిని బలితీసుకున్న అగ్ని ప్రమాదానికి కారణం ఇన్వర్టర్‌లో వచ్చిన నిప్పు రవ్వలేనని అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారి తెలిపారు. దట్టమైన పొగ, మంటల వేడి కారణంగానే గదిలో ఉన్న 17 మంది ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకుని, మృతి చెందినట్లు నిపుణులు ప్రాథమికంగా గుర్తించారని చెప్పారు. బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో

మిగతా 14వ పేజీలో...

కోల్‌కతాలో డ్రోన్ల కలకలం

కోల్‌కతా, మే 21: కోల్‌కతాలో డ్రోన్ల సంచారం కలకలం రేపింది. నగరంలోని ప్రముఖ ప్రదేశాలపై డ్రోన్లను పోలిన వస్తువులు ఎగురుతూ కనిపించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవడంతో కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు అప్రమత్తమయ్యాయి. గూఢచర్యంతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాయి. నగరంలోని హేస్టింగ్స్ ప్రాంతం, విద్యాసాగర్ సేతు, మైదాన్ ప్రాంతాల్లో సోమవారం రాత్రి దాదాపు పది డ్రోన్ల లాంటి వస్తువులు ఎగురుతూ కనిపించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ ఎగిరే వస్తువులను ముందుగా హేస్టింగ్స్ పోలీసు స్టేషన్ సిబ్బంది గుర్తించారు. అవి డ్రోన్ల మాదిరిగానే ఉన్నాయని పోలీసులు తెలిపారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మహేశ్తల వైపు నుంచి అవి ఎగురుతూ వచ్చాయన్నారు. హేస్టింగ్స్ ప్రాంతం, రెండవ హుగ్లీ వంతెన(విద్యా సాగర్ సేతు)తో పాటు ఫోర్టు విలియం(ఆర్మీ తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం) మీదుగా సంచరించాయని పేర్కొన్నారు. ఈ వార్తలపై రక్షణ శాఖ స్పందించింది. "డ్రోన్ వార్తల ప్రామాణికతను పరిశీలిస్తున్నాం. ఊహాగానాలను వ్యాప్తి చేయొద్దు. అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి ఉండండి" అని రక్షణ శాఖ కోరింది.

హిందువులనే లక్ష్యంగా చేసుకున్నారు!

- ముర్షీదాబాద్‌లో టీఎంసీ నేతల ఆదేశాలతోనే దాడులు
- కలకత్తా హైకోర్టుకు నివేదిక సమర్పించిన సిట్

కోల్‌కతా, మే 21: పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలో చెలరేగిన హింసలో అధికార టీఎంసీ నేతల పాత్ర ఉందని దర్యాప్తు కమిటీ వెల్లడించింది. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. దాడులు, హింసాత్మక ఘటనలపై విచారణ జరిపేందుకు కలకత్తా హైకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ సభ్యులు హింస జరిగిన ప్రాంతాలను సందర్శించి, బాధితులతో మాట్లాడి నివేదికను రూపొందించారు. హైకోర్టుకు సమర్పించిన నివేదిక ప్రతిని సంపాదించిన ఎన్డీటీవీ.. అందులోని వివరాలను తెలియజేసింది. హిందువులే లక్ష్యంగా దాడులు జరిగాయని సిట్ నివేదికలో తెలిపినట్లు పేర్కొంది. సాయం కోసం అర్థించినా స్థానిక పోలీసులు స్పందించలేదని తెలిపింది. "టీఎంసీ కౌన్సిలర్ మెహబూబ్ ఆలం ఆదేశాలతోనే దాడులు జరిగాయి. స్థానిక పోలీసులు పూర్తిగా ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు" అని నివేదికలో పేర్కొన్నట్లు వివరించింది. ఏప్రిల్ 11న మధ్యాహ్నం 2.30 గంటలకు తొలి దాడి జరిగిందని, మాస్కులు వేసుకున్న అల్లరిమూకలతో కలిసి కౌన్సిలర్ ఆలం వచ్చారని స్థానికులు వెల్లడించినట్లు తెలిపింది. మంటలు ఆర్పకుండా ఉండేందుకు నీటి కనెక్షన్‌ను కట్ చేశారని స్థానికులు వాపోయినట్లు వివరించింది. ఏప్రిల్ 12న బెటబోనా గ్రామంలోని హిందూ కుటుంబానికి చెందిన తండ్రీ కొడుకులను పొరుగింట్లో ఉండే ముస్లింలు హత్య చేశారని నివేదికలో పేర్కొన్నట్లు ఎన్డీటీవీ వెల్లడించింది.

నన్ను పెళ్లి చేసుకోవా!!

- పాకిస్థాన్‌లోనే మన వివాహం
- పాక్ ఏజెంటుతో జ్యోతి మల్హోత్రా చాటింగ్



న్యూఢిల్లీ, మే 21: పాకిస్థాన్‌కు గూఢచారిగా వ్యవహరించిన హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై విచారణలో ఆ దేశ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరితో ఆమె జరిపిన వాట్సాప్ చాటింగ్ తాజాగా బయటకు వచ్చింది. పాకిస్థాన్ గూఢచారి సంస్థ 'ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్' అధికారి అలి హసన్‌కు ఆమె చాలా దగ్గర అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. వీరిద్దరి మధ్య జరిగిన వాట్సాప్ చాట్‌లను ఈ కేసు విచారిస్తున్న హరియాణా పోలీసులు సేకరించారు. అందులో ఒక దాంట్లో జ్యోతి హసన్‌ను "నన్ను పాకిస్థాన్‌లోనే పెళ్లి చేసుకో..." అని కోరింది. ఈ ఇద్దరి మధ్య వాట్సాప్ చాట్‌ల ద్వారా కోడ్ భాషలోనూ పలు సార్లు చర్చలు సాగాయి. భారత నిఘా కార్యకలాపాల గురించి ఈ కోడ్ భాషలో చర్చించారు. పోలీసులు తమ విచారణలో జ్యోతికి 4బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఒక ఖాతాకు దుబాయి నుంచీ లావాదేవీలు జరిపారు. ఇదిలా ఉండగా, గూఢచర్యానికి పాల్పడుతున్నాడనే ఆరోపణలతో ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌కు చెందిన ఓ అధికారిని 24 గంటల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించింది. మే 13న కూడా ఓ అధికారిని ఇవే అభియోగాలతో తక్షణమే దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది.

వేతన పెంపునకు ఒకరోజు ముందు ఉద్యోగ విరమణ చేసినా హైక్ వర్తిస్తుంది!

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గొప్ప ఊరట

న్యూఢిల్లీ, మే 21: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. వేతన పెంపునకు ఒకరోజు ముందే ఉద్యోగ విరమణ చేసే వారికి తమకు పెంపు వర్తించదేమోనన్న ఆందోళన అక్కర్లేదు! వార్షిక వేతన పెంపు తేదీకి ఒక్కరోజు ముందు రిటైర్ అయ్యే ఉద్యోగులకు కూడా నోషనల్ ఇంక్రిమెంట్ వర్తిస్తుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాల పెంపునకు జనవరి 1, జూలై 1 తేదీలను ప్రతిపాదించారు. ఈ మేరకు డిసెంబరు 31, జూన్ 30 తేదీల్లో ఉద్యోగ విరమణ చేసేవారికి కూడా నోషనల్ హైక్ వర్తించనుంది. ఇదివరకు.. ఇలాంటి వాటిల్లో కోర్టు ఉత్తర్వులు జారీ అయిన కేసుల్లోనే నోషనల్ ఇంక్రిమెంట్ వర్తింపజేసేవారు. తాజాగా కేంద్రమే ప్రకటన చేయడంతో డిసెంబరు 31, జూన్ 30 తేదీల్లో రిటైర్ అయిన ఉద్యోగులకూ ప్రయోజనం కలగనుంది.

హిందీలోనే మాట్లాడతా.. కన్నడ మాట్లాడను!

- వినియోగదారుడితో ఎస్‌బీఐ మేనేజర్ వాగ్వాదం
- సోషల్ మీడియాలో వైరల్.. అధికారి బదిలీ

బెంగళూరు, మే 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారులోని చందాపుర ఎస్‌బీఐ ఖాతాదారుడు మహేశ్ మంగళవారం బ్యాంకుకు వెళ్లారు. క్యాష్ కౌంటర్‌లో ఎవరూ లేకపోవడంతో మేనేజర్ ప్రియాంక వద్దకు వెళ్లి క్యాష్ కౌంటర్‌లో ఎవరూ లేరని, ఎంతసేపు వేచి ఉండాలని ప్రశ్నించారు. అందుకు ఆమె హిందీలో సమాధానం ఇచ్చారు. తనకు హిందీ రాదని, కన్నడ లేదా ఇంగ్లీష్‌లో సమాధానం చెప్పాలని మహేశ్ డిమాండ్ చేశాడు. దీంతో మేనేజర్ ఇది ఇండియా అని, తాను హిందీలోనే మాట్లాడతానని.. కన్నడ ఎందుకు మాట్లాడాలని ప్రశ్నించారు. కన్నడలో మాట్లాడేది లేదని తీవ్రస్థాయిలో సమాధానమిచ్చారు. అక్కడే ఉన్న జయకర్ణాటక సంఘం కిరణ్ ప్రభాకర్‌రెడ్డి, పదాధికారులు.. మేనేజర్ తీరును తప్పుబట్టారు. ఈ వీడియో వైరల్ అయింది. నెటిజన్లు ఈ వీడియోను కేంద్ర ఆర్థిక మంత్రిని, ఆర్‌బీఐని ట్యాగ్ చేస్తూ ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివాదం నేపథ్యంలో రీజనల్ అధికారి హరీశ్ బ్యాంకు చేరుకుని, మేనేజర్‌తో క్షమాపణ చెప్పించారు. తర్వాత ఆమెను బదిలీ చేసినట్టు ప్రకటించారు. ఈ వివాదంపై సీఎం సిద్దరామయ్య తీవ్రంగా స్పందించారు.

అత్యాచారం చేయించి.. ముఖంపై మూత్రం పోసి

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై మహిళ ఫిర్యాదు

బెంగళూరు, మే 21: మహిళను వివస్త్రను చేసి, అనుచరులతో అత్యాచారం చేయించారన్న ఆరోపణలతో కర్ణాటకలోని ఆర్‌ఆర్ నగర్ ఎమ్మెల్యే మునిరత్న, ఆయన అనుచరులపై కేసు నమోదైంది. అత్యాచారం అనంతరం మునిరత్న తన ముఖంపై మూత్ర విసర్జన చేశారని, ప్రాణాంతక వైరస్‌ను కూడా ఇంజెక్ట్ చేశారని బాధితురాలు ఆరోపించింది. మునిరత్న గతంలో తనపై పెట్టిన తప్పుడు కేసులు వాపసు తీసుకుంటారని నవ్వించి.. ఆయన అనుచరులు 2023 జూన్ 11న తనను ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకెళ్లారని ఆ మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. అక్కడ మునిరత్న సూచనతో వసంత్, కమల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డారని, అనంతరం ఎమ్మెల్యే తన ముఖంపై మూత్రం పోశారని ఆరోపించింది. ఆ తర్వాత ఎమ్మెల్యే ఓ సిరంజి తీసి తనకు ఇంజెక్షన్ చేశారని తెలిపింది. ఈ ఏడాది జనవరిలో తాను ఆస్పత్రిలో చేరగా.. నయం చేయలేని వైరస్ సోకినట్టు నిర్ధారణ అయిందని, ఎమ్మెల్యే చేసిన ఇంజెక్షన్ వల్లే ఇలా జరిగి ఉండొచ్చని ఆమె ఆరోపించింది.

అంతరిక్షంలో ఆయుధాలు!

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. అత్యంత అధునాతన క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తానంటూ ఎన్నికల ప్రచార సమయంలో తాను అమెరికా ప్రజలకు ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. గోల్డెన్ డోమ్ నిర్మాణం పూర్తయితే.. భూమికి ఆవలివైపు నుంచి వచ్చే క్షిపణులను, నింగి నుంచి ప్రయోగించిన క్షిపణులను సైతం అది అడ్డుకోగలదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ వ్యవస్థలో భాగంగా భూమ్మీద, సముద్రంలో, అంతరిక్షంలో.. తదుపరి తరం సాంకేతిక పరిజ్ఞానాలను, స్పేస్ బేస్డ్ సెన్సర్లను, ఇంటర్‌సెప్టార్లను నియోగించనున్నట్టు వెల్లడించారు. "అమెరికా మనుగడకు, మన విజయాలకు ఇది అత్యంత కీలకం" అని వ్యాఖ్యానించారు. కెనడా కూడా ఈ ప్రాజెక్టులో భాగం కావడానికి.. ఈ వ్యవస్థ ద్వారా రక్షణ పొందడానికి ఆసక్తి చూపుతోందని ఆయన చెప్పారు. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన కొత్తదేమీ కాదని.. చాలా ఏళ్ల క్రితం రోనాల్డ్‌రీగన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఈ తరహా వ్యవస్థను ప్రతిపాదించారని ట్రంప్ గుర్తుచేశారు. కానీ, అప్పట్లో ఇంత సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఏర్పాటు చేయలేకపోయారని పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్, స్పేస్ ఫోర్స్‌లో 30 ఏళ్ల అనుభవం ఉన్న అధికారి.. ప్రస్తుతం అమెరికా స్పేస్ ఆపరేషన్స్ వైస్ చీఫ్‌గా వ్యవహరిస్తున్న జనరల్ మైకేల్ గుట్లిన్‌కు గోల్డెన్ డోమ్ ప్రాజెక్టు అభివృద్ధి బాధ్యతలను ట్రంప్ అప్పగించారు. క్షిపణి రక్షణ, స్పేస్ ఆపరేషన్స్‌లో నిపుణుడిగా ఆయనకు మంచి పేరుంది. కాగా.. క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులు, హైపర్‌సానిక్ క్షిపణులు, డ్రోన్లతో.. అమెరికాపై శత్రువులు జరిపే సాధారణ, అణు దాడులను గోల్డెన్ డోమ్ ద్వారా అడ్డుకోవచ్చని పెంటగాన్ చీఫ్ పీట్ హెగ్‌సెత్ తెలిపారు. నిజానికి.. 2022లో అమెరికా ప్రభుత్వం (జోబైడెన్ హయాంలో) విడుదల చేసిన మిసైల్ డిఫెన్స్ రివ్యూ నివేదికలోనే.. చైనా, రష్యాల నుంచి నానాటికీ పెరుగుతున్న ముప్పు గురించి ప్రధానంగా ప్రస్తావించింది. మరీ ముఖ్యంగా.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలకపాత్ర పోషించిన డ్రోన్ల ముప్పు భవిష్యత్తులో మరింత పెరిగే ప్రమాదం ఉందని.. ఉత్తరకొరియా, ఇరాన్ అమెరికాపై బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించే ముప్పుందని హెచ్చరించింది. ఇక.. ట్రంప్ ప్రతిపాదిస్తున్న గోల్డెన్ డోమ్ ప్రణాళికను రష్యా, చైనా వ్యతిరేకిస్తున్నాయి. ఈ వ్యవస్థ అంతరిక్షాన్ని యుద్ధరంగంగా మార్చే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చాయి.



అంతరిక్షం నుంచి..

ఇజ్రాయెల్ 2011 నుంచి వినియోగిస్తున్న ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ.. హమాస్ ప్రయోగించే వేలాది షార్ట్ రేంజ్ రాకెట్లను నిర్వీర్యం చేస్తున్న సంగతి తెలిసిందే. దాని స్ఫూర్తితోనే అమెరికా ఈ ప్రాజెక్టుకు గోల్డెన్ డోమ్ అనే పేరు పెట్టింది. అయితే.. ఐరన్ డోమ్ భూమ్మీద ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ. కానీ, ఇప్పుడు ట్రంప్ ప్రకటించిన గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థలో భాగంగా నేలపైనే కాక అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరిస్తారు. ఈ వ్యవస్థ.. అమెరికా దిశగా దూసుకొచ్చే క్షిపణులను మధ్యలోనే అడ్డుకుని తుత్తునియలు చేస్తుంది. 1983లో రోనాల్డ్ రీగన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. 'స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ (ఎస్‌డీఐ)' పేరుతో ఇదే తరహా ప్రతిపాదన చేశారు. అప్పట్లో దాన్ని 'స్టార్‌వార్స్ ప్రోగ్రామ్' అనే ముద్దుపేరుతో పిలిచేవారు. దీని అమలు కోసం 1984లో స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఐవో)ను ఏర్పాటు చేశారు. ఆ విభాగం.. లేజర్లు, పార్టికల్ బీమ్ ఆయుధాలు, గ్రౌండ్ అండ్ స్పేస్ బేస్డ్ మిసైల్ సిస్టమ్స్ వంటివాటిపై విస్తృత అధ్యయనం చేసింది. అయితే.. ఆనాడు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలతో ఎస్‌డీఐ ఏర్పాటు సాధ్యం కాదని, దానికి మరో దశాబ్దకాల పరిశోధనలు అవసరమని 1987లో అమెరికన్ ఫిజికల్ సొసైటీ ఒక నివేదికను ప్రచురించింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టుకు 175 బిలియన్ డాలర్ల దాకా ఖర్చవుతుందని ట్రంప్ చెప్పినప్పటికీ.. అమెరికా బడ్జెట్ కార్యాలయం మాత్రం వచ్చే 20 ఏళ్లలో దీనికి 542 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.42 లక్షల కోట్ల) దాకా వ్యయం అవుతుందని అంచనా వేస్తోంది.

ఎలా పనిచేస్తుంది?

శత్రు దేశ క్షిపణులను అడ్డుకునే.. పేట్రియాట్ మిసైల్ బ్యాటరీస్, థాడ్, ఏజిస్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్, గ్రౌండ్ బేస్డ్ మిడ్ కోర్స్ డిఫెన్స్ (జీఎండీ), అవెంజర్ వంటి అత్యంత అధునాతన రక్షణ వ్యవస్థలు అమెరికా వద్ద ఇప్పటికే ఉన్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో.. రష్యా ప్రయోగించిన అత్యాధునిక క్షిపణులను అమెరికా వ్యవస్థలే సమర్థంగా అడ్డుకున్నాయి. అటు ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల నుంచి ఇజ్రాయెల్‌ను కాపాడింది కూడా అమెరికా రక్షణ వ్యవస్థలే. మరి కొత్తగా ఈ గోల్డెన్ డోమ్ ప్రతిపాదన ఎందుకు? అది ఎలా పనిచేస్తుంది? అంటే.. ఆ వివరాలేవీ ప్రస్తుతానికి అధికారికంగా అందుబాటులో లేవు. అయితే.. ఈ వ్యవస్థలో భాగంగా రోదసిలో 'డైరెక్టెడ్ ఎనర్జీ సిస్టమ్స్ (లేజర్లు) ఏర్పాటు చేయాల్సి ఉంటుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఆ లేజర్లు.. అమెరికా దిశగా దూసుకొచ్చే క్షిపణులను అడ్డుకుంటాయని.. కానీ, వాటిని మోహరించడం అంత సులువు కాదని వారు పేర్కొంటున్నారు. అలాంటి అత్యంత శక్తిమంతమైన ఒక్కో వ్యవస్థనూ అభివృద్ధి చేయడమే కాక.. వాటిని కక్ష్యలో, ప్రమాదకర వాతావరణంలో నిర్వహించడం కూడా సవాళ్లతో కూడుకున్న వ్యవహారమని ఆయన అభిప్రాయపడ్డారు.

రాహుల్, సోనియాకు 142 కోట్ల లబ్ధి!

(మొదటిపేజీ తరువాయి)

తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్), దానికున్న రూ.2 వేల కోట్ల ఆస్తులపై నియంత్రణ కోసం 2010లో యంగ్ ఇండియన్ కంపెనీని ఏర్పాటు చేశారని తెలిపారు. 2023 నవంబరులో దాని ఆస్తులు జప్తు చేశామని.. అప్పటివరకు.. అంటే 13 ఏళ్లపాటు ఆయా ఆస్తులను అనుభవించారని.. అద్దెల కింద రూ.142 కోట్ల ఆదాయం అక్రమంగా పొందారని పేర్కొన్నారు. కేసు డాక్యుమెంట్లు 5 వేల పేజీలు ఉన్నాయని.. తమ స్పందన తెలియజేసేందుకు సమయమివ్వాలని రాహుల్, సోనియా తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోరారు. దీంతో కోర్టు విచారణను జూలైకి వాయిదావేసింది. జూలై 2 నుంచి 8 వరకు రోజువారీ విచారణ జరుపుతామని వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్/ఏజేఎల్ ఆస్తులకు సంబంధించి బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యం స్వామి ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఢిల్లీ మేజిస్ట్రేట్ కోర్టు 2014లో దానిని పరిగణనలోకి తీసుకుంది. దాని ఆధారంగా 2021లో ఈడీ కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించింది. గత నెల 9న చార్జిషీటు కూడా దాఖలుచేసింది. తనకు, తన కుమారుడికి లబ్ధికలిగేందుకు ఏజేఎల్ స్వాధీనంలో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తన పదవిని సోనియాగాంధీ దుర్వినియోగం చేశారని ఈడీ వర్గాలు తెలిపాయి. 'ప్రజాధనాన్ని స్వప్రయోజనాలకు మళ్లించుకున్నారు. యంగ్ ఇండియన్, ఏజేఎల్‌లో చోటుచేసుకున్న పరిణామాల గురించి తమకు తెలియదని సోనియా, రాహుల్ విచారణ సందర్భంగా తెలిపారు. కానీ, రాహుల్, సోనియాల క్రియాశీల సహకారం, ఆదేశాలు లేకుండా ఏజేఎల్, యంగ్ ఇండియన్‌లలో నిధుల ప్రవాహానికి ఆస్కారమే లేదు" అని చార్జిషీటులో ఈడీ స్పష్టంచేసినట్లు ఈ వర్గాల ద్వారా తెలిసింది.

లోకం తీరు



కన్నడ రచయిత్రి బాను ముస్తాక్‌కు ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్

- 'హార్ట్ ల్యాంప్' కథలకు పురస్కారం
- బుకర్ దక్కించుకున్న తొలి కన్నడ పుస్తకం



బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు. తన కథల పుస్తకం 'హార్ట్ ల్యాంప్'కుగాను ఆమెను 2025 సంవత్సరానికి ఈ పురస్కారం వరించింది. లండన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం అనువాదకురాలు దీపా భస్తీతో కలిసి బాను అవార్డును అందుకున్నారు. బుకర్ ప్రైజ్ కన్నడ సాహిత్యానికి లభించడం ఇదే తొలిసారి. దీనిని భిన్నత్వానికి లభించిన విజయంగా రచయిత్రి బాను అభివర్ణించారు. ఆమె కర్ణాటకలోని హాసన్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ముస్లిం సామాజికవర్గానికి చెందిన బాలికలు, యువతుల దైనందిన జీవితాలను తన కథల ద్వారా బాను పరిచయం చేశారు. దక్షిణాదిలో పితృస్వామిక సమాజాల్లోని మహిళల ధీరోదత్తతకు 'హార్ట్ ల్యాంప్'లోని 12 కథలు అద్దం పట్టాయని బుకర్ ప్రైజ్ వర్గాలు తెలిపాయి. కాగా, అందమైన భాషకు లభించిన మరింత అందమైన విజయం అంటూ తన సంతోషాన్ని అనువాదకురాలు దీపా భస్తీ పంచుకున్నారు. బాను 1990 నుంచి 2023 వరకు రాసిన కథల్లోంచి 12 కథలను ఎంపిక చేసుకుని దీపా భస్తీ 'హార్ట్ ల్యాంప్' కథల పేరిట ఇంగ్లిషులోకి అనువదించారు. నగదు పురస్కారం కింద ఈ ఇద్దరికి చెరో 25వేల పౌండ్లు (రూ.28,76,845) లభించాయి. భారతీయ సాహిత్యానికి గత మూడేళ్లలో బుకర్ ప్రైజ్ రావడం ఇది రెండోసారి.

సుఖోయ్‌ల బేరం కోసం.. రాఫెల్‌లపై బురద!

3 రాఫెల్‌లను కూల్చామన్న పాక్ ప్రకటనను సమర్థిస్తూ రష్యా మీడియా కథనాలు

న్యూఢిల్లీ, మే 21: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన మూడు రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్థాన్ ప్రకటించింది. దానిని భారత్ నిర్ద్వంద్వంగా ఖండించింది. కానీ రష్యా ప్రభుత్వ మద్దతు ఉన్న 'రష్యన్ టైమ్స్' మాత్రం పాకిస్థాన్ వాదనను సమర్థించేలా, రాఫెల్‌ల పనితీరు ఆశాజనకంగా లేదన్నట్టుగా కథనాలు ప్రచురించింది. అదే సమయంలో రష్యాకు చెందిన సుఖోయ్ 57ఈ యుద్ధ విమానాలను అత్యంత సమర్థవంతమైనవిగా ప్రమోట్ చేస్తుండటం సందేహాలను లేవనెత్తుతోంది. నిజానికి ఫ్రాన్స్ సంస్థ దసో ఏవియేషన్ నుంచి 42 రాఫెల్ యుద్ధ విమానాలు, ఆయుధాల కొనుగోలు కోసం ఇండోనేషియా 2022లో సుమారు రూ.70 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. 2026 మొదట్లోనే ఆ దేశానికి రాఫెల్‌ల డెలివరీ మొదలుకావాల్సి ఉంది. ఇక్కడే రష్యన్ మీడియా ఎత్తుగడ వేసింది. పాక్ దాడుల్లో రాఫెల్‌లు కూలిపోవడంతో.. ఆ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై ఇండోనేషియా పునరాలోచన చేయవచ్చని పేర్కొంటూ 'ఎక్స్'లో రష్యన్ టైమ్స్ పోస్టు పెట్టింది. రాఫెల్‌లు అంత సమర్థవంతమైనవి కావంటూ కొన్ని ఏవేవో ధ్రువీకృతం కాని రిపోర్టులనూ ఉటంకించింది. ఇదే సమయంలో రాఫెల్‌కు, అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాలకు రష్యా సుఖోయ్ ఎస్‌యూ-57ఈ విమానాలు దీటైనవని, ఆగ్నేయాసియా ప్రాంతంలోని యుద్ధాల్లో కీలక పాత్ర పోషించగలదని, గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని రష్యన్ టైమ్స్ కథనాలు ప్రచురించింది. వాస్తవానికి నిజానికి భారత్‌తోపాటు ఇండోనేషియా ఎప్పటి నుంచో రష్యా సుఖోయ్ ఫైటర్లను వినియోగిస్తున్నాయి. భారత్ ఇటీవలే రాఫెల్‌లు కొనుగోలు చేయగా, ఇండోనేషియా కూడా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో ఆసియా ఖండంలోని దేశాలపై తన ప్రభావాన్ని నిలుపుకోవడం కోసం... పశ్చిమ దేశాల ఫైటర్లు, ఆయుధాలపై సందేహాలు కలిగేలా రష్యా మీడియా ప్రయత్నం చేస్తున్నదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

భారత విమానాలపై పాక్ 'నిషేధం' మరో నెల పొడిగింపు

న్యూఢిల్లీ, మే 21: భారత విమానాల కోసం తమ గగనతలాన్ని మరో నెలపాటు అనుమతించకూడదని పాకిస్థాన్ నిర్ణయించింది. ఏప్రిల్ 22న పెహల్గామ్ ఘటన తర్వాత పాక్‌పై భారత్ ప్రతీకార చర్యలకు దిగడంతో మనదేశ విమానాలు తమ గగనతలం మీదుగా ప్రయాణించకుండా దాయాది దేశం నెలపాటు నిషేధం విధించింది. ఇది ఈనెల 23వ తేదీతో ముగియనుంది. ఈ క్రమంలో ఈ నిషేధాన్ని పాక్ తాజాగా మరో నెల పొడిగించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ (ఐసీఏవో) నిబంధనల ప్రకారం ఏ దేశం కూడా ఇతర దేశాల విమానాలను తమ గగనతలం మీదుగా ప్రయాణించకుండా నెల రోజులకు మించి నిషేధం విధించడానికి వీల్లేదు.

ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కుండదు

సర్కారీ స్థలాన్నీ, వక్ఫ్‌గా ప్రకటించిన భూమిని రక్షించే అధికారం ప్రభుత్వానికి ఉంది: కేంద్రం

- వక్ఫ్ దాతృత్వానికి సంబంధించినది
- ఇస్లాంలో ముఖ్య భాగం కాదు
- సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ వెల్లడి

న్యూఢిల్లీ, మే 21: వక్ఫ్ దాతృత్వానికి సంబంధించినదని.. ఇస్లాంలో ముఖ్య భాగం కాదని కేంద్రం స్పష్టంచేసింది. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కుండదని తేల్చిచెప్పింది. సర్కారీ భూములు, వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను సంరక్షించే అధికారం ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని పేర్కొంది. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ మను సింఘ్వీ తదితరుల వాదనలను ఆలకించింది. బుధవారం కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'వక్ఫ్ బై యూజర్' సూత్రాన్ని అనుసరించి వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన ప్రాపర్టీలను తిరిగి తీసుకునే చట్టబద్ధమైన అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. 'వక్ఫ్ బై యూజర్' ప్రాథమిక హక్కు కాదన్నారు. పైగా వక్ఫ్ సవరణ చట్టం వల్ల బాధితులయ్యేవారెవరూ కోర్టుకు రాలేదని తెలిపారు. '1923 నుంచీ ఉన్న ఈ భయానక సమస్యను మేం పరిష్కరిస్తున్నాం. చట్టం చేసే ముందు రాష్ట్రప్రభుత్వాలను, రాష్ట్రాల వక్ఫ్ బోర్డులను సంప్రదించాం. జేపీసీ వేశాం. ప్రతి భాగస్వామితోనూ చర్చించాం. కొద్ది మంది పిటిషనర్లు వచ్చి.. మొత్తం ముస్లిం వర్గానికి మేం ప్రాతినిధ్యం వహిస్తున్నామని అనలేరు' అని వ్యాఖ్యానించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు వక్ఫ్‌బోర్డు విధులని..ఇవి పూర్తిగా లౌకిక కర్తవ్యాలని.. ఇద్దరు ముస్లిమేతర సభ్యులు ఉన్నంత మాత్రాన దాని స్వభావం మారదని పేర్కొన్నారు. వారు మైనారిటీగానే ఉంటారని తెలిపారు.



అశోకా వర్సిటీ ప్రొఫెసర్‌కు బెయిల్

ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్‌కు బుధవారం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఆయనకు వ్యతిరేకంగా కేసు దర్యాప్తు చేయకుండా స్టే విధించడానికి తిరస్కరించింది. ఈ కేసు దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించాలని హర్యానా డీజీపీని ఆదేశించింది. పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని అలీఖాన్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై అలీఖాన్ సోషల్ మీడియాలో చేసిన పోస్టుల్లో ఉద్దేశ పూర్వకంగా ఇతరులను అవమానపరిచేలా పదాలను ఎంచుకున్నారని ధర్మాసనం పేర్కొంది.

విద్యానిధులను ఇప్పించండి

జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయలేదన్న వంకతో సమగ్రశిక్షా పథకం కింద తమకు రావాల్సిన రూ.2,151 కోట్లకు పైగా నిధులను కేంద్రప్రభుత్వం నిలిపివేసిందని, ఆ మొత్తాన్ని ఇప్పించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ-2020) ఆమోదిస్తేనే ఈ నిధులు కేటాయిస్తామని కేంద్రం చెబుతోందని పేర్కొంది. జాతీయ విద్యావిధానంలో త్రిభాషా విధానముందని, కానీ తమిళనాట ద్విభాషా విధానం మాత్రమే అమలు చేస్తున్నామని వివరించింది. రూ.2151 కోట్లపై గత మే 1 నుంచి డిక్రీ అమలయ్యే వరకు 6% వడ్డీ చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించింది

ఆమె ఉగ్రవాది కాదు.. ఎవర్నీ హత్య చేయలేదు!

- పూజా ఖేడ్కర్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 21: మాజీ ఐఏఎస్ ప్రొబెషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు సుప్రీం కోర్టు బుధవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆమె పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె చేసిన తీవ్రమైన నేరం ఏమిటని ఢిల్లీ పోలీసులను ప్రశ్నించింది. 'ఆమె డ్రగ్స్ వ్యాపారి కాదు.. ఉగ్రవాది కాదు. హత్యకు పాల్పడలేదు. ఆమెకు ఢిల్లీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసి ఉండాల్సింది. ఎందుకంటే ఇప్పుడు ఆమె అన్నీ కోల్పోయింది. ఎక్కడా ఆమెకు ఉద్యోగం దొరికే అవకాశం లేదని పేర్కొంది. ఐఏఎస్ ట్రైనింగ్‌కు ఎంపికైన పూజ యూపీఎస్సీ పరీక్షల్లో ఓబీసీ, దివ్యాంగుల కోటా కోసం తప్పుడు పత్రాలు సమర్పించారన్న ఆరోపణలతో ఆమెపై ఫోర్జరీ కేసు నమోదయ్యాయి. దీంతో ఆమె ట్రెయినింగ్ కూడా రద్దయింది.

బలూచ్‌లో స్కూల్ బస్‌పై ఆత్మాహుతి దాడి

- ముగ్గురు పిల్లలు సహా 6గురి మృతి
- భారత్ ప్రమేయం ఉందన్న పాక్ ఆర్మీ

ఇస్లామాబాద్/కరాచీ, మే 21: పాకిస్థాన్‌లోని ఓ స్కూల్ బస్సుపై బుధవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా.. మృతుల్లో ముగ్గురు చిన్నపిల్లలు, టీచర్లు ఉన్నారు. 38మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని కుజ్‌దార్ జిల్లాలో ఈ దారుణమైన ఘటన చోటు చేసుకుంది. స్కూల్ పిల్లలతో వెళ్తున్న బస్సును లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం కిరాతమైన చర్య అని పాకిస్థాన్ ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ దాడులకు ఇంతవరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు కానీ.. భారత్‌తో లింకు ఉన్న గ్రూపుల ప్రమేయం ఉందని పాకిస్థాన్ సైన్యం ఆరోపించింది. పాకిస్థాన్ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ కొట్టిపారేసింది. ఆ దేశంలోని ఉగ్రవాదం, అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొంది. వారి సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం భారత్‌ను నిందించడం పాక్‌కు అలవాటుగా మారిందని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల ప్రకారం ప్రాథమికంగా దీనిని ఆత్మాహుతి దాడిగా గుర్తించినట్లు కుజ్‌దార్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఓ వాహనంలో ఉంచిన పేలుడు పదార్థాల ద్వారా ఆత్మాహుతి దాడి జరిగినట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు.

అఫ్ఘానిస్థాన్‌లోకి చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్

న్యూఢిల్లీ, మే 21: చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్(సీపెక్)ను అఫ్ఘానిస్థాన్‌కు కూడా విస్తరించాలని నిర్ణయించారు. చైనా రాజధాని బీజింగ్‌లో బుధవారం చైనా, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. సీపెక్‌ను విస్తరించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పాక్ విదేశాంగ మంత్రి ప్రకటన ఇషాక్ దార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సీపెక్‌ను అఫ్ఘానిస్థాన్‌కు విస్తరించడం వల్ల ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం వస్తాయని, అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సీపెక్‌పై తదుపరి సమావేశాన్ని అఫ్ఘానిస్థాన్‌లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. 60బిలియన్ డాలర్లతో నిర్మిస్తున్న ఈ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వెళ్తోంది. దీంతో, ఈ ప్రాజెక్టును భారత్ వ్యతిరేకిస్తోంది.



మేడారం-తాడ్వాయి రోడ్డుపై విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న ప్రయాణికులు



మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వరద నీరు

మరో 4 రోజులు వానలు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గంటకు 40-50 కి.మీ.వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మిగతా అన్ని జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని వెల్లడించింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలోని 612 మండలాలకుగాను 306 మండలాల్లో వర్షం కురిసినట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 8.6, నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో 7.6, కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో 7.2, బాన్సువాడలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోవైపు బుధవారం కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కనిపించింది. నల్గొండ జిల్లా దేవరకొండలో అత్యధికంగా 43.6, నిర్మల్ జిల్లా పెంబిలో 41.1, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీలో 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో.. నైరుతి రుతుపవనాలు వేగంగా పురోగమిస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

రాష్ట్రవ్యాప్తంగా వానలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా బుధవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అనుముల మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. నార్కట్‌పల్లిలో గాలివాన ధాటికి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కోదాడ, హుజూర్‌నగర్‌లోని పలు ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. లోతట్టు కాలనీలు, రహదారులు జలమయం అయ్యాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆ కాలనీలను సందర్శించారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో భారీ వర్షం పడింది. గాలి దుమారానికి మేడారం-తాడ్వాయి రోడ్డులో చెట్టు విరిగిపడింది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో భారీ వర్షంతో ప్యాలవరం వాగు పొంగిపొర్లింది. నారాయణఖేడ్ మండలంలో ఈదురుగాలి దాటికి పలు ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని పలు ఇళ్ల పైకప్పులు కూలిపడ్డాయి. నిజామాబాద్ జిల్లా నవీపేట, మోపాల్ మండలాల్లో చెట్లు విరిగిపడ్డాయి. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో బొబ్బిలి వాగు ఉప్పొంగింది.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

హైదరాబాద్‌లో కుండపోత

హైదరాబాద్‌లో బుధవారం రాత్రి కుండపోత కురిసింది. బండ్లగూడ, సైదాబాద్, అస్మాన్‌ఘడ్, అంబర్‌పేట, మలక్‌పేట, సరూర్‌నగర్, ఉప్పల్, హిమాయత్‌నగర్, సైదాబాద్, చార్మినార్, ముషీరాబాద్ ప్రాంతాల్లో లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. ముసారాంబ్రిడ్జిని వరద నీరు ముంచేయడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి వద్ద నీరు నిలవడంతో గంటకుపైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కోఠి, చాదర్‌ఘట్, ఎల్బీనగర్ ప్రధాన రహదారిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 11 గంటల వరకు అత్యధికంగా బండ్లగూడలో 8.8 సెం.మీ, మలక్‌పేట 8.5, అస్మాన్‌ఘడ్‌లో 8.3, అంబర్‌పేటలో 8.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు నలుగురు బలి

పిడుగుపాటు కారణంగా బుధవారం రాష్ట్రవాప్తంగా నలుగురు బలయ్యారు. నల్లగొండ జిల్లా అప్పాజీపేటలో నిమ్మతోటలో పనిచేస్తున్న మహిళారైతు భిక్షమమ్మ(46), మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయిలో గొర్రెల కాపరి ఏశబోయిన చేరాలు (55), ఇదే జిల్లా గూడూరు మండలం గుండెంగలో మైదం ప్రవీణ్‌కుమార్ (27), వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం మియాపూర్‌లో గొర్రెల కాపరి గోపాల బాలరాజు (20) పిడుగుపాటుకు గురై మృతి చెందారు.

అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్లకు విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ అర్వింద్‌కుమార్ ఆదేశం

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే వస్తాయని, రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేసింది. ఎలాంటి విపత్తులు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సారి ముందస్తుగానే 12 రాష్ట్ర విపత్తు సహాయక (ఎస్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధం చేశామని.. ఒక్కో బృందంలో తెలంగాణ స్పెషల్ పోలీస్‌కు చెందిన 100 మంది సుశిక్షితులైన పోలీసులు ఉంటారని వివరించారు. ఆ బృందాలను రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచామని, వాటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశామని.. భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో ఈసారి ప్రత్యేకంగా అదనపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేయాలని ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులను కోరామని వివరించారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని అన్ని ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నిర్వహణ చర్యలపై శిక్షణ ఇప్పించామన్నారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల విషయంలో తక్షణమే స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టర్లు అన్ని విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

అధికారులూ.. జాగ్రత్త : సీఎం రేవంత్



రాష్ట్రవ్యాప్తంగా వానలు పడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన చర్యలు చేపట్టాలని.. కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్‌లో రోడ్లపై వాన నీరు నిలవకుండా చూడాలని ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీసుశాఖ, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు.

ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో వాతావరణం అనుకూలించకపోవడంతో.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. అక్కడి నుంచి ఆయన రోడ్డు మార్గంలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెర్వుకు వెళ్లారు.

నేడు 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- వీటిలో తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, బేగంపేట, ఏపీలోని సూళ్లూరుపేట స్టేషన్లు

న్యూఢిల్లీ/బేగంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక సదుపాయాలతో వివిధ రాష్ట్రాల్లో అభివృద్ధి చేసిన 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను ప్రధాని మోదీ నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లు ఈ జాబితాలో ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ స్టేషన్ పూర్తిగా మహిళా ఉద్యోగులతో నడవనుండటం విశేషం. ఆయా ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ రైల్వే స్టేషన్ల ముఖద్వారాలు, ప్రధాన భవనాల నిర్మాణం చేపట్టారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాళ్లు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, టాయిలెట్లను పునర్నిర్మించారు. సైన్ బోర్డులు బోర్డులు ఏర్పాటు చేశారు. కాగా, ఈ 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లలో దక్షిణాది రాష్ట్రాలకు చెందినవి 21 మాత్రమే ఉన్నాయి. వీటిలో 9 తమిళనాడువి. తెలంగాణవి 3, ఏపీ 1, కేరళ 2, కర్ణాటక 5, పుదుచ్చేరికి చెందిన ఒక స్టేషన్ ఉంది. 78 రైల్వే స్టేషన్లు ఉత్తరాది రాష్ట్రాలవే కావడం గమనార్హం. వీటిలో అత్యధికంగా యూపీలో 19, గుజరాత్ 18, మహారాష్ట్ర 15, రాజస్థాన్ 8, మధ్యప్రదేశ్ 6, ఛత్తీస్‌గఢ్‌లో 5 ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని 3, అసోంలోని ఒక రైల్వే స్టేషన్ ఉంది.

కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతు ప్రణాళికలేవి?!

- నిర్ణీత గడువులోగా అందించని నిర్మాణ సంస్థలు
- నేడు బ్యారేజీలను సందర్శించనున్న ఈఎన్‌సీ

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి తక్షణ మరమ్మతు ప్రణాళికలను అందజేయడంలో నిర్మాణ సంస్థలు చేతులెత్తేశాయి. వానాకాలంలో బ్యారేజీల రక్షణకు ఏమేం చర్యలు తీసుకోవాలనే దానిపై ప్రణాళికలు అందించాలని ఎల్ అండ్ టీ (మేడిగడ్డ), అఫ్కాన్స్(అన్నారం), నవయుగ(సుందిళ్ల) సంస్థలను ప్రభుత్వం కోరింది. ఈ నెల 21(బుధవారం) నాటికల్లా ప్రణాళికలు అందిస్తే.. వాటి ఆధారంగా ముందుకెళ్తామని సూచించింది. అయితే, ఈ అంశంపై నిర్మాణ సంస్థల నుంచి ఎటువంటి స్పందన రాలేదు. మరోవైపు ఈ సారి ముందస్తుగా రుతుపవనాలు రానున్నాయనే సంకేతాల నేపథ్యంలో మూడు బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ సహా ఇతర అధికారులు గురువారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు/పంప్‌హౌస్‌లను పరిశీలించనున్నారు. వానాకాలంలోపు ప్రాథమికంగా ఏమేం చర్యలు తీసుకోవాలనే దానిపై క్షేత్రస్థాయిలో అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నారు.

జెన్‌కో సీఎండీగా హరీశ్ బాధ్యతల స్వీకరణ



హరీశ్

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జెన్‌కో సీఎండీగా ఎస్.హరీశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల ప్రభుత్వం జెన్‌కో సీఎండీగా నియమించిన విషయం తెలిసిందే. కొన్నిరోజులుగా సెలవులో ఉన్న ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సీఎండీగా ఉన్న సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం రిలీవ్ అయ్యారు.

అరెస్టు చేసి ఉండకపోతే.. పేలుడే!

- అప్పటికే ఐఈడీ తయారీకి సిద్ధం
- ఆన్‌లైన్‌లో పేలుడు పదార్థాల కొనుగోలు
- రాకెట్ లాంచర్ కోసం పైపుల కొనుగోలు
- విజయనగరంలో పేలుళ్లకు భారీ కుట్ర
- సిరాజ్ ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు

విజయనగరం, మే 21(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాకు చెందిన ఉగ్రవాద సానుభూతి పరుడు, నిషేధిత ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలు పెట్టుకుని పేలుళ్లకు కుట్రపన్నిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. తాజాగా సిరాజ్‌కు సంబంధించి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పలు విషయాలు.. సిరాజ్.. తన స్నేహితుడు, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌తో కలిసి పన్నిన కుట్రను స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ 20, 26, 30 తేదీల్లో ఉర్దూ పాఠశాల అడ్రస్‌తో ఆన్‌లైన్‌లో పేలుడు పదార్థాలు వచ్చినట్టు అధికారులు గుర్తించారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న రెండు సెల్‌ఫోన్లలో వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ట్విట్టర్, సిగ్నల్, టెలిగ్రామ్ వంటి అన్నిరకాల సమాచార యాప్‌లు ఉన్నాయి. వీటి ద్వారానే సిరాజ్, సమీర్ మధ్య పేలుడు పదార్థాల సేకరణ, వినియోగంపై గంటల తరబడి చాటింగ్ సాగిందని అధికారులు గుర్తించారు. విజయనగరంలో ఇద్దరు వ్యాపారులను పోలీసులు తాజాగా అదుపులోకి తీసుకున్నారు. వీరు నిందితులకు పేలుడు పదార్థాలను విక్రయించారని అనుమానిస్తున్నారు. ఇంకోవైపు సిరాజ్, సమీర్‌లను కస్టడీకి ఇవ్వాలని విజయగనగరం రెండో పట్టణ పోలీసులు ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు 10 మంది బృందాలుగా విడిపోయి నగరాన్ని జల్లెడ పడుతున్నాయి. సిరాజ్‌తో పాటు కుటుంబసభ్యుల బ్యాంక్ అకౌంట్ల వివరాలు ఇవ్వాలని నగరంలో అన్ని బ్యాంకుల అధికారులకు దర్యాప్తు అధికారులు సమాచారమిచ్చారు. మరోవైపు సిరాజ్‌తో పాటు కుటుంబ సభ్యులందరికీ డీసీసీబీ బ్యాంకుతో పాటు మరికొన్ని బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని తెలిసింది. సిరాజ్ తండ్రి(ఏఎస్ఐ) సోమ, మంగళవారాల్లో బ్యాంక్ లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నించగా బ్యాంకు అధికారులు అనుమతించలేదు. కాగా, సిరాజ్, అతని కుటుంబ సభ్యుల ఖాతాలను దర్యాప్తు సంస్థ, పోలీసులు సీజ్ చేశారని తెలిసింది.

ఎఫ్ఐఆర్‌లో ఏముంది?

సిరాజ్ ఎఫ్ఐఆర్‌లో పోలీసులు సంచలన విషయాలను పేర్కొన్నారు. ఈ నెల 16న కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారుల సమాచారంతో విజయనగరం పోలీసులు విజ్జీ స్టేడియం సమీపంలో సిరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఓ సంచిలో పేలుడుకు వినియోగించే వస్తువులు, ల్యాప్‌టాప్, ఇతరత్రా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని విచారించగా.. తాను బీటెక్ వరకు చదువుకున్నానని, కొత్తవలసలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశానని, అనంతరం హైదరాబాద్ వెళ్లి పలు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నాలు చేశానని వెల్లడించాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్ పరిచయం అయ్యాక.. వరంగల్‌కు చెందిన పరహాన్ మొహిద్దీన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖాదర్‌తో కూడా పరిచయం ఏర్పడిందని తెలిపాడు. ఖిలాఫత్, జీహాది తదితర విషయాలపై చర్చించుకున్నట్లు వెల్లడించాడు. రాకెట్ లాంచర్ తయారుచేయడం, దాన్ని వినియోగించడంపై ఆన్‌లైన్‌లో అధ్యయనం చేసి.. వాటి తయారీ కోసం విజయనగరంలో ప్లాస్టిక్ పైపులు, బ్లేడ్‌లు, ఇతర సామగ్రిని కొనుగోలు చేశాడు. ఐఈడీ(ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) తయారీకి సిద్ధమయ్యాడు.తనకు ఇన్‌స్టాలో పరిచయమైన వారిని కలిసేందుకు 2024, నవంబరు 22న ముంబైకి వెళ్లాడు. అంతకుముందు 2024, జనవరి 26న సహబాజ్, జీషాన్‌లను కలవడానికి ఢిల్లీ వెళ్లాడు. సౌదీలో ఉంటున్న బిహార్‌కు చెందిన అబూతాలమ్ అలియాస్ అబూముసాబ్ అనే వ్యక్తి సూచనతో తరచూ సిగ్నల్ యాప్ ద్వారా జిహాదీ కార్యకలాపాల వైపు ఆకర్షితుడయ్యాడు. ఐఈడీ బాంబులను తయారు చేసి ముందుగా విజయనగరంలో జనసమ్మర్ద ప్రాంతంలో పేల్చేందుకు నిర్ణయించుకున్నామని వెల్లడించాడు.

రోడ్డు ప్రమాదంలో కుటుంబం బలి!

- ప్రైవేటు బస్సును ఢీకొన్న కారు
- కారులోని నలుగురి దుర్మరణం
- కారు, బస్సు డ్రైవర్ల మృతి



భాస్కర్



పవిత్ర



అభిరామ్



జోత్స్న

గద్వాల క్రైం/బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబం బలైంది. ఆ పరివారంలోని ఐదుగురిలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదంలో కారు, బస్సు డ్రైవర్లు కూడా మృతిచెందారు. బాధిత బంధువుల వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన తెలుగు భాస్కర్(42) బ్యాంకు ఉద్యోగి. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కుర్తిలో విధులు నిర్వహించిన ఆయన ఇటీవలే హైదరాబాద్‌కు బదిలీ అయ్యాడు. ఈ సంతోషంలో భార్య పవిత్ర (36), కుమారుడు అభిరామ్ (14), ప్రవీణ్, కూతురు జోత్స్న (12)తో కలిసి కర్ణాటకలోని మురుడేశ్వరి దేవాలయానికి ఆయన వెళ్లాలనుకున్నాడు. బుధవారం డ్రైవర్ శివప్పను మాట్లాడుకొని అందరూ కలిసి కారులో బయలుదేరారు. కర్ణాటకలోని మునగులి సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును ఢీ కొట్టింది. ఈ క్రమంలో ఆ బస్సు వెనుక వస్తున్న కంటైనర్ లారీ బస్సును ఢీ కొట్టి రోడ్డుపక్కకు దూసుకుపోయింది. ఈ ఘటనలో బాస్కర్, పవిత్ర, అభిరామ్, జోత్స్న, కారు డ్రైవర్ శివప్ప, బస్సు డ్రైవర్ బసవరాజ్ రాథోడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. భాస్కర్ చిన్న కుమారుడు, ప్రవీణ్(10)కు గాయాలయ్యాయి. ఆ బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బస్సులోని పలువురికి గాయాలయ్యాయి.

అతి వేగంతో లారీని ఢీకొన్న కారు

ముగ్గురు యువకుల మృతి








త్రినాథ్‌రెడ్డి , వర్షిత్‌రెడ్డి , చంద్రసేనారెడ్డి

హయత్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్, మే 21(ఆంధ్రజ్యోతి): అతి వేగం ముగ్గురు యువకుల ప్రాణాలు తీసింది. మితిమీరిన వేగంతో కారులో ప్రయాణిస్తున్న యువకులు మూల మలుపు వద్ద వాహన వేగం నియంత్రించలేక ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. దీంతో ముగ్గురు ఘటనాస్థలిలోనే ప్రాణాలొదిలారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కుంట్లూరుకు చెందిన చుంచు జంగారెడ్డి, చుంచు శ్రీనివాస్‌రెడ్డి అన్నదమ్ములు. జంగారెడ్డి కుమారుడు త్రినాథ్ రెడ్డి(21), శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు వర్షిత్ రెడ్డి (20), అదే గ్రామానికి చెందిన పినింటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు చంద్రసేనారెడ్డి (24), కుంట్లూరుకే చెందిన ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు పవన్ కల్యాణ్ రెడ్డి(24) మంచి స్నేహితులు! మంగళవారం రాత్రి వీరంతా కారులో పెద్ద అంబర్‌పేట్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో శుభకార్యానికి కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు. భోజనాలయ్యాక కారులో కుటుంబసభ్యులను ఇంట్లో దిగబెట్టారు. తర్వాత వెంటనే వస్తామని ఇంట్లో చెప్పి నలుగురు కలిసి కారులో బయలుదేరారు. రాత్రంతా బయట తిరిగిన యువకులు, తెల్లవారు జామున ఇంటికి బయలుదేరారు. కుంట్లూరు రోడ్డులో ఎల్‌పీజీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు రాగానే ఓ మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో త్రినాథ్ రెడ్డి, వర్షిత్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి మృతిచెందారు. పవన్ కల్యాణ్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు.

భక్తజన సంద్రం.. త్రివేణీ సంగమం

- ఏడో రోజు లక్ష మందికిపైగా పుష్కర స్నానాలు



పుష్కర ఘాట్ వద్ద భక్తుల రద్దీ

భూపాలపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరం భక్తజన సంద్రంగా మారింది. సరస్వతీ నది పుష్కరాల ఏడో రోజు బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తాత్కాలిక బస్‌స్టాండ్ నుంచి ఘాట్‌కు వెళ్లేందుకు ఉచిత బస్సులను అందుబాటులో ఉంచారు. అదనపు పోలీస్ బలగాలతో అన్నారం క్రాస్ రోడ్డు నుంచి పుష్కర ఘాట్, తాత్కాలిక బస్‌స్టాండు వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ, సాయంత్రం వర్షంతో రోడ్లన్నీ బురదమయమై భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వచ్చే నాలుగైదు రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండడంతో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు, అదనపు పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. వచ్చే రెండు మూడు రోజుల్లో ఇక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉండడంతో ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి బృందాలను అప్రమత్తం చేశారు. బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు అంతర్వాహినిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, కాళేశ్వరంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం దంచికొట్టింది. దీంతో కాళేశ్వరక్షేత్రం, పుష్కర ఘాట్ పరిసరాలు జలమయమయ్యాయి. తాత్కాలిక బస్టాండ్, పార్కింగ్ స్థలం, టెంట్ సిటీ, స్టాళ్లు బురదమయ్యాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విశ్వ వైజ్ఞానికుడు

విశ్వం పుట్టుక, పరిణామం గురించి వైజ్ఞానిక ప్రపంచం ఆమోదం పొందనప్పటికీ ప్రభావదాయకమైన సిద్ధాంతాన్ని అభివృద్ధిపరిచిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ విష్ణు నార్లికర్. భారతీయ జిజ్ఞాస, పాశ్చాత్య శాస్త్ర ప్రతిభ మేళవింపే ఆయన మేధో మూర్తిమత్వం. నార్లికర్‌ను ఆధునిక ఆర్యభట్టుగా భావించడం సముచితంగా ఉంటుంది. విశ్వసాగర తీరాన అందమైన నత్తగుల్లలు, నునుపైన గులకరాళ్లను వెతుక్కుంటూ ఆవలి ఒడ్డుకు మంగళవారం ప్రాతఃకాలంలో వెళ్లిపోయిన చిరస్మరణీయ వైజ్ఞానికుడు.

మన దేశంలో ఆధునిక విశ్వశాస్త్ర అధ్యయనాలకు ఆద్యులలో ఒకరైన నార్లికర్ సామాన్య ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జీవితాంతం పలు విధాల కృషి చేసిన వైజ్ఞానికుడు. సివి రామన్, హోమీ భాభా, మేఘనాథ్ సాహా వలే విజ్ఞానశాస్త్ర విషయాలను ప్రజలకు సరళంగా, సుబోధకంగా వివరించగల ప్రతిభావంతుడు, ప్రశస్త విద్యా బోధకుడు. అన్నీ వేదాలలోనే ఉన్నాయట అనే ఆలోచనా ధోరణులను ఆయన గట్టిగా వ్యతిరేకించేవారు. పురాతన భారతదేశంలో విమానాలు ఉండేవని, ప్లాస్టిక్ సర్జరీ ఉండేవన్న వాదనలను ఆయన కొట్టివేసేవారు. అవి ఎంత అహేతుకమో, అసత్యాలో తన శ్రోతలు, పాఠకులు విశ్వసించేలా తేటతెల్లంగా చెప్పేవారు, రాసేవారు. శుద్ధ వైజ్ఞానిక విషయాలు ఎప్పుడూ గట్టి ప్రమాణాల ప్రాతిపదికనే ఉంటాయి సంప్రదాయ ఆలోచనా రీతులపై వైజ్ఞానిక దృక్పథం ఆధిక్యం వహించినప్పుడు మాత్రమే సమాజంలో పురోగతి సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు. 'ఆధునిక విజ్ఞానశాస్త్రాలు, సాంకేతికతలు విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాయి. వాస్తవాలను అంగీకరించి గౌరవించే వైఖరులను ప్రోత్సహిస్తున్నాయి. సంప్రదాయం కేవలం ఆచారం కనుక గౌరవించడాన్ని త్యజించేలా చేశాయి. అయితే ఇప్పుడు సంప్రదాయాలే మనలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. వాస్తవికంగా ఆలోచించేందుకు అవరోధమవుతున్నాయని' నెహ్రూ స్వాతంత్ర్యానికి పూర్వం అన్న మాటలను 2003లో తన 'ది సైంటిఫిక్ ఎడ్జ్' అన్న పుస్తకంలో ఉటంకించి, మన శ్రేయస్సుకు ఎంతో ఆవశ్యకమైన వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించుకునేందుకు ఇంకా చాలా దూరం పయనించవలసి ఉన్నదని నార్లికర్ స్పష్టంగా చెప్పారు. వాస్తవ సమస్యలను వైజ్ఞానిక దృక్పథంతో పరిష్కరించుకోవడమే వర్తమాన భారతదేశం ముందున్న ప్రధాన సవాల్ అని ఆయన గట్టిగా అభిప్రాయపడ్డారు. సైన్స్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లినందునే నార్లికర్‌ను మరాఠీ సాహిత్య ప్రపంచం 2021లో ప్రతిష్ఠాత్మక 'అఖిల్ భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్'కు అధ్యక్షుడుగా ఎన్నుకుని తనను తాను గౌరవించుకున్నది. నార్లికర్ ఆత్మకథ 'ఏ టేల్ ఆఫ్ ఫోర్ సిటీస్' మరాఠీ మాతృకకు జాతీయ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రస్తుతం ముప్పిరిగొంటున్న మతపరమైన భావోద్వేగాలను నివారించేలా ప్రజల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని వికసింప చేయడమే నార్లికర్‌కు సరైన నివాళి.

విద్యాధికులు అయిన తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో మేధో శిక్షణ పొందిన నార్లికర్ ఉన్నత విద్యాభ్యాసానికి బెనారస్ నుంచి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లారు. గణితశాస్త్రంలో ప్రశస్త ప్రతిభాపాటవాలు, ఖగోళ శాస్త్రవేత్త ఫ్రెడ్ హోయిల్ శిష్యరికం ఖగోళ భౌతికశాస్త్రంలో పథ నిర్దేశకుడుగా ఎదిగేందుకు నార్లికర్‌కు తోడ్పడ్డాయి. నార్లికర్ తన పరిశోధనా కృషిని ప్రారంభించే నాటికే ఫ్రెడ్ హోయిల్ మరో ఇద్దరు శాస్త్రవేత్తలతో కలిసి విశ్వం పుట్టుక, పరిణామంపై స్థిరస్థితి (స్టెడీ స్టేట్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. విశ్వానికి ఆద్యంతాలు ఉండవని, అది ఎప్పుడూ అస్తిత్వంలో స్థిరస్థితిలో ఉంటుందని ఈ సిద్ధాంతం ప్రతిపాదించింది. 'అందరూ భావిస్తున్నట్టు ఈ సిద్ధాంత ప్రతిపాదకుల్లో తాను లేనప్పటికీ, తరువాయి దశల్లో ఆ సిద్ధాంతాన్ని మౌలికంగా గణితాత్మకంగా చేసి క్వేజై- స్టెడీ స్టేట్ కాస్మాలజీ థియరీగా అభివృద్ధి పరచడంలో ప్రధాన భాగస్వామిగా ఉన్నానని నార్లికర్ చెప్పారు. విశ్వావిర్భావానికి సంబంధించి ఇప్పటికీ ప్రబలంగా ఉన్న, విశ్వశోధనలో మౌలిక పురోగతికి విశేషంగా దోహదం చేసిన బిగ్ బ్యాంగ్ (మహా విస్ఫోటం) సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిందే స్టెడీస్టేట్ థియరీ. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని సవాల్ చేసినప్పటికీ అది ప్రతిపాదించినట్టు విశ్వం నిరంతరం విస్తరిస్తుందనే విషయాన్ని అంగీకరించి హోయిల్, నార్లికర్‌లు తమ సిద్ధాంతంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ వైజ్ఞానిక జగత్తు బిగ్ బ్యాంగ్ థియరీనే ఆమోదిస్తూ వస్తోంది. 'విశ్వం మన పూర్వభావనలు లేదా పాక్షికాభిప్రాయాలకు అనుగుణంగా ఉండదు, ఆ బ్రహ్మాండాన్ని నిజాయితీగా అర్థం చేసుకునేందుకు మనం నిబద్ధమై ఉండాలని' నార్లికర్ తరచు అంటుండేవారు.. 1988లో యూజీసీ ఆహ్వానంపై పూణేలో ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్‌ను వ్యవస్థాపించారు. ఆ సంస్థ ద్వారా ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనల్లో భారతీయ ప్రతిభాపాటవాలు సమున్నతంగా వెలుగొందేలా చేశారు. భారతీయ వైజ్ఞానిక పరిశోధనల వికాసానికి ఆయన అందించిన మహోన్నతసేవ ఈ సంస్థేనని ఆయన సహచరులు, విద్యార్థులు ముక్తకంఠంతో చెబుతారు.

ఇందిర, మోదీ... ఇద్దరూ ఇద్దరే!

భారతదేశం – పాకిస్థాన్ మధ్య 1971 యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావం; 2025లో ఆపరేషన్ సిందూర్, ఈ రెండు సందర్భాల్లోనూ భారత్-అమెరికా మధ్య నెలకొన్న దౌత్య సంబంధాలు ప్రపంచ రాజకీయాల మీద ప్రభావం చూపాయి. భారత ప్రధాన మంత్రులు ఇందిరాగాంధీ నుంచి నరేంద్ర మోదీ దాకా, అమెరికా అధ్యక్షులు రిచర్డ్ నిక్సన్ నుంచి డొనాల్డ్ ట్రంప్ దాకా ఈ రెండు సందర్భాల్లోనూ నేతృత్వ శైలుల మధ్య తేడాలు, దౌత్య నైపుణ్యాలు, రాజకీయ వ్యూహాలు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను అరికట్టే దిశగా భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లను విశ్లేషించడం ఒక సవాలే.

1971లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అనుసరించిన పాకిస్థాన్ పక్షపాత దౌత్యతంత్రం; 2025లో ట్రంప్ అహంభావ, అనిర్ణయాత్మక రాజకీయ వైరుధ్యం... ఇవి రాజకీయ దౌత్య అధ్యయనాల్లో చర్చకు రావాల్సిన అంశాలు. నిక్సన్‌కు యాహ్యాఖాన్ మీద ప్రేమ లేకపోయినా, అమెరికా ప్రయోజనాల కోణంలో పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చి సహాయం అందించాడు. ట్రంప్ ప్రతిస్పందన వ్యక్తిగత ఆడంబరం. భారతదేశం-పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య కాల్పుల విరమణకు తానే కారకుడన్నట్లు, అదేపనిగా ఆర్భాటంగా చెప్పుకున్నాడు. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలేని నేత. అణ్వాయుధ ఉద్వేగాలకు ఆస్కారమున్న భారత ఉపఖండం విషయంలో, అగ్రరాజ్యాధినేతగా ప్రదర్శించాల్సిన గంభీరత, వ్యూహాత్మకత చతురత ట్రంప్ మాటలోను, నడతలోను ఇసుమంతైనా లేదు. ఇది దౌత్యనీతికి విరుద్ధం.

ఇందిరా గాంధీ నేతృత్వంలోని వ్యూహాత్మక, యుద్ధ–దౌత్యనీతి నిర్ణయాలు భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలిపాయి. నరేంద్రమోదీ నేతృత్వంలో జాగరూకతతో, ఒక్కొక్క అడుగు ముందుకు వేయాల్సి వచ్చింది. అమెరికా విదేశీ విధానంలో సంభవించిన మార్పులు, అంతర్జాతీయ స్థితిగతులే దీనికి కారణం. నిక్సన్‌ను ధీరోదాత్తంగా ఎదుర్కొన్న ఇందిరా గాంధీ భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అలవోకగా సమకూర్చారు. వర్తమాన వాతావరణానికి అనుగుణంగా, ట్రంప్ అనిశ్చితి నేపథ్యంలో, నరేంద్ర మోదీ అత్యంత జాగ్రత్తగా, స్వల్ప స్పందనతో సమయానుకూలంగా వ్యవహరించాల్సి వచ్చింది. అంతిమంగా, ఇందిర, మోదీలు ఇరువురూ, వారివారి పరిస్థితులకు అనుగుణంగా విజయాన్నే సాధించారు.

నిక్సన్ వ్యూహాత్మక అమెరికాకు ప్రతినిధి. ట్రంప్ చరిత్రతో సంబంధం లేకుండా, ప్రాదేశిక సమస్యల సంక్లిష్టతను పట్టించుకోకుండా, అవగాహనా రాహిత్యంతో వ్యవహరించారు. నిక్సన్ వైఖరి చర్చనీయాంశమే అయినప్పటికీ, అది సంస్థాగత పాలనాచట్రానికి అనుగుణంగా ఉన్నది. ట్రంప్ వ్యాఖ్యలు అమెరికా స్థాయికి ఏమాత్రం తగనివి. అవి విదేశాంగ విధానాన్ని వ్యక్తిగత ఆకాంక్షలుగా మలిచే ఆందోళనకర దృక్పథాన్ని ప్రతిబింబించాయి.



ఇందిరాగాంధీ యుద్ధ–దౌత్య నిర్ణయాలు భారత్‌ను శక్తివంతమైన దేశంగా నిలిపాయి. నరేంద్రమోదీ జాగరూకతతో, వ్యూహాత్మకంగా ఒక్కొక్క అడుగు వేయాల్సి వచ్చింది. అమెరికా విదేశీ విధానంలో సంభవించిన మార్పులు, అంతర్జాతీయ స్థితిగతులే దీనికి కారణం.

భారత్, అమెరికాలు కాలక్రమంలో పరిస్థితులకు అనుగుణంగా మార్పునకు గురయ్యాయి. భారత్ ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతుంటే, అమెరికా దౌత్యం గణాంకాల చట్రంలో ఇరుక్కుపోయింది. లాభనష్టాలు బేరీజు వేసుకుంటూ, అసందర్భ ప్రదర్శనల దిశగా జారిపోయింది. 1971 యుద్ధం ద్వారా ఉపఖండంలో తన ప్రాదేశిక ఆధిపత్యాన్ని దృఢపరచుకున్నది భారత్. 2025 పాక్-భారత్ సంఘర్షణ 'ప్రదర్శనాత్మక దౌత్యానికి' ఉన్న పరిమితులను బహిర్గతం చేసింది.

నిక్సన్-ట్రంప్, ఇందిర-మోదీల మధ్య తారతమ్యాన్ని, 1971–2025 మధ్యన చోటుచేసుకున్న విభిన్న భౌగోళిక–రాజకీయ ఘట్టాలను విశ్లేషణ చేయడం అవసరం. నిక్సన్, ట్రంప్‌లు భారత్-పాకిస్థాన్ సంక్షోభాలకు ఎలా స్పందించారు? ఇందిర, మోదీల ప్రతిస్పందనలు ఎలా భిన్నంగా అభివ్యక్తమయ్యాయి? అనేవి పరిశోధనకు అనువైన అంశాలు. వ్యూహాత్మక దౌత్యం, ప్రదర్శనాత్మక దౌత్యం మధ్య తేడాను విశ్లేషించడం, దేశవాళీ స్థాయిలో ఇందిర, మోదీల నాయకత్వ బలాన్ని, అంతర్జాతీయ వ్యవహారాలకు ఎలా అన్వయించారో గమనించడం, భారత వ్యూహాత్మక ప్రయోజనాల కోణంలో అమెరికా నాయకత్వాన్ని విశ్లేషణతో చూపడం లాంటి అంశాలన్నీ పరిశోధనకు తగినవే.

బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని మిగతా ప్రపంచం ఆశ్చర్యంతో వీక్షిస్తుండగా, ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు ఆవేదనతో, ఆవేశంతో రాసిన ఉత్తరాన్ని 1971 డిసెంబర్ 17న న్యూయార్క్ టైమ్స్ 'మిసెస్ గాంధీ రైట్స్ టు ప్రెసిడెంట్: యూఎస్ కుడ్ హావ్ అవర్టెడ్ వార్' శీర్షికతో ప్రచురించింది. దశాబ్దాలపాటు గుర్తుంచుకునే అపూర్వమైన 'దౌత్యపూరిత సంభాషణగా' భావించాల్సిన ఆ ఉత్తరంలో ఇందిరా గాంధీ– "మేము తప్పెక్కడ చేశామో మీరు చెప్పగలరా నిక్సన్?" అని అమెరికాను ధీటుగా, సూటిగా ప్రశ్నించారు. పక్షపాతంపై వ్యంగ్య స్పందనగా కాకుండా, సహేతుకమైన విమర్శగా నిలిచిందది.

ఇందిరా గాంధీ ఆవేశానికి చాలా కారణాలు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు నిక్సన్ పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించడం, తూర్పు పాకిస్థాన్‌లో రాజకీయ పరిష్కారాన్ని సాధించడానికి ఇందిరాగాంధీ హెన్రీ కిసింజర్‌కు ఇచ్చిన సూచనలు విఫలం కావడం, అమెరికా అణ్వస్త్ర నౌక బంగాళాఖాతంలోకి ప్రవేశించడం, అమెరికా నుంచి వెలువడిన వ్యాఖ్యలన్నీ భారతదేశంపై అది కక్షపూరితంగా ఉన్నదన్న భావనను కలిగించడం... ఇవన్నీ కలిసి ఇందిరాగాంధీ నిక్సన్‌కు ఉత్తరం రాయడానికి దారితీశాయి. ఈ లేఖను ఆమె నేరుగా నిక్సన్‌కు పంపారు.

అంతర్జాతీయంగా ఒంటరిదైనా, ఇందిరాగాంధీ నాయకత్వంలో భారతదేశం 1971 యుద్ధంలో గెలిచింది. సోవియెట్ యూనియన్‌తో స్నేహ ఒప్పందం, స్వదేశీ ఆయుధ బలం ఆధారంగా బంగ్లాదేశ్‌ను స్థాపించగలిగింది. గెలుపు తరువాత కూడా ఇందిరాగాంధీ ఓర్పుతో, సంయమనంతో, రాజనీతిజ్ఞతతో వ్యవహరించారు. "మాకు ఎటువంటి పాకిస్థాన్ భూభాగం అవసరం లేదు. తూర్పు పాకిస్థాన్‌గా ఉండి, ఇప్పుడు బంగ్లాదేశ్‌గా మారిన భూభాగం పట్లా, పశ్చిమ పాకిస్థాన్ భూభాగం పట్లా మాకు ఎలాంటి ఆకాంక్షా లేదు" అని ఆమె స్పష్టం చేశారు. "మాకు శాశ్వత శాంతి కావాలి, కానీ పాకిస్థాన్ దీనికి సిద్ధంగా ఉందా?" అనే ప్రశ్న సంధించారు. రాజకీయ పరిష్కారాన్ని సాధించేందుకు అమెరికా తన శక్తి, ప్రభావం, అధికారాలను వినియోగించి ఉండినట్లయితే, భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం తప్పించగలిగేది అని ఇందిరా గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.

అర్ధ శతాబ్దం తర్వాత, 2025లో చరిత్ర మరోలా పునరావృతమైంది. ఒకవైపు, నరేంద్రమోదీ నేతృత్వంలోని భారత్, ప్రపంచీకరణ రాజకీయాలపై ఆధారపడినదిగా మారింది. మరోవైపు, పాకిస్థాన్‌ను ప్రపంచ వేదికలపై ఒంటరిపరిచే పనిలో బిజీగా ఉంది. అప్పటి భారత్ "ఒంటరిగా నిలబడి గెలిచిన దేశం" కాగా ఇప్పటి భారత్ "సహచరులతో కలిసి గెలవాలనుకునే దేశం". ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో విజయవంతమైన ఆపరేషన్ సిందూర్ భారతదేశ సామర్థ్యాన్ని, ప్రపంచానికి చాటిచెప్పింది. తాను కోరుకున్న లక్ష్యాలను సాధించిన తరువాత పాకిస్థాన్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. పిలవని పేరంటంలాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వచ్చారు. సోషల్ మీడియా వేదికగా అసందర్భ ప్రకటనలు చేశారు. తానే మాట్లాడి ఇరుదేశాల మీద ఒత్తిడి పెంచి కాల్పుల విరమణ కోసం ఒప్పించానని ప్రకటించారు. అమెరికా అంతర్గత రాజకీయాల్లో తనకు మెప్పు లభించేలా ట్రంప్ వ్యవహార శైలి నడిచింది.

ఓర్పు, నేర్పు, చిత్తశుద్ధి, రాజకీయ పరిపక్వతతో ఇందిరాగాంధీ నిక్సన్‌కు ధీటుగా సమాధానం చెప్పి, దేశాన్ని గౌరవంతో ముందుకు నడిపించారు. ఇప్పుడు భారత్ ఒక గ్లోబల్ శక్తిగా ఎదిగిపోయింది. అమెరికాతో వ్యవహరించాల్సిన అవసరం వచ్చినప్పుడు ట్రంప్ నమ్మదగిన వ్యక్తి కాదని మోదీ గుర్తించి ఉంటారు. అందుకే ట్రంప్ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించారు. 1971లో ప్రపంచంలో తన స్థానం కోసం పోరాడిన భారతదేశం, 2025లో ప్రపంచంలో తన గౌరవాన్ని నిలబెట్టుకునే స్థాయికి వచ్చింది. రెండు సందర్భాలూ భారతదేశానికి ఒకే పాఠాన్ని నేర్పాయి– అంతర్జాతీయ వ్యవహారాల్లో శాశ్వత మిత్రులూ, శాశ్వత శత్రువులూ ఉండరని. శక్తి సామర్థ్యాలను, మైత్రిని, విశ్వసనీయతను సమపాళ్లలో నైపుణ్యంగా వినియోగించగల నాయకత్వమే నిర్ణయాత్మకమవుతుంది. ఇందిరాగాంధీ భారత్‌ను పునర్నిర్వచించారు. అంతర్జాతీయ సంబంధాలను మోదీ నూతన దిశగా తీసుకెళ్లారు. ఇద్దరూ ఇద్దరే. ఇద్దరూ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టినవారే.

▪ వనం జ్వాలానరసింహారావు

ప్రవాసులపై ట్రంప్ మరో పిడుగు!

ట్రంప్ పరిపాలనా సరళిలోనే 'అమెరికా ఫస్ట్' అనే నినాదం అంతర్భాగం. ఆయనకు అమెరికా ప్రయోజనాలు మాత్రమే ముఖ్యం. అందుకోసం తీసుకునే నిర్ణయాలు మిగిలిన ప్రపంచం మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయనేది వారికి ముఖ్యం కాదు. అగ్రరాజ్యంగా అమెరికా తీసుకునే నిర్ణయాలు యావత్ ప్రపంచాన్ని కూడా ప్రభావితం చేయగల నేపథ్యంలో ట్రంప్ సర్కారు సరికొత్త ఆలోచన ప్రకంపనలు పుట్టిస్తోంది. అమెరికా పౌరులు కానివారు అంతర్జాతీయంగా చేసే నగదు చెల్లింపులపై ఐదు శాతం సుంకం విధించాలనే బిల్లును ట్రంప్ ప్రభుత్వం రూపొందించింది. ఈ బిల్లు అమెరికాలోని విదేశీయులలో, ముఖ్యంగా భారతీయ సమాజంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ బిల్లు గురించి మధ్య, దిగువ మధ్య తరగతికి చెందిన వారంతా బాగా ఆందోళన చెందుతున్నారు. అమెరికా నుంచి పెద్ద మొత్తాల్లో నగదు చెల్లింపులు పొందుతున్న దేశాల్లో మొదటిస్థానం ఇండియాదే. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 2023లో అంతర్జాతీయంగా అన్ని దేశాల నుంచి భారత్‌కు చేరిన నగదు చెల్లింపులు అన్నీ కలిపి 125 బిలియన్ డాలర్లు కాగా, అందులో కేవలం అమెరికా నుంచి వచ్చిన భాగమే 89 బిలియన్ డాలర్లు ఉంది! అమెరికాలోని ఆర్థిక వ్యవహారాల్లో భారతీయ సమాజం చూపించగల ముద్ర ఏమిటన్నదానికి ఈ నివ్వెరపరిచే లెక్కలే సాక్ష్యమంటూ అమెరికన్ మీడియా ప్రధానంగా ప్రస్తావించింది.

ఇంత పెద్దమొత్తాలుదులో అమెరికా నుంచి భారత్‌కు నగదు తరలుతుండడానికి అనేక కారణాలున్నాయి. ఇండియాలో ఉన్న తమ తల్లిదండ్రులు జీవనం గడపడానికి; తమ నుంచి ఆర్థికంగా మద్దతు ఆశించే సోదరులు, కుటుంబ సభ్యులకు పంపడానికి; వారి ఆరోగ్య అవసరాలు తీర్చడానికి డబ్బు పంపడం సర్వసాధారణం. ఇండియాలో రియల్ ఎస్టేట్‌లోను, ఇతర వ్యాపారాల్లోనూ పెట్టుబడులు పెట్టడానికి అమెరికా నుంచి నిధులు పంపేవాళ్లు కూడా ఉన్నారు. భారత్‌లో రియల్ ఎస్టేట్ రంగాలు ఆకర్షణీయమైన వృద్ధిని నమోదు చేస్తుండడంతో పాటు, స్వదేశంలో పెట్టుబడులు పెట్టడం అనేది భవిష్యత్ భద్రతకు పునాదులు వేస్తాయని వారు నమ్ముతుండడం కూడా ఇందుకు ఒక కారణం. అలాగే అమెరికాలోని పలువురు భారతీయులు రిటైర్మెంట్ తర్వాత తమ విరామ జీవితాన్ని గడపడానికి కూడా భారత్‌నే ఎంచుకుంటూ ఉంటారు. పోల్చి చూసినప్పుడు ఇండియాలో జీవనవ్యయం అమెరికా కంటే బాగా తక్కువ కావడంతో రిటైరైన తర్వాత అక్కడకు వెళ్ళే ఉద్దేశంతో ముందే పొదుపు పథకాల్లోను, బీమా, పెన్షన్ పథకాల్లోనూ సొమ్ములుపెట్టే వాళ్ల సంఖ్య కూడా ఎక్కువే.



అమెరికా నుంచి భారత్‌కు అందుతున్న నగదుకు కారణాలు ఏమైనా కావొచ్చుగాక. కానీ ఆ చెల్లింపుల మీద ఐదు శాతం సుంకం విధించాలన్న ట్రంప్ నిర్ణయం ఆ సొమ్ము అటు పంపుతున్న, ఇటు స్వీకరిస్తున్న వారి జీవితాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది.

అలాగే అమెరికాలోని భారతీయ సమాజం దాతృత్వానికి కూడా పెట్టింది పేరు. స్వదేశంలో వివిధ సేవా కార్యక్రమాల కోసం అమెరికా నుంచి బిలియన్లలో డాలర్లు ఖర్చు పెడుతుంటారు. సామాజిక సమస్యల కోసం, విపత్తు సమయాల్లోను ఇది మరింతగా కనిపిస్తుంటుంది. మనం ఎదిగి వచ్చిన సమాజానికి తిరిగి రుణం తీర్చుకోవడం అనేది భారతీయ సంస్కృతి మూలాల్లోనే ఉన్న అంశం కావడంతో వీరిలో ఆ వైఖరి ఎక్కువ. అమెరికాలో స్థిరపడేలా గ్రీన్ కార్డు పొందడంలో ఉన్న ఇబ్బందులు, అస్థిర పరిస్థితులు, సుదీర్ఘకాలం ఎదురుచూడాల్సిన అవసరం లాంటి వాతావరణం ఇక్కడి భారతీయ సమాజాన్ని భారత్‌కు డబ్బు తరలించేందుకు ప్రేరేపిస్తుంటుంది. అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితుల్లో ఉన్నవారు– ప్రత్యేకించి హెచ్-1బి లేదా ఎల్-1 వీసాల మీద ఉన్నవారు– తమ స్వదేశంలో ఆర్థిక భద్రతకే అధిక ప్రాధాన్యం ఇస్తుండడం కూడా ఒక కారణం. తమ మిత్రులు, బంధువులకు కానుకలు పంపేవారు; అమెరికాలో చదువులకోసం భారత్‌లో తీసుకున్న విద్యారుణాలకు తిరిగి చెల్లింపులు చేసేవారు కూడా ఎక్కువే.

ఇలాంటి కారణాలతో అమెరికా నుంచి భారత్‌కు నగదు చెల్లింపులు భారీగానే జరుగుతాయి. అయితే ఇప్పుడు ఈ చెల్లింపుల మీద 5 శాతం సుంకం విధించడానికి ట్రంప్ నిర్ణయించడం వీరందరినీ కూడా ప్రభావితం చేస్తుంది. పెట్టుబడులు, రాబడి మార్గాల కోసం అమెరికా నుంచి డబ్బు పంపేవారు ఈ కొత్త సుంకాన్ని కూడా పద్దులో రాసుకుని, ఆ మేరకు తమ లాభాలు ప్లాన్ చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే భారత్‌లో ఉన్న తమ కుటుంబాలు గడవడానికి, తల్లిదండ్రులను పోషించడానికి, విద్యారుణాలు చెల్లించడానికి ఇక్కడి నుంచి డబ్బు పంపుతున్న వారికి ప్రభుత్వం అదనంగా ఒక్క శాతం సుంకం విధించినా అది చాలా పెద్ద భారం.

అమెరికా నుంచి భారత్‌కు అందుతున్న నగదుకు కారణాలు ఏమైనా కావొచ్చుగాక. కానీ ఆ చెల్లింపుల మీద 5 శాతం సుంకం విధించాలన్న ట్రంప్ నిర్ణయం ఆ సొమ్ము అటు పంపుతున్న, ఇటు స్వీకరిస్తున్న వారి జీవితాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. ఆర్థిక లావాదేవీల మీద సుంకాలు విధించడం వంటి నిర్ణయాలు తీసుకునే ముందు జరుగుతున్న చెల్లింపుల మౌలిక స్వభావం ఏమిటో అర్థం చేసుకోవడం ముఖ్యం. అన్ని రకాల వ్యవహారాలను ఒకే గాటన కట్టేసినట్టుగా విదేశాలకు జరిగే ప్రతి చెల్లింపు మీద గంపగుత్తగా 5 శాతం సుంకం విధించడం చాలామంది జీవితాలను ప్రభావితం చేస్తుంది. భారతీయులు మాత్రమే గాక, అనేక దేశాల నుంచి అమెరికాకు వచ్చి తమ దేశాల్లోని కుటుంబాలను పోషించుకోవడానికి ఇక్కడ కష్టపడుతున్న వారంతా కూడా ఈ నిర్ణయం వల్ల ఆందోళనకు గురవుతున్నారు.

అమెరికాలోని వ్యక్తులు తమ స్వదేశానికి పంపే సొమ్ములను, ఇతర దేశాలకు పంపే సొమ్ములను వేర్వేరుగా చూడాలి. పైగా అమెరికాలో ఉంటున్న వారిలో గరిష్ఠంగా స్వదేశంలో తల్లిదండ్రుల కుటుంబపోషణ నిమిత్తం ప్రతి నెలా వెయ్యి, రెండువేల డాలర్ల వరకు పంపడం జరుగుతుంది. నెలవారీగా జరిగే ఇలాంటి చిన్న చెల్లింపులను, స్వదేశంలో సేవా కార్యక్రమాలకు వెచ్చించే మొత్తాలను, సుంకం పరిధి నుంచి మినహాయించాలని భారతీయ సమాజం కోరుకుంటోంది. భారత్‌లో మధ్యతరగతి కుటుంబాలు అనేక కష్టనష్టాలకోర్చి, అప్పులుచేసి ఆస్తులు అమ్మి పిల్లలను అమెరికాకు పైచదువుల కోసం పంపుతుంటారు. అక్కడ ఉద్యోగాలు పొందగలిగితే తమ కష్టాలు, రుణాలు తీరుతాయనే ఆశతో అక్కడి నుంచి రాగల సొమ్ముకోసం ఎదురుచూస్తుంటారు. అలాంటి వారి జీవితాలన్నీ ఈ సుంకంతో ప్రభావితం అవుతాయి.

భారత విదేశాంగ శాఖ ఇలాంటి వ్యవహారాల్లో చొరవ చూపించాలి. వ్యాపారుల ప్రయోజనాలను అత్యధికంగా ప్రభావితం చేసే సుంకాల విషయంలో ట్రంప్ ప్రభుత్వానికి లేఖ రాసిన భారత ప్రభుత్వం, అదే విధంగా అమెరికాలోని భారతీయ సామాన్యుల కోణంలో కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. అమెరికా నుంచి భారత్‌కు జరిగే వ్యక్తిగత చెల్లింపులలో ఒక పరిమితి వరకు సుంకాలు లేకుండా ఉండే విధానం రావాలి.

○ కృష్ణమోహన్ దాసరి
పాత్రికేయుడు, డల్లాస్

విధ్వంసాన్ని ఆపకపోతే వినాశనమే

ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూసే అభివృద్ధి చెందిన దేశాల అహంకారపూరిత వైఖరే నేడు భూమ్మీద సకల జీవరాశి ఎదుర్కొంటున్న సమస్త సంక్షోభాలకూ కారణం. నిత్యం పరిశ్రమల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలు, ఇతర వ్యర్థాల కారణంగా వాతావరణం నానాటికీ వేడెక్కుతోంది. భూమ్మీద జీవరాశుల మనుగడ కష్టమవుతోంది. 'ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి' అనే థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని ప్రపంచ దేశాలను ఐక్యరాజ్య సమితి కోరింది. మానవ చర్యల కారణంగా వేగంగా అంతరించిపోతున్న అనేక జీవజాతుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా దేశాలకు సూచించింది. పెరుగుతున్న కాలుష్యం, రెట్టింపవుతున్న భూతాపం, సహజ వనరుల క్షీణత, విచ్ఛిన్నమవుతున్న ఓజోన్ పొర వంటి సమస్యల వల్ల కోట్లాది జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు 1972లో స్టాక్‌హోం సదస్సు, 1997లో జపాన్‌లోని క్యోటో వాతావరణ సదస్సుల్లో అనేక తీర్మానాలను ప్రవేశపెట్టారు.

పెరుగుతున్న భూతాపం వల్ల ప్రతి సంవత్సరం ఎన్నో వేల జీవజాతులు అంతరించిపోతున్నాయని జీవవైవిధ్య పితామహుడు, అమెరికా ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎడ్వర్డ్. ఒ. విల్సన్ హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న 30 సంవత్సరాలలో 20 శాతం జీవజాతులు పూర్తిగా అంతరించి పోతాయని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 24 శాతం క్షీరదజాతులు, 12 శాతం పక్షిజాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. జన్యు పంటలు సగానికిపైగా కనబడకుండా పోయాయి. పగడపు దిబ్బలు ఇప్పటికే 75 శాతం పైగా ధ్వంసమై పోయాయి. రానున్న 20 సంవత్సరాల్లో ప్రస్తుతమున్న 620 రకాల వానర జాతుల్లో 120కి పైగా జాతులు అంతరించిపోయే ప్రమాదముందని జీవ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఏటా రెండు బిలియన్ టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్‌ను శోషించుకునే సమశీతోష్ణ మండలాల్లోని సతత హరితారణ్యాలతో పాటు, సుమారు 12 లక్షల హెక్టార్ల ఇతర అడవులు గడచిన దశాబ్ద కాలంలో నరికివేతకు గురయ్యాయని అంచనా.



ప్రపంచ జీవవైవిధ్యంలో మన దేశం 8శాతం వాటాతో 7వ స్థానంలో ఉంది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉండగా, బ్రెజిల్ రెండో స్థానంలో ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా భారతదేశంలో వేలాది జీవజాతులు మనుగడ కోల్పోతున్నాయని 'ఇంటర్ గవర్నమెంటల్ సైన్సు పాలసీ ప్లాట్‌ఫాం' అనే అధ్యయన సంస్థ తెలిపింది. ఈ పరిస్థితిని మార్చేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించింది.

పరిమితమైన వనరులను వినియోగించుకుని, అపరిమితమైన ఆర్థికవృద్ధిని సాధించే దిశగా పారిశ్రామిక దేశాలు ఆలోచన చేయాల్సిన సమయమిది. అప్పుడు మాత్రమే సహజవనరులపై ఒత్తిడి తగ్గి, కోల్పోయిన జీవావరణాన్ని తిరిగి పునరుద్ధరించగలిగే అవకాశం ఉంటుంది. లేకపోతే కోట్లాది జీవులకు అమ్మగా భావించే భూమాత మరుభూమిగా మారిపోతుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అదే జరిగితే మనిషి తన మరణ శాసనం తాను రాసుకున్నట్టే.

– డాక్టర్ కె. శశిధర్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
(నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం)

సైన్యంపై చులకన మాటలొద్దు!

భారతదేశ సరిహద్దు సుమారు 15,200 కిలోమీటర్లు. ఇది పశ్చిమంలో గుజరాత్ నుంచి తూర్పున మిజోరాం వరకు ఉంది. ఈ సరిహద్దు అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సరిహద్దులతో కూడి ఉంటుంది. ఇంత సుదీర్ఘ సరిహద్దుని వివిధ వాతావరణ పరిస్థితుల్లో కాపాడడం అంటే మాటలు కాదు. సరిహద్దు రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్, పంజాబ్‌లలో పగటిపూట ఉష్ణోగ్రత 55/60 డిగ్రీల సెల్సియస్ ఉంటే, రాత్రిపూట మైనస్ 20కి తగ్గిపోతుంది. అదీగాక ఈ ప్రాంతాల్లో ఎడారి విషపురుగులు, పాములు ఎక్కువ. ఇక్కడి వేడికి శరీరం బొబ్బలెక్కుతుంది. అటువంటప్పుడు బరువైన బూట్లలో ఉండే సైనికుల కాళ్ళు పుండ్లు పడిపోతాయి. అలాగే ఉత్తరాన హిమాలయాల్లో పగటి ఉష్ణోగ్రతలే మైనస్ 40/50 డిగ్రీలు ఉంటుంది. పైగా దుర్గమ పర్వత ప్రాంతం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోయలోకి జారడం ఖాయం. ఎత్తైన హిమాలయాల్లో సైనికుల్ని మూడు నాలుగు నెలల కంటే ఎక్కువ ఉంచరు. అక్కడ ఉన్నన్ని రోజులు సైనికులకు స్నానం, దుస్తులు మార్చుకోవడం ఉండదు. మూడు నెలల తరువాత వారు సురక్షిత ప్రాంతాలకు వచ్చినప్పుడు చేసే మొదటి పని ఆ దుస్తులు విప్పి కాల్చేయడం! అక్కడి చలికి వేళ్ళు కొంకర్లు తిరుగుతాయి. ఫ్రాస్ట్ బైట్‌కు గురవుతారు. ఆ ఎత్తయిన ప్రాతంలో ఒకవేళ ఎవరైనా జబ్బుపడ్డా, గాయాల పాలైనా, మరణించినా, వాళ్ళను తరలించడానికి హెలికాప్టర్ ఒక్కటే మార్గం. ఆ వాతావరణంలో హెలికాప్టర్ వస్తుందో రాదో కూడా చెప్పలేం! ఇక ఈశాన్య ప్రాంతాల సరిహద్దు విషయానికి వస్తే ఆ ప్రాంతం పర్వత ప్రాంతం, పైగా దట్టమైన అడవులు. ఏ చెట్టు చాటు నుంచి ఎవరు చొరబడుతున్నారో, ఏ పొదల చాటు నుంచి ఎవరు కాల్పులు జరుపుతారో నిత్యం గమనిస్తూ కాపలా కాయాలి.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో సైనికులు దేశం లోపల ఉన్న మనల్ని శత్రువుల నుంచి, ఉగ్రవాదుల నుంచి భయం లేకుండా కాపాడుతుంటారు. అది నిరంతర ప్రక్రియ. ఏ మాత్రం అప్రమత్తత వీడకూడదు. అప్పుడే దేశం లోపల మనమంతా నిశ్చింతగా, సక్రమంగా మన పనులు చేసుకోగలుగుతాం, చేసుకుంటున్నాం. దేశం ఇప్పటికి ఐదు యుద్ధాలు చేసింది 1947–48, 1965–66, 1971, 1999 సంవత్సరాల్లో నాలుగు సార్లు పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఓడించింది. 1963లో చైనాతో యుద్ధం చేసి వారిని చొరబడకుండా నిలువరించింది. ఈ ఐదు యుద్ధాల్లో మన జవాన్లు, అధికారులు ఎందరో హతమయ్యారు, మరెందరో క్షతగాత్రులయ్యారు. అయినా కొన్ని కుటుంబాలు, కొన్ని ఊళ్లకు ఊళ్లే తమ కుటుంబ సభ్యులను సైన్యంలోకి పంపడానికి ఉత్సాహం చూపుతాయి. బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ఊళ్లలో సైనికుడు లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. దేశ సేవకి తమ వంతు పాత్ర పోషిస్తున్నామనే సంతోషం వారిది. సైన్యంలో లేనివాళ్లు సహజంగా అనుకుంటుంటారు– 'వారికేం, ప్రభుత్వం వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తోంది కదా' అని. కాని అది వారికీ, వాళ్ళు చేసిన చేసిన సేవకి ప్రభుత్వం, ప్రజలు తీర్చుకుంటున్న ఋణం మాత్రమే! ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే, దేశం లోపల ఉన్న మనలో కొందరు సైన్యాన్ని గురించి అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ నాయకులు, అందునా రాజ్యాంగపరమైన పదవిలో ఉన్నవారు.



దేశం లోపల ఉన్న మనల్ని శత్రువుల నుంచి, ఉగ్రవాదుల నుంచి భయం లేకుండా సైనికులు కాపాడుతుంటారు. అయితే మనలో కొందరు సైన్యాన్ని గురించి అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. సైనికుల మనోబలాన్ని దిగజార్చే వాఖ్యలు, చర్యలు ఇకముందు ఉండకుండా చూడాలి.

మొన్నటికి మొన్న మధ్యప్రదేశ్ కేబినెట్ మంత్రి విజయ్ షా "వాళ్ళు పహల్గామ్ టెర్రరిస్టులు మతం అడిగి హిందువులను చంపారు కాబట్టి మోదీ వాళ్ళ సోదరినే వాళ్ళ పీచ మణచడానికి పంపారు" అని వ్యాఖ్యానించాడు. కల్నల్ సోఫియా ఖురేషి ఒక ముస్లిం వనిత కాబట్టి అలా అన్నాడు. సైన్యం గురించి అతిగొప్పగా చెప్పే మోదీ గాని, బీజేపీ కానీ ఆయన మీద ఏ విధమైన చర్య తీసుకోలేదు. కారణం, మధ్యప్రదేశ్ మొత్తం జనాభాలో 23 శాతం ఆదివాసీలున్నారు. ఈ 23 శాతంలో 35 శాతం గోండులు. ఈ విజయ్ షా గోండు సముదాయానికి చెందినవాడు. అతని మీద చర్య తీసుకుంటే గోండుల ఓట్లతో పాటు, ఆదివాసీల ఓట్లు పడవేమో అన్న భయం. విజయ్ షా వ్యాఖ్యానించిన రెండవ రోజు అదే మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, "దేశ సైన్యంతో పాటు దేశ జనాభా మొత్తం మోదీ ముందు మోకరిల్లుతుంది" అని వాఖ్యానించారు. ఏ దేశ సైన్యం పేరు చెప్పుకుని వీళ్ళు ఓట్లు తెచ్చుకుంటారో ఆ సైన్యాన్ని ఈ విధంగా అవమానించడం సహించరాని విషయం. దేశ రక్షణను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా బీజేపీ ఆ ఇద్దరు మంత్రులపై చర్య తీసుకోవాలని, సైనికుల మనోబలాన్ని దిగజార్చే వాఖ్యలు, చర్యలు ఇక ముందు ఉండకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

• పి. జయప్రకాష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్టం 33.4 కనిష్టం 25.6

కుంట్లూరులో విషాదఛాయలు
● మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



6



భవనం ముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

ఆపద వస్తే ఆగమాగమే!

గుల్జార్‌హౌజ్‌లో ఎన్నో గండాలు

రక్షణ లేని విద్యుత్ వ్యవస్థ

వేలాడుతున్న తీగలు.. తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్సులు
వానాకాలంలో షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలకు ఆస్కారం
అంబులెన్స్‌లు, ఫైర్ వాహనాలు వచ్చే దారులు కరువు
బిజీబిజీగా మదీనా టు చార్మినార్.. పాదచారులు నడిచేందుకూ ఇబ్బందులే.. ఇప్పటికైనా గుణపాఠం నేర్చేనా?

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ గుల్జార్‌హౌజ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. అధికారులు, స్థానిక వ్యాపారులు ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ప్రతీ విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఫ్యూజ్ బాక్సులు తెరిచే ఉంటున్నాయి. వాటి పక్కనే దుకాణదారులు వస్త్రాలను, సామగ్రిని డిస్‌ప్లేగా వేలాడదీస్తున్నారు. ఓవర్ లోడ్ అయి ఫ్యూజ్ బాక్స్‌ల్లో మంటలు చెలరేగితే, అక్కడే ఉన్న వస్త్రాల వల్ల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లను ఆనుకొని వ్యాపార కేంద్రాలు నిర్వహిస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు.

విద్యుత్ చౌర్యం కట్టడేది?

గుల్జార్‌హౌజ్‌లోని కొందరు వ్యాపారులు రాత్రి వేళల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దానివల్ల లోడ్ పెరిగి విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని చెబుతున్నారు. వాణిజ్య భవనాల్లో లెక్కకు మించి ఏసీలను వినియోగిస్తున్నా, చౌర్యానికి పాల్పడుతున్నా కట్టడికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార కేంద్రాలకు నిలయాలైన



గుల్జార్‌హౌజ్‌లో తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్సులు, బయటకు వేలాడుతున్న తీగలు

గుల్జార్‌హౌజ్, బేగంబజార్, మదీనా, అఫ్జల్ గంజ్ వంటి ప్రాంతాల్లో షాపుల ముందు గుట్టలుగా విద్యుత్‌తీగలు, ఫోకస్ లైట్లు వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. స్విచ్‌బాక్సులకు మూతలు లేకపోవడంతో కొంతమంది స్థానిక వ్యాపారులు నేరుగా ఆ బాక్సుల్లో ఫ్యూజ్‌లకు తీగలు తగిలిస్తూ చౌర్యానికి పాల్పడుతున్నారు. కమర్షియల్ భవనంలో అగ్నిప్రమాదం జరిగి 17 మంది

మిగతా 6వ పేజీలో..

అర్ధరాత్రి అతివేగం.. గాల్లోకి ప్రాణం

రోడ్లపై కబళిస్తున్న మృత్యువు

అతివేగం+ నిర్లక్ష్యం+మద్యం మత్తులో డ్రైవింగ్

రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం.. దుర్భరమవుతున్న జీవితాలు

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి)

● రాత్రి శుభకార్యానికి వెళ్లి వచ్చిన నలుగురు యువకులు.. ఇప్పుడే వస్తామని ఇంట్లో చెప్పి కారులో బయల్దేరారు. తెల్లవారుజామున ఇంటికి వస్తున్న క్రమంలో అదుపు తప్పి డీసీఎంను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున హయత్‌నగర్ కుంట్లూరులో జరిగింది. చెట్టంత కొడుకులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

● ఇటీవల రాజేంద్రనగర్ పరిధిలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు యాక్సిడెంట్‌లో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వాహనం ఆగిపోవడంతో రోడ్డు పక్కన ఆపి మరమ్మతులు చేస్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో అతడు మృతి చెందాడు.





కుంట్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదం (సీసీ ఫుటేజీ చిత్రాలు)



ఏటా వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వందలాది మంది మృత్యువాత పడుతున్నారు, వేలాది మంది క్షతగాత్రులవుతున్నారు. వాహనదారుల నిర్లక్ష్యం, అతివేగంతోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసుల పరిశీలనలో తేలింది. రోడ్డుపై వెళ్తున్న క్రమంలో సరైన పద్ధతులు, నిబంధనలు ఉల్లంఘించడం వల్ల కూడా తమంతట తాము ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, సీటు బెల్టు, హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని చెబుతున్నారు. చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తూ ప్రమాదాలకు గురై అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇతరుల జీవితాల్లోనూ చీకట్లను నింపుతున్నారు.

ఆగి ఉంటున్న మృత్యువు

ఇతర ప్రాంతాలకు చెందిన లారీలు, భారీ వాహనాల డ్రైవర్లు అర్ధరాత్రి దాటిన తర్వాత ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. లైటింగ్ సరిగా లేకపోవడంతో రోడ్డుపై ఆగి ఉన్న వాహనాలు దూరం నుంచి కనిపించడం లేదు. ఇతర వాహనాలు వేగంతో వెళ్లి వాటిని ఢీ కొడుతున్నాయి. దాంతో జాతీయ రహదారులు, ఓఆర్ఆర్ సహా చాలా రోడ్లు రక్తమోడుతున్నాయి. ఏటా వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వేలాది మంది మత్యువాత పడుతున్నారు. కొన్ని వేల మంది క్షతగాత్రులవుతున్నారు. ఏదైనా మరమ్మతులకు గురైనప్పుడు, లేక ఇతర అవసరాల

మిగతా 6వ పేజీలో..

గంటలో కుండపోత

● మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచేసిన వరద
● రహదారులు జలమయం
● బండ్లగూడలో అత్యధికంగా 8.8 సెం.మీ వర్షం
● ఎల్‌బీనగర్‌లో కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్
● మరో మూడురోజులు వర్షాలు



మూసారాంబాగ్ బ్రిడ్జిపై నిలిచిన వరద నీటిలో వాహనదారుడి ఇబ్బందులు

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం రాత్రి 9 గంటల వరకు మోస్తరుగా మొదలైన వాన రాత్రి 10 గంటల ప్రాంతంలో దంచి కొట్టింది. కుండపోత వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. మూసారాంబాగ్ బ్రిడ్జిని వరదనీరు ముంచేసింది. మలక్‌పేట ప్రధాన రహదారిపై వాన నీరు నిలిచిపోవడంతో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. కోఠి, చాదర్‌ఘాట్ నుంచి నల్లగొండ ఎక్స్‌రోడ్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ అయింది. దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్ ప్రధాన రహదారిలో గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు

మిగతా 8వ పేజీలో..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి ఒడ్డెన్న తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆయన సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో తన కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. జిల్లాలో మొత్తం 119 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఫస్టియర్‌కు 43,061 మంది, సెకండియర్‌కు 31,996 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. కాగా పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. మే22 నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి.



మందుల నిల్వ.. జర భద్రం
● నిబంధనలు పాటించాలి
● సరైన ఉష్ణోగ్రతలో స్టోరేజీ చేయకపోతే ముప్పే
● ఎండ వేడికి డైల్యూట్ అవుతాయంటున్న వైద్యులు

6

భాగ్య విధాత.. భాగ్యరెడ్డి వర్మ
● సామాజిక రుగ్మతలపై సమరభేరి మోగించిన చైతన్య దీప్తి
● నేడు జయంతి



6



అందుబాటులోకి టోలిచౌకి పోలీస్‌స్టేషన్
● త్వరలో అధికారికంగా ప్రారంభం

6

పెళ్లి పేరుతో మోసం
● యువతికి పలుమార్లు అబార్షన్
● పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

6

హైడ్రా కూల్చివేతలు.. హర్షం

రోడ్డు కబ్జా చేసిన పాఠశాల యాజమాన్యం

నిర్మాణాలు కూల్చివేత

పీర్జాదిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, మేడిపల్లి సర్వే నంబర్ 26ఎ, సీపీఆర్ఐ పవర్ సంస్థ, సెజ్ స్కూల్ ప్రాంగణంలో ఆర్ఏఆర్ కాలనీకి సంబంధించిన రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని కాలనీవాసులు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సీఐ సైదులు ఆధ్వర్యంలో ఆక్రమణలను బుధవారం నేలమట్టం చేశారు. 15 సంవత్సరాలుగా రోడ్డు కబ్జాపై పోరాడుతున్నామని, హైడ్రా మూలంగా ఇన్నేళ్లకు కాలనీకి సంబంధించిన రోడ్డు వినియోగంలోకి రానుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

పీర్జాదిగూడలో రంగనాథ్ పర్యటన

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆక్రమాలపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. పర్వతాపూర్ సర్వే నంబర్-1లో మైనారిటీ గ్రేవ్ యార్డుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని అందిన ఫిర్యాదు మేరకు స్థానికంగా విచారణ చేపట్టారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పర్వతాపూర్‌లోని గ్రేవ్ యార్డును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులు

రంగనాథ నగర్ లేఔట్ పరిశీలన

రాయదుర్గం, మే21(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి గోపనపల్లిలోని రంగనాథనగర్ లేఔట్‌ను కూడా రంగనాథ్ పరిశీలించారు. తమను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరించి తమ ప్లాట్లలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రంగనాథ్ బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పరిష్కరిస్తామని వారికి తెలిపారు.

రూ.లక్షకు లక్షాముప్పై వేలు

● సౌదీ కరెన్సీ పేరుతో మోసం
● రెండు లక్షలు తీసుకొని తెల్లకాగితాలు అప్పగింత
● ముగ్గురి అరెస్ట్.. పరారీలో ప్రధాన సూత్రధారి



బేగంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): 'రూ.లక్షకు ముప్పైవేలు అదనంగా ఇస్తాం. ఇండియన్ కరెన్సీ ఇస్తే లక్షా ముప్పైవేలు విలువ గల సౌదీ అరేబియా నగదు ఇస్తాం' అని రెండు లక్షల తీసుకుని బ్యాగుతో తెల్లకాగితాలు ఇచ్చారు. బేగంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని వారాసిగూడకు చెందిన పర్వేజ్ (58) ఆటో డ్రైవర్. వారం రోజుల క్రితం చిలకలగూడ చౌరస్తాలో పర్వేజ్‌కు, ఇస్మాయిల్ అనే మరో ఆటోడ్రైవర్ పరిచయమయ్యాడు. తన సోదరి వద్ద సౌదీ అరేబియా కరెన్సీ ఉందని, మన కరెన్సీ లక్ష రూపాయలు ఇస్తే దానికి బదులుగా సుమారు లక్షా ముప్పైవేల విలువ చేసే సౌదీ కరెన్సీ ఇస్తామని తెలిపాడు. అతడి ఫోన్ నంబర్ తీసుకున్నాడు. అనంతరం ఇస్మాయిల్ సోదరి పేరుతో ఓ మహిళ ఫోన్ చేసి కరెన్సీ కావాలంటే బేగంపేటకు రావాలని చెప్పింది. ఈనెల 19న ఉదయం పర్వేజ్ బేగంపేటలోని ప్యాంటలూన్ లేన్‌లోకి రాగా, ఆటోలో నలుగురు వ్యక్తులు వచ్చి సౌదీ అరేబియా కరెన్సీ అని చెప్పి బ్యాగు చూపించారు. నిజమని నమ్మిన పర్వేజ్ వారికి రెండు లక్షలు ఇచ్చాడు. వారు బ్యాగును పర్వేజ్‌కు ఇచ్చి వెళ్లిపోయారు. అనంతరం బ్యాగు తెరిచి చూడగా అందులో తెల్లకాగితాలు దర్శనమిచ్చాయి. మోసపోయానని గ్రహించిన పర్వేజ్ ఈనెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు రెండు టీంలను ఏర్పాటు చేసి వారి కోసం తీవ్రంగా గాలించారు. అబూభకర్, సంధ్య అలియాస్ సాదియా, శాంతిలను అరెస్టు చేశారు. ప్రధాన సూత్రదారి సోయల్ పరారీలో ఉన్నాడు.



మాజీ ప్రధానికి నివాళి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులు అర్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు రాజీవ్ సేవలను గుర్తు చేశారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి.

అంబేడ్కర్ వర్సిటీకి రూ.25 కోట్లు

● యూజీసీ నుంచి విడుదల




మాట్లాడుతున్న విశ్వవిద్యాలయంవీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పీఎం-యూసీహెచ్ఏ నిధుల కింద యూజీసీ నుంచి రూ.25 కోట్లు మంజూరయ్యాయని వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి తెలిపారు. ఈ నిధులతో డిజిటల్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, బోధనేతర ఉద్యోగుల సంఘం, టెక్నికల్ ఆఫీసర్స్ స్టాఫ్ అసోషియేషన్ నూతనంగా ఎన్నికైన తర్వాత బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ మాట్లాడారు. రూ.3 కోట్ల వ్యయంతో వర్సిటీలో కొత్త ప్రయోగశాల, సెంట్రల్ ఇన్స్ట్రుమెంటేషన్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. అత్యవసర సిబ్బందికి డబుల్ బెడ్‌రూం గృహ సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు ప్రత్యేకంగా స్పోర్ట్స్ లాంజ్, ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోర్లు ఎండిపోవడంతోనే ట్యాంకర్ల వినియోగం

హైదరాబాద్ సిటీ, మే21 (ఆంధ్రజ్యోతి): బోర్లు ఎండిపోవడంతోనే ఔటర్ రింగ్ రోడ్డుపై మొక్కలకు ట్యాంకర్లను వినియోగిస్తున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రకటించారు. వేగంగా ప్రయాణించే ఔటర్‌పై మొక్కలకు ట్యాంకర్లతో నీళ్లు పోయడం వల్ల ప్రమాదాలవుతున్నాయని, ట్యాంకర్లు రాకుండా చేసేందుకు రూ.100కోట్లు వెచ్చించి అందుబాటులోకి తెచ్చిన డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి వృథాగా మారడంపై 'ఔటర్‌పై డ్రిప్‌కు మంగళం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనికి హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అర్బన్ ఫారెస్టు అధికారులకు ఆదేశించారు. అయితే కోకాపేట నుంచి కొల్లూరు మార్గంలో ఆరు బోర్లు ఉండగా, ప్రస్తుతం ఐదు బోర్లు పూర్తిగా ఎండిపోయాయని, దాంతో ఆ మార్గంలోనే మొక్కలకు ట్యాంకర్లను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఔటర్‌పై భద్రత రీత్యా చాలావరకు ట్యాంకర్లను తగ్గించామన్నారు.



అందుబాటులోకి టోలిచౌకి పోలీస్‌స్టేషన్

త్వరలో అధికారికంగా ప్రారంభం: సీపీ

కార్వాన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నిర్భయంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, నేటి నుంచి టోలిచౌకి పోలీస్ స్టేషన్ అందుబాటులో ఉంటుందని నగర పోలీస్ కమిషనర్(సీపీ) సీవీ ఆనంద్ అన్నారు. బుధవారం టోలిచౌకీలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను సీపీ సందర్శిం చారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదు కూడా స్వీకరించారు. త్వరలో హైద రాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారింకంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఫిల్మ్‌నగర్, గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లేందుకు టోలిచౌకి ప్రాంత వాసులకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వారికి అందుబాటులో ఉండేందుకు ఇక్కడ నూతన పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీ వెంట సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్ర మోహన్, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు, సిబ్బంది ఉన్నారు.


నూతన పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, ఫిర్యాదు స్వీకరిస్తున్న సీపీ సీవీ ఆనంద్

విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి జిఎన్‌రావు కన్నుమూత..


జీఎన్‌రావు (ఫైల్)

పహాడిషరీఫ్, మే 21(ఆంధ్రజ్యోతి): విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి గోపిశెట్టి నాగేశ్వరరావు గుండెపోటుతో బుధవారం రాత్రి బేగంపేట కుందన్‌బాగ్‌లోని నివాసంలో కన్నుమూశారు. 1988 బ్యాచ్‌కు చెందిన జీవన్‌రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. గుంటూరు కలెక్టర్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో యువజన సర్వీసెస్‌శాఖ కమిషనర్‌గా, పౌరసరఫరాలశాఖ, జౌళిశాఖ, ఉన్నతవిద్యాశాఖల కమిషనర్‌గా, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్‌గా, ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయన అకాల మృతి పట్ల పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అంత్యక్రియలు శుక్రవారం మహాప్రస్థానంలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.



ఆపద వస్తే ఆగమాగమే!

(5వ పేజీ తరువాయి)

మృతిచెందినా కొంతమంది వ్యాపారులు విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు చేరువగానే దుస్తులను, ఇతర సామగ్రిని పెడుతున్నారు. భవనాలు, స్తంభాలపై గుట్టలుగా తీగలు వేలాడుతుండటంతో వర్షాకాలంలో తీగలు తడిచి షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశాలుంటాయని విద్యుత్‌రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గాలిలో దీపంలా భద్రత

దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే చార్మినార్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రత గాలిలో దీపం అన్నట్లుగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అఫ్జల్‌గంజ్ నయాపూల్ బ్రిడ్జి దాటిన తర్వాత ఉండే మదీనా సర్కిల్ నుంచి పత్తర్‌ఘట్టీ, చార్‌కమాన్, గుల్జార్‌హౌజ్, చార్మినార్ మీదుగా మొఘల్‌పురం, శాలిబండ, ఆలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వెళ్లే రహదారి పొడవునా రకరకాల వ్యాపారాలతో అత్యంత రద్దీగా ఉంటోంది. నడిచే దారి కూడా ఉండడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్స్‌లు, ఫైర్ వాహనాలు వేగంగా అక్కడకు చేరుకునే పరిస్థితి లేదు. చార్మినార్ ముందే పోలీస్‌స్టేషన్‌తో పాటు ఏసీపీ కార్యాలయం ఉంది. అక్కడ కనీస పోలీసు వాహనాలను కూడా పార్కింగ్ చేసే పరిస్థితి లేదు. పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. ఏదైనా ప్రమాద సమయాల్లో ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు కూడా వ్యాపారాలతోనే నిండి ఉంటున్నాయి.

అర్ధరాత్రి వరకు షాపింగ్

పర్యాటక ప్రదేశం కావడంతో చార్మినార్ వద్ద అర్ధరాత్రి వరకు షాపింగ్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ పరిసర ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు అవసరం. దీన్ని దృష్టిలో పెట్టుకొని 108 అంబులెన్స్, అగ్ని మాపక వాహనం, నిపుణులైన సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధులై ఉండాలి.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

- గర్భం దాల్చిన యువతికి పలుమార్లు అబార్షన్
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు, కేసు నమోదు

బంజారాహిల్స్, మే 21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. గర్భవతిని చేసి పలుమార్లు అబార్షన్ చేయించాడు. యువతి అనారోగ్యం బారినపడగా అందం తగ్గిందని పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. మోసపోయానని గ్రహిం చిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... నగరం లోని ఫిలింనగర్‌లో ఉంటున్న యువతి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. 2023లో పసుపులేటి అచ్యుత్ ఆ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. ఇన్‌స్టా గ్రామ్ ద్వారా పరిచయం చేసుకుని ప్రేమిస్తున్నా, పెళ్లి చేసుకుం టానని చెప్పడంతో నమ్మింది. దాంతో ఇద్దరు సహజీవనం ప్రారంభించగా, సెప్టెంబర్‌లో యువతి గర్భం దాల్చింది. ఇదే విషయాన్ని అచ్యుత్‌కు చెప్పగా అబార్షన్ కావడానికి మందులు తెచ్చి ఇచ్చాడు. ఇలా గర్భం దాల్చిన పలుమార్లు అబార్షన్ కావడానికి ముందులు ఇవ్వడంతో యువతి అనారోగ్యానికి గురి అయింది. జరిగిన విషయాన్ని బాధితురాలు అచ్యుత్ తల్లి, కుటుంబ సభ్యులకు, ఇద్దరికి కామన్ స్నేహితులైన కావ్య, ఆదిత్యకు చెప్పారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో మోసపోయానిని గ్రహించిన బాధితు రాలు ఈ నెల 20న ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా, బీఎన్ఎస్ 69,79,89, 351(3) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్‌భవన్ హార్డ్ డిస్క్‌లు ఎత్తుకెళ్లిన కేసులో శ్రీనివాస్‌కు షరతులతో బెయిల్ మంజూరు

తిరుమలగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్లిన కేసులో అరెస్టు అయిన రాజ్‌భవన్ ఉద్యోగి శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిందని న్యాయవాదులు పి.మోహిత్ కృష్ణ, కే.నరేందర్, పి. నర్సింగరావు తెలిపారు. బుధవారం బొల్లారంలోని కార్యాలయంలో వారు మాట్లాడారు. సోమవారం కోర్టులో వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న శ్రీనివాస్‌కు ఎలాంటి సంబంధం లేదని, కేవలం కక్ష సాధింపుచర్యలో భాగంగానే ఫిర్యాదు చేశారని మెజిస్ట్రేట్‌కు వివరించామని తెలిపారు. అతడిపై కుటుంబం మొత్తం ఆదారపడి ఉందని బెయిల్ మంజూరు చేయాలని కోరామని అన్నారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీలత పాత కేసుల నుంచి బయటపడాలనే ఉద్దేశంతో నిందితుడు ఈ నేరానికి పాల్పడ్డారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఇరువురి వాదనలు విన్న 14వ అదనపు చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారని, అదే విధంగా ఇద్దరు రూ. 10వేలు పూచికత్తు ఇవ్వాలన్నారు. బుధవారం అతడు బెయిల్‌పై విడుదల అయ్యాడని న్యాయవాదులు తెలిపారు


రోబోటిక్ సర్జరీ వ్యవస్థ గురించి వివరిస్తున్న స్టార్ ఆస్పత్రి వైద్యులు

మోకాలి కీళ్లమార్పిడి శస్త్ర చికిత్సలకు స్టార్ హాస్పటల్‌లో రోబోటిక్ సర్జరీ ప్రారంభం


రాయదుర్గం, మే 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నానక్‌రాంగూడలోని స్టార్ హాస్పటల్స్ కీళ్లమార్పిడి శస్త్ర చికిత్సల కోసం అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ బుధవారం వెల్లడించారు. దీర్ఘకాలిక మోకాలి కీళ్ల సమస్యలతో బాధపడుతున్న రోగులకు రోబోటిక్ సర్జరీతో తక్కువ నొప్పితో ఖచ్చితమైన ఫలితం, వేగవంతంగా కోలుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 50ఏళ్ల పై బడిన ప్రతి ఐదుగురిలో ఒకరు మోకాలి ఆస్థియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారని అన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా తక్కువ సమయంలో విజయవంతంగా చికిత్స చేయడంతోపాటు రోగి త్వరగా కోలుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, వేదప్రకాశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విమానంలో మహిళ హల్‌చల్

- ఎమర్జెన్సీ డోర్ తీయడానికి యత్నం
- ఎయిర్‌లైన్స్ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగింత
- ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని గుర్తింపు

శంషాబాద్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ఇండిగో విమానంలో మహిళా ప్రయాణికురాలు హల్‌చల్ చేసింది. ఎమర్జెన్సీ డోర్ తీయడానికి యత్నించిన ఆమెను ఎయిర్‌లైన్స్ సిబ్బంది అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్ విమానాశ్రయం నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ఇండిగో విమానం పార్కింగ్ స్థలం నుంచి టేకాఫ్ తీసుకోవడానికి రన్‌వే పైకి వెళ్తుండగా కర్ణాటకకు చెందిన ఓ మహిళ ప్రయాణికురాలు ఎమర్జెన్సీ డోర్ తీయ డానికి యత్నించింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. దీంతో సిబ్బందితో ఆ మహిళ వాగ్వాదానికి దిగింది. విమానాన్ని ఆపి మహిళను ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రయాణికురాలికి మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు గుర్తించారు.





అర్ధరాత్రి అతివేగం.. గాల్లోకి ప్రాణం

(5వ పేజీ తరువాయి)

కోసం వాహనాన్ని రోడ్డు మీద నిలిపేటప్పుడు చాలా మంది డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు.

కనీస జాగ్రత్తలు కరువు

రోడ్డుపై వాహనాన్ని ఆపాల్సి వస్తే వెనుక వచ్చే వాహనాలు గుర్తించేలా ఎల్లో సిగ్నల్స్‌ను, రెడ్ రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం లేదు. కనీసం చెట్లకొమ్మలు కూడా ఉంచడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కొంతమంది మెకానిక్‌లు, డ్రైవర్లు వాహనాల కింద పడుకుని మరమ్మతు పనులు చేస్తుంటారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు వారు మృత్యువాత పడుతున్నారు. రహదారి భద్రతలో భాగంగా ఉన్నతాధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలను కట్టడి చేయలేక పోతున్నారు.

ఫ్లైట్ టైర్లలో సాంకేతిక సమస్య

- విమానం రద్దు చేసిన అధికారులు.. తప్పిన ప్రమాదం

శంషాబాద్ విమానాశ్రయం నుంచి 160 మంది ప్రయాణికులతో ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లాల్సిన ఎల్ఎక్స్ 753 లుఫ్తాన్సా విమానానికి పెను ముప్పు తప్పింది. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ బయలుదేరడానికి పార్కింగ్ స్థలం నుంచి టేకాఫ్ తీసుకోవడానికి రన్‌వే పైకి వెళ్తుండగా టైర్లలో సాంకేతిక సమస్య(గాలి) తలెత్తింది. ఇది గమనించిన పైలెట్లు వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. ఏటీసీ అధికారుల అనుమతితో తిరిగి విమానాన్ని పార్కింగ్ స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ సాంకేతిక నిపుణులు విమానాన్ని పరిశీలించి విమానంలో అన్ని టైర్లలో గాలి తక్కువగా ఉన్నట్లు తెలిపారు. దీంతో విమాన సర్వీసును అధికారులు రద్దు చేశారు. వెంటనే జీఎంఆర్ అధికారులు ఎమర్జెన్సీ సేవల సిబ్బందిని అప్రమత్తం చేశారు. అయితే కొందరు ప్రయాణికులు ప్రయాణాన్ని రద్దు చేసుకోగా, మరికొందరు ఇతర విమానాల ద్వారా ఫ్రాంక్‌ఫర్ట్ పంపించేందుకు ఏర్పాట్లు చేశామని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ సందర్భంగా ఇంజనీర్లు పూర్తిగా తనిఖీలు చేయకుండా ఏం చేస్తున్నారని ప్రయాణికులు మండిపడ్డారు.








నయీముద్దీన్‌తో రాష్ట్ర ఫుట్‌బాల్ ప్రముఖులు

సాకర్ చరిత్రలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం

- దిగ్గజ ఫుట్‌బాలర్ నయీముద్దీన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశీయ సాకర్ చరిత్రలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని దిగ్గజ ఫుట్‌బాలర్, భారత సాకర్ జట్టు మాజీ కెప్టెన్ సయ్యద్ నయీముద్దీన్ అన్నాడు. బుధవారం ఎల్బీ స్టేడియంలోని ఫతే మైదాన్ క్లబ్‌లో ద్రోణచార్య, అర్జున అవార్డుల గ్రహీత నయీముద్దీన్‌ను జీఎం పెంటయ్య ఫుట్‌బాల్ అకాడమీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నయీముద్దీన్ మాట్లాడుతూ 1950 నుంచి 1970వ దశకంలో హైదరాబాద్ నుంచి ఎందరో గొప్ప ఫుట్‌బాలర్లు భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించారని గుర్తుచేశాడు. భారత ఫుట్‌బాల్‌కు అదొక స్వర్ణ యుగమని చెప్పాడు. ప్రస్తుతం తెలంగాణలో ఫుట్‌బాల్‌కు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అభినందించాడు. సంతోష్ ట్రోఫీ, ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ కప్ టోర్నీల నిర్వహణతో యువతలో సాకర్‌కు ఆదరణ పెరుగుతుందని అభిప్రాయపడ్డాడు. ఈ కార్యక్రమంలో భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్, తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఫల్గుణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి మాదిగ ఉద్యమకారులకు సన్మానం


మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

బర్కత్‌పుర, మే 21(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగను మినహాయించి జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ మాదిగ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు గజ్జెల కాంతం తెలిపారు. మందకృష్ణ మాదిగతో పాటు ఆయన అనుచరులను కూడా ఈ కార్యక్రమం నుంచి మినహాయిస్తున్నామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 1 నుంచి జూలై 31వరకు రాష్ట్రంలోని 33జిల్లా కేంద్రాల్లో ఈ సన్మాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఉద్యమించిన మాదిగల జాబితాను తయారు చేసి జిల్లా కేంద్రాల్లో ఘనంగా సత్కరిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. వర్గీకరణ చట్టబద్ధతను ఆపడానికి కుట్రలు జరుగుతున్నాయని మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య వర్గీకరణకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్, బీఎస్ఎఫ్ కన్వీనర్ బోరెల్లి సురేష్, సంచార జాతుల అధ్యక్షుడు నిమ్మల వీరన్న, ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, పిడమర్తి రాంబాబు పాల్గొన్నారు.

సమాచార హక్కు కమిషనర్ల నియామకాల్లో కొరవడిన సామాజిక న్యాయం


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు కమిషనర్ల నియామకాల్లో సామాజిక న్యాయం కొరవడిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆరోపించారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం అన్యాయమన్నారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 10 సమాచార హక్కు కమిషనర్ల పదవుల్లో ఇప్పటి వరకు ఏడింటిని భర్తీ చేశారని, మిగతా మూడు పదవులను బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు పూర్తి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌతిండియా ఇన్‌చార్జి సూర్యనారాయణ, నాయకులు జానయ్య, జె.నరేందర్, భద్ర తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

చాంద్రాయణగుట్ట, మే 21 (ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధితుల కోసం ఛత్రినాక పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌డీ ఫంక్షన్‌హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 150మంది పాల్గొని రక్తదానం చేశారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా ముఖ్యఅతిథిగా విచ్చేసి రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు కె.నాగేంద్రప్రసాద్ వర్మ, పి. మహేశ్‌గౌడ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్

కవాడిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో బీసీ విద్యార్థులకు పదివేల ర్యాంకు నిబంధన ఎత్తివేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఇందిరాపార్కు చౌరస్తాలోని బీసీభవన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే బీసీ విద్యార్థులకు ర్యాంకుల నిబంధన ఎత్తివేస్తామని, మిగతా ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల మాదిరిగా పూర్తి ఫీజులు చెల్లిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టారన్నారు. కాబట్టి వెంటనే ఈ పదివేల ర్యాంకుల నిబంధన ఎత్తివేసి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రం, రజక నాయకులు పాల్గొన్నారు.

'పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణపై వివక్ష తగదు'

కవాడిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గోదావరి నదిలో ఇటీవల ప్రారంభించిన సరస్వతి పుష్కరాలలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానం అందకపోవడం కులవివక్షత పాటించడమేనని మాలవారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శ్రీనివాస్ అన్నారు. బుధవారం దోమలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సొంత పార్టీ ప్రజాప్రతినిధులపై వివక్షను పాటించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయంపై మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ వంశీకృష్ణకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మద్యానికి బానిసైన కుమారుడిపై తల్లిదండ్రుల ఫిర్యాదు


నిందితుడు చంద్రశేఖర్

కార్వాన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కుమారుడు మద్యం కొనేందుకు డబ్బులు ఇవ్వాలని వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. దీంతో అతడి వేధింపులు తట్టుకోలేక తల్లిదండ్రులు గుడిమల్కాపూర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా నిందితుడికి న్యాయస్థానం 10 రోజులు జైలు శిక్షణ విధించింది. గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాలు ప్రకారం... గుడిమల్కాపూర్ పద్మనాభనగర్ ప్రాంతంలో నివశించే లక్ష్మీనారాయణ(65), అనురాధ (63) కుమారుడు చంద్రశేఖర్ కొంతకాలంగా మద్యానికి బానిసైయ్యాడు. ఇతను తరచూ మద్యం తాగి వేధిస్తుండడంతో కొంతకాలం క్రితం భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఇతను తన వృద్ధ తల్లిదండ్రలిద్దరిని మద్యానికి డబ్బులు ఇవ్వాలని బెదిరించి, తరచూ ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో ఇతడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడికి న్యాయస్థానం 10 రోజులు కఠినకాగారా శిక్ష విధించింది.

రాజీవ్‌గాంధీకి నివాళి


రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, తదితరులు

రాజేంద్రనగర్/ అఫ్జల్‌గంజ్, మే 21(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, నాయకులు సామా ఇంద్రపాల్ రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు మొహమ్మద్ ఖాలేద్, మొహమ్మద్ ఇస్మాయిల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, పలుగు చెరువు మహేష్, రగడపల్లి శ్రవణ్, అనుముల జాన్‌పాల్, లక్ష్మారెడ్డి, షేక్ ఫహీం, జహంగీర్ ఖాన్, ప్రశాంత్, భరత్ రెడ్డి పాల్గొన్నారు.


ఉడంగడ్డ దళిత బస్తీలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యకురాలు సదాలక్ష్మి, రాధ, లింగమ్మ, జ్యోతి, చంద్రకళ, నస్రీన్ , సరీనా, చాందిని


గాంధీ భవన్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వి.హన్మంతరావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, టీపీసీసీ సెక్రెటరీ మనీలాల్‌షా, కిషన్, బాలపోచయ్య, శ్రీకాంత్, హరినాథ్

అభివృద్ధిని ఓర్వలేకే హరీశ్‌రావు ఆరోపణలు


గౌరి సతీష్

గన్‌పార్క్, మే 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తోన్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ఓర్వలేక మాజీ మంత్రి హరీశ్‌రావు చవకబారు ఆరోపణలు చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. బుధవారం నాంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు పర్యాయాలు పాలించిన బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాల కల్పన దేవుడెరుగు కనీసం ఉద్యోగులకు బెన్‌ఫిట్స్ ఇవ్వని పరిస్థితి తలెత్తిందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఉద్యోగ సంఘాల సమస్యలను లేవనెత్తడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఉద్యోగులకు నెల నెల 1న ఠంచన్‌గా వేతనాలను చెల్లిస్తోందన్నారు. అంగన్‌వాడీలకు బీఆర్ఎస్ హయాంలో రూ.7వేలు చెల్లిస్తే ప్రజా ప్రభుత్వం రూ.13,600 చెల్లిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటోందన్నారు.


రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు లక్ష్మీరాజ్ బుధవారం ఆ పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి మాజీ చైర్మన్ కే స్వామిగౌడ్‌తో పాటు ఆమె కేటీఆర్‌ను కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. గగన్ పహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు సరికొండ దుర్గేష్ తదితరులు ఉన్నారు.
- రాజేంద్రనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి)

ఆబేద్ అలీని పరామర్శించిన నిరంజన్


ఆబేద్ అలీని పరామర్శిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, పులిపాటి రాజేశ్‌కుమార్

మదీన, మే 21 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఆబేద్ అలీని బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పరామర్శించారు. కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనకు ఇటీవలనే శస్త్ర చికిత్స జరిగింది. ఫతేదర్వాజ మిస్రీగంజ్‌లోని ఆబేద్ అలీ నివాసానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. నిరంజన్ వెంట కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్, సీనియర్ నాయకులు జి.కన్నయ్యలాల్, మహ్మద్ ఇక్బాల్, బారి ఖాన్ తదితరులున్నారు.

జనావాసాల మధ్య పందుల సంచారం


శ్రీరామ్ కాలనీలో సంచరిస్తున్న పందులు

పహాడిషరీఫ్, మే 21(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ కాలనీలో పందుల సంచారం ఎక్కువగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పందులు గుంపుగా వస్తున్నాయని ఇళ్ళ ఎదుట చిన్న పిల్లలు ఆడు కోవడానికి భయపడుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పందులు చిన్నపిల్లలపై మేకలపై దాడులు చేస్తున్నాయని, కాలనీలో నీరు నిలిచే చోట తిష్ట వేస్తున్నాయని, పందుల వల్ల వ్యాధులు ప్రబలు తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పందులను ఇక్కడి నుంచి తరలించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పటించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పందులవల్ల వ్యాధులు ప్రబలే అవకాశముందని, స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, మే 21(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా గద్వాల్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వెయిటింగ్ హాల్ పనులు


వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

చాంద్రాయణగుట్ట, మే 21 (ఆంధ్రజ్యోతి): చాంద్రాయణగుట్ట ఇందిరానగర్ శ్మశానవాటికలో వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. వెయిటింగ్ హాల్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే స్పందించి రూ. 40 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఈ పనులను ప్రారంభించినట్టు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ వార్డు మెంబర్ సయ్యద్ షరీఫ్, సయ్యద్ షఫీ, భాగ్యనగర్ బ్యాగరి సంఘం అధ్యక్షుడు పేరోజి సాయినాథ్, ప్రతినిధులు వీరేందర్, ప్రదీప్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర


తిరంగ యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోషామహల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా బుధవారం గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్ ఆధ్వర్యంలో బేగంబజార్ భూలక్ష్మీ దేవాలయం, తిరంగా యాత్ర నిర్వహించారు. యాత్రకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, కార్పొరేటర్లు జి.శంకర్ యాదవ్, రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్, శశికళ కృష్ణ, సురేశ్ ఓంప్రకాశ్, బోయిని దర్శన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి డి.గోపాల్‌జీ, రమేశ్‌లాల్ యాదవ్, నటరాజ్ నామ్‌దారితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చల కోసం పిలిచి వృద్ధుడిపై దాడి

బంజారాహిల్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): చర్చల కోసం వృద్ధుడ్ని పిలిచి ఖాళీ పేపర్ల మీద సంతకాలు చేయించుకునేందుకు ప్రయత్నించి అతనిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదయింది. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన పెందోట చిరంజీవి చారి వ్యాపారి. భాగస్వాములైన శ్రీనివాసరాజ్ అతని కుమారుడు రోహిత్ రాజ్‌తో కలిసి చిరంజీవి మార్చిలో వ్యాపారం నిమిత్తం గాణ దేశానికి వెళ్లాడు. అక్కడ శ్రీనివాసరాజ్ 45,000 డాలర్లు పోగొట్టుకున్నాడు. తిరిగి వచ్చాక ఈ విషయంలో చర్చించాలని చిరంజీవిని బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 లో ఉన్న ఎమ్మెల్యే కాలనీకి పిలిచారు. శ్రీనివాసరాజ్, రోహిత్‌రాజ్‌తో పాటు అజామ్, శ్రీనివాస్‌రావు అక్కడ ఉన్నా రు. కొద్ది సేపు మాట్లాడిన తరువాత చిరంజీవితో ఖాళీ బాండ్ పేపర్‌లు, చెక్కులపై సంతకాలు చేయించుకునేందుకు ప్రయత్నించగా చిరంజీవి నిరాకరించడం తో అతనిపై దాడి చేయగా స్పృహ తప్పి పడిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేర కు నలుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణం ఇస్తామని సైబర్ నేరగాళ్ల మోసం

బంజారాహిల్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): రుణం ఇస్తామని చెప్పి డబ్బు కట్టించుకొని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన రమేష్ సినీ పరిశ్రమలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. ఫిబ్రవరిలో ఓ వ్యక్తి ఫోన్ చేసి ధనీ యాప్ నుంచి ఫోన్ చేస్తున్నట్టు చెప్పాడు. రుణం కావాలా అని అడగగా రమేష్ మూడు లక్షలు అడిగాడు. అనంతరం అన్ని డాక్యుమెంట్లు తీసుకున్నారు. ఇటీవలే ఫోన్ చేసి రుణం మంజూరయిందని ఇన్సూరెన్స్ కింద రూ.5,600 చెల్లించాలని సూచించగా రమే ష్ వెంటనే డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అప్పటి నుంచి అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో తెలుసుకున్న బాధితుడే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఆర్ఎస్ఐ మ్యాన్‌ప్యాక్ చోరీ

బంజారాహిల్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ఎస్ఐకి చెందిన మ్యాన్‌ప్యాక్ కనిపించకుండా పోయింది. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో ఏఆర్ఎస్ఐగా పనిచేస్తున్న నాగిరెడ్డికి ఈ నెల 18న ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో డ్యూటీ పడింది. రిలీవర్ వద్ద నుంచి మ్యాన్‌ప్యాక్ తీసుకొని విధులు నిర్వహిస్తున్నాడు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టుకు వెళ్లి టిఫిన్ చేశాడు. మ్యాన్‌ప్యాక్ పక్కకు పెట్టి చేతులు కడుక్కొని చూడగా అది కనిపించలేదు. నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

25న 'చేతివృత్తుల ఆధునికీకరణ, ప్రత్యామ్నాయం' ఆవిష్కరణ సభ

బర్కత్‌పుర, మే 21(ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల ఆధునికీకరణ, ప్రత్యామ్నాయం పుస్తకావిష్కరణ సభ ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్టు రచయిత, బీసీసీఈ కార్యదర్శి ఇంద్రవెల్లి రమేష్ తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ ఆవిష్కరణ సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథులుగా, హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య విశిష్ట అతిథిగా హాజరు కానున్నట్టు తెలిపారు. విశ్రాంత ఆచార్యులు ఇనుకొండ తిరుమలి, కె.మురళీమనోహర్ పాల్గొంటారని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు హిందూ ఐక్యత శక్తి యాత్ర

పహాడిషరీఫ్, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మామిడిపల్లి పరిసరాల్లో హిందూ ఐక్యత శక్తి యాత్ర నిర్వహించనున్నట్టు శ్రీ పంచముఖి హనుమాన్ వ్యాయామశాల కమిటీ ప్రతినిధులు తెలిపారు. మామిడిపల్లి దాసాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 10.30కు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6B1cZPIలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

కృష్ణమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న సత్యం, కిరణ్, శ్రీనివాస్‌యాదవ్

బర్కత్‌పుర, మే 21(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ(ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తిపై ప్రెస్‌క్లబ్ వద్ద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజా సంఘాల నేతలు తెలిపారు. ఈదాడికి పాల్పడిన మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి అనుచరులు ఆర్.డి.చంద్రశేఖర్‌తో పాటు మరికొందరిపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లో సమావేశంలో పలు సంఘాల నేతలు సత్యం, పోకల కిరణ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, గొల్లపల్లి దయానంద్, అమర్‌బాబు, నాగరాజు, కృష్ణగౌడ్, జనార్ధన్, బండారు శైలజ, పి.అరుణ, జ్యోతి, సత్యదేవ్ తదితరులు మాట్లాడారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లప్ వద్ద ఈ దాడికి పాల్పడ్డారని అంబటి కృష్ణమూర్తికి కార్మికుల నుంచి వస్తున్న ప్రజాదరణ చూసి దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు.

నేడు, రేపు తిరంగా యాత్రలు

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23వ తేదీల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తెలిపారు. బుధవారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన తిరంగాయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న సాయంత్రం 5.30 గంటలకు ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ, గోల్నాక డివిజన్లలో తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, నాయకులు ఓ.శ్రీనివాస్‌రెడ్డి, కన్నె రమేష్‌యాదవ్, ఏడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్యాచ్‌వర్క్‌ను పూర్తి చేయాలి

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో రోడ్డు ప్యాచ్‌వర్క్‌ను పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తుండడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. బుధవారం నింబోలిఅడ్డలో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్ నాయకులు శ్రీకాంత్, వినోద్, నిఖిల్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్ పాల్గొన్నారు.

అహల్యాబాయి హోల్కర్ సేవలు ఆదర్శం

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి కోసం అహల్యాబాయి హోల్కర్ చేసిన సేవలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవి సూచించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అహల్యాబాయి హోల్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సమత, కార్పొరేటర్‌ఉమాదేవి, నాయకురాలు పాల్గొన్నారు.

పంచలింగాల దేవాలయ భూమి సర్వే

చాంద్రాయణగుట్ట, మే 21(ఆంధ్రజ్యోతి): బండ్లగూడ మండల పరిధిలోని ఫలక్‌నుమా ఖాద్రి చమన్ వద్ద సర్వేనంబర్ 6లోని పంచలింగాల దేవాలయ భూమి కబ్జాకు గురైందని రాష్ట్రీయ వానరసేన ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్, అడిషనల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, బండ్లగూడ మండల తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీనాథ్, పోలీసు బందోబస్తు మధ్య దేవాలయం వద్దకు చేరుకుని సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు.

వడ్డీ వ్యాపారి అరెస్ట్

చాంద్రాయణగుట్ట, మే 21(ఆంధ్రజ్యోతి): పేదల నుంచి అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్న ఓ వడ్డీ వ్యాపారిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫారూక్‌నగర్‌కు చెందిన సయ్యద్ చాంద్‌పాషా(47) టైలర్. స్థానికంగా డబ్బులు అవసరమైన వారికి 20 శాతం వడ్డీలకు ఇస్తుంటాడు. సమయానికి డబ్బులు తిరిగి ఇవ్వనివారి పట్ల బెదిరింపులకు పాల్పడుతున్నాడు. సమాచారమందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, ఫలక్‌నుమా పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 40 వేలు, ఒక నోట్‌బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. ఎడ్ల నవీన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. మెదక్ నుంచి కాచిగూడ డెమో ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుండగా విద్యానగర్ వద్ద ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. దానిలో ల్యాప్‌టాప్‌తో పాటు డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఉన్నాయి. బుధవారం కాచిగూడ రైల్వేపీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మందుల నిల్వ జర భద్రం

నిబంధనలు పాటించాలి

● సరైన ఉష్ణోగ్రతలో స్టోరేజీ చేయకపోతే ముప్పే
● ఎండ వేడికి డైల్యూట్ అవుతాయంటున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలో కొన్ని రకాల మందుల్లో ముడిపదార్థాలు వేరు కావడంతో అందులోని పొటెన్సీ తగ్గిపోతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగ నివారణకు ఉపయోగించే మందులకు సరైన స్టోరేజీ లేకపోవడంతో డైల్యూట్ అయ్యే ప్రమాదం ఉందంటున్నారు. నిబంధనల ప్రకారం తగిన ఉష్ణోగ్రతలో మందులను నిల్వ చేయాలి. మెజారిటీ ఫార్మసీల్లో మందులను అడ్డదిడ్డంగా సర్ది అమ్మకాలు చేస్తున్నారు. కూల్ స్టోరేజీలో నిల్వ చేయాల్సిన మందులను బహిరంగంగా పెడుతున్నారు. చలి, వానాకాలాల్లో కొంతవరకు ఈ పరిస్థితి అనుకూలించినప్పటికీ వేసవిలో మందులను ఎక్కడ పడితే అక్కడ పెడితే పొటెన్సీ తగ్గిపోయే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. దీంతో మందుల నాణ్యత కొరవడుతుందని, వ్యాధుల నివారణకు ఉపయోగపడడం లేదంటున్నారు.

ఫార్మసీలు ఇలా ఉండాలి

మెడికల్ దుకాణాల్లో కొన్ని రకాల మందులను నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి. రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రత 2 నుంచి 8 డిగ్రీల సెంటీగ్రేడ్, ఏసీ ఉష్ణోగ్రత 8 డిగ్రీల సెంటీగ్రేడ్, మందుల గది ఉష్ణోగ్రత 25 నుంచి 30 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉండే విధంగా ఫార్మసీ ఉండాలి. మెడికల్ షాపుల్లో రిఫ్రిజిరేటర్, ఏసీ ఉంటేనే ఔషధ నియంత్రణ సంస్థ డ్రగ్ లైసెన్స్ ఇవ్వాలి. మెడికల్ దుకాణాలను తనిఖీ చేసినప్పుడు మందుల నిల్వకు నిబంధనల ప్రకారం సదుపాయాలు ఉన్నాయా.. లేవా అనే అంశాలు పరిశీలించిన తర్వాత అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

ఈ మందుల నిల్వ ఇలా..

కేన్సర్, న్యూరాలజీ, గుండె, మధుమేహం వంటి కొన్ని రకాల జబ్బులకు సంబంధించిన మందులను ఏసీ, రిఫ్రిజిరేటర్ సదుపాయం ఉన్న చోట్లనే నిల్వ చేయాలి. కొన్ని రకాల ఇంజెక్షన్లు, వ్యాక్సిన్లు, డయాబెటిక్ ఇన్సులిన్లు, ఫ్లూయిడ్స్, వడ దెబ్బకు ఉపయోగించే ఆర్ఎల్ఎస్ ఫ్లూయిడ్స్ క్రీములు, అయింట్‌మెంట్లు, పాము కాటు విషం విరుగుడు మందులు, యాంటీ బాడీస్ మందులు, హార్మోన్లు, ఎంజైమ్స్‌కు సంబంధించినవి తప్పనిసరిగా సూచించిన ఉష్ణోగ్రతలో మాత్రమే స్టోరేజీ చేయాలి.

ఇలా చేయకపోతే కొన్ని రకాల క్రీమ్స్, అయింట్‌మెంట్లలో ఆయిల్, ముడి పదార్థాలు వేరవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంజెక్షన్లు, వ్యాక్సీన్లలో ఇదే పరిస్థితి నెలకొంటుంది.



సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో ఉంచొద్దు



సూర్యరశ్మి తగిలే ప్రాంతాల్లో మందులను నిల్వ చేయొద్దు. తేమ శాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో మందులను నిల్వ చేయాలి. తేమ శాతం ఎక్కువ ఉంటే మందులు కరిగిపోతాయి. కొన్ని రకాల పౌడర్లు, ఇంజెక్షన్స్, ఇన్సులిన్, వాక్సిన్స్, నీళ్లలో కలిపి తాగే పౌడర్లను రిఫ్రిజిరేటర్‌లోనే భద్రపరచాలి. ఎట్టి పరిస్థితుల్లో మందులను స్ట్రిప్ నుంచి వేరు చేయడం, బయటకు తీస్తే నాణ్యతలో మార్పు వస్తుంది. బాటిల్స్‌లో వచ్చే థైరాయిడ్ వంటి మందులను బయటకు తీసి మరో బాటిల్, డబ్బాలో వేయొద్దు. రిఫ్రిజిరేటర్ లేని వారు గ్లాసులో చల్లటి నీరు నింపి అందులో ఇన్సులిన్ వాయిల్స్‌ను ఉంచాలి. గ్లాస్‌లో నీరు ఎప్పుడూ చల్లగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ నివేదిత సాయి చంద్ర, న్యూరో ఫిజీషియన్, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి



మృతుడు వర్షిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

కుంట్లూరులో విషాదఛాయలు

● మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 21 (ఆంధ్రజ్యోతి): కుంట్లూరులో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి వచ్చిన కుమారులు మృతి చెందడంతో గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. మృతుల కుటుంబ సభ్యులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ తదితర నాయకులు కూడా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సారస్వత పరిషత్తు ఉత్తమ గ్రంథ పురస్కారాల ప్రకటన

అఫ్జల్‌గంజ్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికి వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సోమవారం పురస్కారాలు ప్రకటించింది. పద్య/గేయ కవిత్వంలో డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్‌రాజు రచించిన 'నిరుడు కురిసిన నిప్పు', బల్మూరి కొండలరాయుడు రచించిన వచన కవిత్వంలో ఉదారి నారాయణ రచించిన 'మళ్ళీ మనిషిలోకి' కవితా సంపుటి పురస్కారాలకు ఎంపికయ్యాయి. నవలా విభాగంలో డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన 'గువ్వల చెన్నా' నవల, సాహిత్య విమర్శలో డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన 'నవారు' ముస్లిం వ్యాసాలు, కథా ప్రక్రియలో రామచంద్రమౌళి రచించిన 'నిర్వాణ' కథల సంపుటి, ఇతర ప్రక్రియల విభాగంలో డాక్టర్ సంగనభట్ల నరసయ్య రచించిన కోటి లింగాల- తెలంగాణ ప్రాచీన చారిత్రక వ్యాసాలు గ్రంథానికి, బాలసాహిత్యంలో డాక్టర్ అమరవాది నీరజ రచించిన 'ఏడు రంగుల జెండా' పుస్తకం పురస్కారాలకు ఎంపికయ్యాయని పరిషత్తు ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తెలిపారు.

అగర్‌బత్తీల తయారీ గోదాములో మంటలు

కార్వాన్, మే 21 (ఆంధ్రజ్యోతి): అగర్‌బత్తీల తయారీ గోదాములో అగ్ని ప్రమాదం జరిగింది. గుడిమల్కాపూర్ కనకదుర్గ కాలనీలో ఓ ఇంట్లో అగర్‌బత్తీలు తయారీ చేసే గోదాము ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు గుడిమల్కాపూర్ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగిన సమయంలో గోదాములో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

● ఘటన ఆలస్యంగా వెలుగులోకి ● నిందితుడిపై పోక్సో కేసు

బిట్స్‌పిలానీ, మే 21 (ఆంధ్రజ్యోతి): తండ్రి వయసు ఉన్న ఓ వ్యక్తి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జవహర్‌నగర్ సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఓ కాలనీలో నివసిస్తున్న అమ్మమ్మ వద్ద బాలిక ఉంటోంది. కర్నూల్ జిల్లాకు చెందిన గుడిపాటి రాజు(35) కూడా అదే ప్రాంతంలో నివసిస్తూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం బాలిక ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఆమెపై రాజు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు బాలిక ఏడ్చుకుంటూ జరిగిన విషయం చెప్పింది. బుధవారం పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.



యూసుఫ్‌గూడ సర్కిల్ ఆఫీసు వెనుక రోడ్డును మూసేస్తూ పోసిన నాలా వ్యర్థాలు

రోడ్డుపైనే నాలా వ్యర్థాలు

వాహనదారులు, స్థానికుల ఇబ్బంది

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో నాలాలో తీసిన వ్యర్థాలను తీసుకొచ్చి ఇళ్ల మధ్యలో పోసి రోడ్డును మూసేశారు. యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీసును అనుకొని ముందు, వెనుక భాగంలో రోడ్లున్నాయి. ఆఫీసు వెనుక భాగంలోని రోడ్డును మూసేస్తూ వ్యర్థాలను పోశారు. నాలాలోని పూడికతీత వ్యర్థాలను రోడ్డుపై పోయడంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. యూసుఫ్‌గూడ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో నాలాల నుంచి తీసిన పూడికను ప్రతీరోజు గుట్టలుగా పోస్తున్నారు. నెల రోజులుగా పోయడం, ఎత్తడం చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారింది. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులతో పాటు అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న దాదాపు 200 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పటికే కల్లు కాంపౌండ్‌తో ఇబ్బందులు పడుతున్న వారికి నాలా వ్యర్థాలు మరింత ఇబ్బందికరంగా మారాయి. నిర్మాణ, ఇతర వ్యర్థాలను చెరువుల్లో పోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల హెచ్చరించిన హైడ్రా అధికారులు.. ఇళ్ల మధ్య, రోడ్డును మూసేస్తూ జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీసు వెనుకే నాలా వ్యర్థాలను పోస్తున్న వారిపై ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.నరసింహారావు

తలసీమియాను నిర్లక్ష్యం చేయొద్దు

● కామినేని ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

మన్సూరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎముక మూలుగలోని హిమోగ్లోబిన్‌లో ఉండే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి నిలిచిపోవడం ద్వారా తలసీమియా వ్యాధి సోకుతుందని, జన్యు పరంగా వచ్చే ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని కామినేని ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్. నరసింహారావు అన్నారు. ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల్లో ఎవరైనా తలసీమియా బారిన పడితే పిల్లలకు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకిన వారు వైద్యులను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. తలసీమియా పరీక్షలు నిర్వహించేందుకు కామినేనిలో ఉచితంగా హెమటాలజీ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు 8985450534 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వైద్యులు డా.కంచన్ ఎస్.చెన్నావర్, డా.ఎస్.జయంతి, డా.ఎం.శ్రీనివాస్, డా.శ్రీలత కొమాండూర్ పాల్గొన్నారు.

కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు

ఎంపీ వంశీని మంత్రి శ్రీధర్‌బాబు అవమానించలేదు : గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం


పంజాగుట్ట, మే 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయలను దోచుకున్నారని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాకుడు గజ్జెల కాంతం ఆరోపించారు. అన్ని సాక్ష్యాలు, ఆధారాలు పరిశీలించిన తర్వాతనే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్‌కు నోటీసులు పింపించిదన్నారు. కాళేశ్వరం పేరుతో దేశంలోనే అతి పెద్ద స్కామ్ చేశారన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేసి రూ. 3 లక్షల కోట్లు దోచుకున్నారని, రూ. 70 వేల కోట్లు అయ్యే కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 1.50 లక్షల కోట్లకు పెంచి రూ. 80 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. సరస్వతి పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను మంత్రి శ్రీధర్‌బాబు అవమానించినట్లు కొంతమంది విలేకరుల సమావేశాలు, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని, మంత్రిపై వారు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఎవరినీ అవమానించే ఉద్దేశం శ్రీధర్‌బాబుకు లేదన్నారు. ఎంపీని ఎక్కడ అవమానించారో చెప్పాలన్నారు.

విద్యార్థుల భద్రతకు 'సురక్షా కవచ్'

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భద్రతకు సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. సురక్షా కవచ్ పేరుతో దీన్ని నిర్వహిస్తున్నారు. జూన్ నుంచి సైబరాబాద్ పరిధిలోని విద్యా సంస్థల్లో దీన్ని అమలు చేయనున్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, టీజీ న్యాబ్‌ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా లైంగిక, సైబర్ భద్రత, మత్తు పదార్థాలతో కలిగే నష్టాలు, గుడ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

భాగ్య విధాత.. భాగ్యరెడ్డి వర్మ

సామాజిక రుగ్మతలపై సమరభేరి మోగించిన చైతన్య దీప్తి ● నేడు జయంతి



భాగ్యరెడ్డి వర్మ

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన తెలంగాణ తొలి సంఘ సంస్కర్త, దళితోద్యమ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ. తన మరణానంతరం భౌతికకాయంతో పాటు వెయ్యి రూపాయల నగదును ఆది హిందువులకు అప్పగించాలని వీలునామాలో రాశారు. అంత్యక్రియల్లో భార్య, పిల్లల జోక్యం చేసుకోరాదని అందులో స్పష్టం చేశారు. సామాజిక అసమానత్వంపై పోరులో భాగ్యరెడ్డి వర్మ సాధించిన తొలి విజయం ఇది.

తెలుగు వెలుగుల సారథి

మాతృభాషలోనే విద్యాబోధన సాగాలని భాగ్యరెడ్డి వర్మ ఆకాంక్షించారు. ఇసామియా బజార్, జగన్‌మిత్ర మండలి కార్యాలయంలో మొట్టమొదట 1910లో "ఆదిహిందూ పాఠశాల"ను నెలకొల్పారు. తర్వాత లింగంపల్లి, బొగ్గులకుంట, చంచల్‌గూడ, సుల్తాన్‌షాహీ, ధూల్‌పేట్, గన్‌ఫౌండ్రి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలలో మొత్తం 26 ఆది హిందూ బాల, బాలికల పాఠశాలలు ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ప్రజల విరాళాలతో నిర్వహిస్తున్న పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని భాగయ్య నిజాం ప్రభుత్వాన్ని కోరారు. ఆ పాఠశాలల నిర్వహణను తమకు అప్పగించాలని నిజాం విద్యాధికారి ప్రతిపాదించారు. తెలుగు మాధ్యమంలోనే పాఠశాలలు కొనసాగించాలి అన్న షరతు మీద 1934లో నిజాం ప్రభుత్వానికి 26 ఆది హిందూ స్కూళ్లను స్వాధీనం చేశారు. అలా ఉర్దూ ఏలికలో తెలుగు వెలుగుల సారథిగా భాగ్యరెడ్డి వర్మ చరిత్రలో నిలిచారు.

మన మహాత్ముడు

భాగ్యరెడ్డి వర్మది నిరుపేద దళిత కుటుంబం. సమాజానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలకు ఆర్యసమాజకులు ప్రదానం చేసిన బిరుదు 'వర్మ'. కలరా, మసూచి, విషజ్వరాలు లాంటి మహమ్మారులు పీడించిన సందర్భంలో స్వస్తిదళ్ సంఘం ద్వారా అనాథ శవాలకు అంత్యక్రియలు, రోగులకు శుశ్రూషలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ లాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించారు. జీవరక్షక్ జ్ఞాన ప్రచార మండలి ద్వారా మద్యపానం, జంతుబలులకు వ్యతిరేకంగా ఉద్యమించారు. దేవదాసీ, మురళి, జోగిని వ్యవస్థ నిర్మూలకు ఉధృతంగా పనిచేశారు. అంటరానితనం, అస్పృశ్యత లాంటి సామాజిక రుగ్మతలపై తిరుగుబాటు బావుటా ఎగరేయడమే కాదు, అసమానతలు రూపుమాపడానికి అహరహం కృషి చేసిన తెలంగాణ తొలి సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ. చాదర్‌ఘాట్ వద్ద ఆయన నిర్మించిన ఆది హిందూ సోషల్ లీగ్ భవనానికి వందేళ్లు పూర్తయ్యాయి.

నేడు అవార్డు ప్రదానం

తెలంగాణ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ 137వ జయంత్యుత్సవాలు రవీంద్రభారతిలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రముఖ అధ్యయనకారుడు, తెలంగాణ దళితోద్యమ చరిత్ర రచయిత సంగిశెట్టి శ్రీనివాస్‌కు 'భాగ్యరెడ్డి వర్మ స్మారక జీవిత సాఫల్య పురస్కారం - 2025' ప్రదానం చేస్తున్నారు.

తెలుగు పద్య రచనకు భాషపై సాధికారిత ఉండాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు పద్య రచనకు భాషపై సాధికారిత ఉండాలని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో లగడపాటి సంగయ్య రచించిన తెలుగు ధీర శతకం, ఆంధ్ర రఘువంశం-పల్లె పట్నం పద్య కావ్యాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగు ధీర శతకంలో తెలుగు జాతి పౌరుషం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో తెలుగు వారి ధీరత్వం సంగయ్య గొప్పగా వర్ణించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఆయాచితం శ్రీధర్, ఏబీ రామారావు, బీరం సుందరరావు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి ఉప్పొంగేలా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

రవీంద్రభారతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా శృతిలయ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో జైహింద్ ఇండియన్ ఆర్మీ పేరిట దేశభక్తి గీతాలాపన రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించారు. ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో గాయనీ గాయకులు సైనికులను స్మరిస్తూ దేశభక్తి గీతాలను ఆలపించి అదరహో అనిపించారు. ఈ సందర్భంగా పహల్గాం మృతులకు నివాళి అర్పించారు. ముత్యాల హరికిషన్, దైవజ్ఞశర్మ, భీమ్‌రెడ్డి, కుసుమ భోగరాజు తదితరులు మాట్లాడుతూ దేశభక్తి ఉప్పొంగేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో దేశభక్తి పెంపొందించనవారమవుతామన్నారు. ప్రతీ ఒక్కరూ దేశభక్తితో ఆలోచించి పనిచేయాలన్నారు. కళాకారులను సత్కరించి అభినందించారు.



జాతీయ జెండాతో అతిథులు

లోపభూయిష్టంగా ఎన్నికల వ్యవస్థ

● బీజేపీ అధికారంలోకి వచ్చాక కమిషన్‌ను బలహీనపర్చింది
● ప్రొఫెసర్ హరగోపాల్

పంజాగుట్ట, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా మారిపోయిందని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్‌ను బలహీన పర్చిందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. దళిత ఆదివాసీ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్(దలీప్) ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ఈవీఎంలలో ఫలితాలు అణగారిన వర్గాల రాజ్యాధికారాన్ని అడ్డుకుంటున్నాయా' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పక్షపాతం లేకుండా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నిర్వహించే స్వతంత్ర పాత్రపై సమాజంలో చాలా అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికలు ధనస్వామ్యంగా మారాయని, ఓటుకు వేల రూపాయలు ఇచ్చే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అట్టడుగు వర్గాలు పోటీచేసి గెలిచే పరిస్థితి ఎక్కడ ఉంటుందన్నారు. ఈవీఎంలపై ప్రజల్లో అనుమానాలున్నాయన్నారు. ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ వీవీ రావు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో సంస్థ అధ్యక్షురాలు బి.ఎస్. రత్న వివిధ సంఘాల నాయకులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, వి.సంధ్య, బొమ్మక్ మురళి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన మెట్రో చార్జీలు రద్దు చేయాలి : సీపీఎం

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): పెంచిన మెట్రో చార్జీలను ఈ 24 నుంచి 10 శాతం తగ్గిస్తామని ఎల్అండ్‌టీ యాజమాన్యం చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని సీపీఎం పార్టీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈనెల 17న మెట్రో చార్జీలు భారీగా పెంచి కంటి తుడుపు చర్యగా 10 శాతం తగ్గిస్తామనడం ఎంతవరకు న్యాయమని, పెరిగిన చార్జీలు, నిర్ణయించిన స్లాబుల వలన ఒక్కో ప్రయాణికుడిపై నెలకు వెయ్యి రూపాయల నుంచి రెండువేల రూపాయల భారం పడుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. పెంచిన మెట్రో చార్జీలపై రాష్ట్ర, కేంద్ర మంత్రులు స్పందించకపోవడం శోచనీయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. పెంచిన చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ ఫీజు, టాయిలెట్లు వాడినందుకు డబ్బులు వసూలు చేయటాన్ని వెంటనే ఆపాలన్నారు. మెట్రో రైల్ బోగీలు పెంచాలని డిమాండ్ చేశారు.

గంటలో కుండపోత

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి 10.30 గంటల వరకు బండ్లగూడలో అత్యధికంగా 8.8, సైదాబాద్ ఆస్మాన్‌ఘడ్‌లో 8.2 సెం.మీ వర్షం కురిసింది. పటాన్‌చెరువు, గచ్చిబౌలి, అంబర్‌పేట, శేరిలింగంపల్లి, హిమాయత్‌నగర్, చందానగర్, బతుకమ్మకుంట, రాజేంద్రనగర్, బండ్లగూడ, మలక్‌పేట, ఉప్పల్, సరూర్‌నగర్, సైదాబాద్, చార్మినార్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు వరద నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరో మూడురోజుల పాటు ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



గచ్చిబౌలిలో..



ఎల్బీనగర్‌లో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు



బుట్ట, గొడుగు సహాయంతో వర్షంలో ప్రయాణం

వర్షపాతం వివరాలు (సెంటీమీటర్లలో) (రాత్రి 11 గంటల వరకు)

ప్రాంతం	వర్ష పాతం
బండ్లగూడ	8.8
ఆస్మాన్‌ఘడ్	8.5
మలక్‌పేట	8.3
అంబర్‌పేట	8.1
సరూర్‌నగర్	8.0
మూసారాంబాగ్	7.7
ఎల్‌బీనగర్	7.1
చంపాపేట	6.7
హిమాయత్‌నగర్	6.3
సైదాబాద్	5.8
చార్మినార్	5.7
ఆజంపురా	5.7
డబీర్‌పురా	5.6
బతుకమ్మకుంట	5.2

కౌన్సెలింగ్

అవి బంగారు ఘడియలు

డాక్టర్! నాకు తొమ్మిదో నెల. పుట్టబోయే బిడ్డకు పాలు పట్టించే విషయంలో నాకెన్నో అనుమానాలున్నాయి. ప్రసవించిన వెంటనే బిడ్డకు రొమ్ము పాలను పట్టించకూడదనీ, వాటిని పిండేయాలనీ పెద్దలు అంటున్నారు. ఇదెంతవరకూ నిజం?

- ఓ సోదరి, హైదరాబాద్

బిడ్డ పుట్టిన తొలి 60 నిమిషాలు బంగారు ఘడియల్లాంటివి. పాలు పట్టించడానికి అవెంతో కీలకమైన ఘడియలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్‌లు గుర్తించాయి. ఒక ల్యాక్టేషన్ కన్సల్టెంట్‌గా అది ఎలాంటి ప్రసవమైనా, బిడ్డ పుట్టిన అరగంటలోపే పాలు పట్టించడంలో నేను తల్లులకు సహాయపడుతూ ఉంటాను. తల్లిపాలలో ఎంతో విలువైన కొలస్ట్రమ్ అనే పదార్థం ఉంటుంది. దీన్ని ద్రవ రూప బంగారంగా పేర్కొంటూ ఉంటారు. బిడ్డ వ్యాధినిరోధకశక్తి బలపడడానికి కొలస్ట్రమ్ తోడ్పడుతుంది. సిజేరియన్ సర్జరీతో బిడ్డను కన్న తల్లులకు ఫుట్‌బాల్ హోల్డ్ భంగిమలో తల్లిపాలు పట్టించమని నేను సూచిస్తాను. దీంతో బిడ్డకు సౌకర్యంగా పాలు పట్టించే వీలుంటుంది. అలాగే సాధారణ ప్రసవమైన పిల్లలకు పాలు పట్టించడం కోసం, క్రాస్ క్రేడిల్, హోల్డ్ భంగిమలను అనుసరించాలి. అలాగే పిల్లలు పాలు తాగిన తర్వాత తప్పనిసరిగా త్రేన్పు వచ్చేలా చూసుకోవాలి.



తొలి గంట పాలల్లో...

- **వ్యాధినిరోధకశక్తి:** తొలి పాలల్లోని కొలస్ట్రమ్‌లో యాంటీబాడీలు, వ్యాధినిరోధక కణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్ల నుంచి బిడ్డకు సత్వర రక్షణ కల్పిస్తాయి. అలాగే బిడ్డ వ్యాధినిరోధకశక్తి బలపడడానికి తోడ్పడతాయి
- **అనుబంధం:** రొమ్ముపాలతో తల్లికీ, బిడ్డకూ మధ్య అనుబంధం బలపడుతుంది. పాలివ్వడం ద్వారా తల్లి శరీరంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్ గర్భాశయం కుంచించుకుపోవడానికీ, రక్తస్రావం తగ్గడానికీ తోడ్పడుతుంది
- **సౌకర్యం:** తొలి గంటలో పాలు తాగిన పిల్లలు, తర్వాతి కాలంలో పాలు తాగడంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉండదు. అలాగే తల్లుల్లో పాల ఉత్పత్తి ప్రేరేపితమవుతుంది
- **బిడ్డ ఆరోగ్యం:** తల్లి పాలు, బిడ్డ రక్తంలోని చక్కెర, శరీర ఉష్ణోగ్రత, గుండె కొట్టుకునే వేగాలను స్థిరపరుస్తాయి
- **పేగుల ఆరోగ్యం:** కొలస్ట్రమ్ సహజసిద్ధమైన విరోచనకారి. బిడ్డ తొలి విసర్జకాన్ని సులభంగా విసర్జించడానికి ఇది సహాయపడుతుంది. అలాగే దీంతో కామెర్ల ముప్పు తప్పుతుంది. బిడ్డ పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది.

డాక్టర్ కుడిపూడి ఊహ, ల్యాక్టేషన్ కన్సల్టెంట్, మెడికవర్ విమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్, హైదరాబాద్

నవ్య

కుటుంబ కదంబం

లక్ష్యం తెలుసు... కానీ దాన్ని చేరుకోవడంలో తడబడుతుంటాం. కలలు కంటాం... వాటిని నెరవేర్చుకొనే మార్గం తెలియక ఇబ్బందులు పడుతుంటాం. నైపుణ్యం ఉండి... సాధించగల సామర్థ్యం ఉండి... ఎక్కడో వెనకపడిపోతాం. ఇలాంటి అవరోధాలను దాటించి... ప్రేరణ కల్పించి... జీవితంలో ముందడుగు వేయించేవారే లైఫ్ కోచ్ అంటారు మధులిక అప్పసాని. అవార్డులందుకున్న లైఫ్ కోచ్‌గా వందల మందికి తమ లక్ష్యాలు, కలలను సాకారం చేసుకోవడంలో దోహదపడిన ఆమె... 'నవ్య'తో ముచ్చటించారు.



కలలను నిజం చేసేలా...

"ఒకప్పుడు లైఫ్ కోచింగ్ అంటే చాలామందికి తెలియదు. కానీ ఇప్పుడు అత్యంత డిమాండ్ ఉన్న రంగంగా ఎదుగుతోంది. ముఖ్యంగా కరోనా తరువాత దీని అవసరం బాగా పెరిగింది. నేను కొవిడ్ ముందు 2019 నుంచి లైఫ్ కోచ్‌గా పని చేస్తున్నా. కొవిడ్‌వల్ల ఆన్‌లైన్ తరగతులు, ఉద్యోగాలతో ఇంట్లోనే అధిక సమయం గడపడంవల్ల శారీరకంగానే కాదు, మానసికంగానూ చాలామంది గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. వాటి నుంచి బయటకు రావడానికి లైఫ్ కోచ్‌లను ఆశ్రయించడం అధికమైంది. ఇదీ సైకాలజీలో ఒక భాగమే. కానీ సైకాలజీ కాదు. అంటే స్పోర్ట్స్ కోచింగ్ లాగా. ఒత్తిడి, మానసిక ఆందోళనలు, గాయాల నుంచి బయటకు రావాలనుకొంటే అది సైకాలజీకి సంబంధించింది. అలాగే భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాల్లో సమస్యలు వచ్చినా సైకాలజిస్టులను సంప్రతిస్తారు. కానీ లైఫ్ కోచ్‌లుగా మేము... చేసే పనికి, జీవితానికి మధ్య సమతుల్యత ఉండేలా కృషి చేస్తాం. సమయం, శక్తిసామర్థ్యాల నిర్వహణ (టైమ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్) చూస్తాం. భావాలను, ఆలోచనలను స్పష్టంగా, సులభంగా ఎలా పంచుకోవాలనేది చెబుతాం. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించి, తద్వారా అసలైన లక్ష్యాన్ని చేరుకొనేలా ప్రేరణ నిచ్చి, ఒక ప్రణాళికను రూపొందిస్తాం.

వారి లక్ష్యానికి మా భరోసా...

నా దగ్గరకు వచ్చే క్లయింట్ తన కలను నా ముందు పెడతాడు. అతడి కలను సాకారం చేయాల్సిన బాధ్యత నాది. ఇక్కడ ఒక ఉదాహరణ చెబుతా. నాకు ఒక క్లయింట్ ఉంది. కంపెనీ టర్నోవర్‌ను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచాలనేది తన లక్ష్యం. కానీ 'ఇది నావల్ల కాదు' అనే అపనమ్మకం ఆమె మెదడులో పాతుకుపోయింది. తనకు అంతటి సామర్థ్యం లేదనుకొంటుంది. ఇక్కడ సమస్య ఏంటంటే... మనం కొన్నిసార్లు ఆత్మవిమర్శ చేసుకొంటూ ఎదిగేస్తాం. వేరొకరితో పోల్చుకొంటూ, అందులోనే ప్రేరణ వెతుక్కొనే ప్రయత్న చేస్తాం. కానీ ఒక స్థాయికి వెళ్లాక పోల్చుకోవడానికి ఆ స్థాయిలో మన చుట్టూ ఎవరూ ఉండరు. ఆమె విషయంలో అదే జరిగింది. ఆమె సర్కిల్‌లో తనకంటే శక్తిమంతమైన మహిళలు ఎవరూ లేరు. అలాంటప్పుడు ఆత్మవిమర్శ, పోలిక పని చేయవు. కనుక ఆమె మదిలో మెదిలే ఆలోచనల మీద దృష్టి పెట్టి, సమయపాలన, రోజువారీ కార్యక్రమాల జాబితాను క్రమపద్ధతిలో పెట్టాం. అన్నిటినీ బేరీజు వేసుకొని, వేరొకరితో పోల్చుకోకుండా... లక్ష్యం నుంచి వెనక్కి పోకుండా... అనుకున్నది ఎలా సాధించగలదనే విషయంపై ఒక అంచనాకు వచ్చాం. దానికి అనుగుణంగా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి ఇచ్చాం.



అదే మా పని...

పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, లేదా ఆ కుటుంబాల నుంచి వచ్చే వ్యక్తులు కావచ్చు, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనుకొనే విద్యార్థులు కావచ్చు... వీళ్లు నా వద్దకు వస్తారు. ఎక్కువగా ఒన్ టు ఒన్ కోచింగ్ ఇస్తాను. అలాగే మహిళా బృందాలకు వర్క్‌షాప్‌లు, కార్పొరేటు సంస్థల్లో సెషన్స్ నిర్వహిస్తుంటాను. ఒక రకంగా లైఫ్ కోచింగ్ అనేది ఒలింపిక్స్‌కు వెళ్లే క్రీడాకారుడిని అత్యున్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దడం లాంటిది. అంటే ఇక్కడకు వచ్చేవారు అప్పటికే నైపుణ్యం సంపాదించి ఉంటారు. నిరూపించుకొని ఉంటారు. కాకపోతే ఫినిషింగ్ లైన్ దగ్గర్లో ఉన్నప్పుడు... 'నీవల్ల కాదు' అని ఎప్పుడో వాళ్ల అమ్మో, నాన్నో చెప్పిన మాటలో, ఇంకేదో హఠాత్తుగా గుర్తుకువస్తాయి. దాంతో ఉన్నట్టుండి వారి ప్రయాణం నెమ్మదిస్తుంది. ఈ గందరగోళాన్ని, అపనమ్మకాన్ని పారద్రోలి, లక్ష్యం వైపు నడిపించడమే మా పని.

స్పష్టత ముఖ్యం...

నా ప్రయాణంలో ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నాను. ఈ వృత్తిలో ముఖ్యంగా కావల్సింది... మనవద్దకు వచ్చేవారికి ఏంకావాలన్నది కచ్చితంగా గ్రహించగలగాలి. కొందరికి తమకు ఏంకావాలో స్పష్టత ఉండదు. ఇంకొందరికి స్పష్టత ఉంటుంది. కానీ దాన్ని ఎలా సాధించాలన్నది తెలియదు. మరికొందరికి ఎలా సాధించాలో తెలుసు. అయినా లక్ష్యాన్ని చేరుకోలేరు. తమ బలాలేంటో, బలహీనతలేంటో అవగాహన ఉన్నా... ముందుకు వెళ్లే మార్గం తెలియక బాధ పడుతుంటారు. లేదా ప్రయత్నించి విఫలమై ఉంటారు. ఇవన్నీ సున్నితమైన అంశాలు. కనుక లైఫ్ కోచ్‌గా... తొలి సెషన్‌లోనే వాళ్లకు ఏంకావాలి? ఎందుకు కావాలి? అన్నదానిపై నాకు ఒక స్పష్టత రావాలి. అప్పుడే వారిని విజయం వైపు నడిపించగలం.

అందుకే ఇటు వైపు...

మా అమ్మానాన్నలది పశ్చిమ గోదావరి జిల్లా అయినా... నా బాల్యం, విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే సాగింది. నాన్నకు కన్‌స్ట్రక్షన్ బిజినెస్ ఉంది. ఎంబీయే ఫైనాన్స్ పూర్తయిన తరువాత పుణె సింబియాసిస్ యూనివర్సిటీలో బీబీఏ చదివాను. పెళ్లి తరువాత చెన్నైలోని మా మామగారి కంపెనీలో ఎనలిస్ట్‌గా, ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేశాను. 2016లో పెద్ద నోట్ల రద్దు తరువాత మా కంపెనీని ఒక ఫ్రెంచ్ ఎమ్మెన్సీకి అమ్మేశాం. తరువాత మావారు ఏరోస్పేస్‌కు సంబంధించి వేరే కంపెనీ కొన్నారు. అప్పటికి నాకు పెళ్లయి నాలుగేళ్లు అయిందనుకొంటా. మాకు ఇద్దరు పాపలు. ఇల్లు, పిల్లలు, కుటుంబ బాధ్యతలు ఉన్నప్పుడు... దానికి అనుగుణమైన కెరీర్‌ను ఎంచుకోవాలి కదా. అందుకే నేను లైఫ్ కోచింగ్‌లోకి వచ్చాను. నాది బిజినెస్, ఎంబీయే నేపథ్యం కాబట్టి... ఎక్కువగా పారిశ్రామికవేత్తలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన సమస్యలు చూస్తుంటాను. కొన్ని పత్రికలు, మ్యాగజైన్లకు ఆర్టికల్స్ కూడా రాశాను. మా నాన్న, మా మామగారే నాకు స్ఫూర్తి.

సవాళ్లు ఎన్నో...

లైఫ్ కోచ్ కావాలనుకొనేవారికి ఐసీఎఫ్ (ఇంటర్నేషనల్ కోచింగ్ ఫెడరేషన్), ఎన్ఎల్‌పీ (న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్) లాంటి ప్రముఖ సంస్థలు ఈ కోర్సులు అందిస్తున్నాయి. కోర్సు పూర్తయితే సర్టిఫికెట్ ఇస్తారు. నేను ఎన్ఎల్‌పీ చేశాను.

అయితే ఒక్కదాంతోనే సరిపోదు. మెరుగైన సేవలు అందించాలంటే ప్రముఖ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకొంటూ, ఇలాంటి కోర్సులు మరికొన్ని చేస్తుండాలి. లైఫ్ కోచ్‌కు ప్రధానంగా ఉండాల్సిన లక్షణం... చెప్పింది ఓపిగ్గా వినగలగడం. వారి సమస్యలపై ఒక అవగాహనకు వచ్చేవరకు సలహాలు ఇవ్వకుండా ఉండడం. అలాగే ప్రశ్నలో స్పష్టత, పొంతన తప్పనిసరి. మనం అడిగే ప్రశ్నకు అతడు నిస్సంకోచంగా బదులిస్తాడా? లేక చిన్నబుచ్చుకొంటాడా? అనేది గ్రహించగలగాలి. ఇక్కడ విద్య, విజ్ఞానం చాలా ముఖ్యం. ఎన్నో సవాళ్లతో కూడుకున్న వృత్తి ఇది.

నా క్లయింట్స్‌కు నేను సాధారణంగా ఎనిమిది సెషన్స్ తీసుకొంటాను. తొలి సెషన్‌లోనే వారేమిటి అనేదానిపై స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు వర్క్‌షాప్‌ల పరంగా, వ్యక్తిగతంగా వెయ్యి మందిని కలిశాను. తమ లక్ష్యాలను, కలలను నెరవేర్చుకొనేలా ఎంతోమందికి లైఫ్ కోచింగ్ ఇచ్చాను. మా పిల్లలు చిన్నవాళ్లు కనుక ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు మాత్రమే ఆఫీసులో ఉంటున్నాను. ఇంటికి వచ్చాక యూరప్ తదితర ప్రాంతాల నుంచి కాల్స్ వస్తాయి. వారికి ఆన్‌లైన్‌లోనే కౌన్సెలింగ్ ఇస్తాను."

• హనుమా

'చిరు' ప్రయత్నం..!

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివే. అయితే రుచికరంగా వండే క్రమంలో వాటిలోని పోషకాలు చాలావరకు పోతాయి. అలా కాకుండా వాటిల్లోని పోషకాలు నిలిచి ఉండేలా చిరుతిళ్లు తయారు చేస్తున్నారు ఢిల్లీకి చెందిన ఆంచల్ సక్సేనా. ఇతర దేశాలకు విస్తరించాలనుకుంటున్న తన 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' ప్రయాణంలోని విశేషాలు ఆమె మాటల్లోనే...

"బయట దొరికే చాలావరకు చిరుతిళ్లు ఎక్కువగా ప్రాసెస్ చేయడం వల్ల పోషకాలు తక్కువగా ఉంటున్నాయని కొవిడ్ సమయంలో నేను గుర్తించాను. అప్పుడే పూర్వీకుల కాలం నుంచి ఆరోగ్యానికి మంచివైన చిరుధాన్యాలను రోజువారీ చిరుతిళ్లలో భాగం చేయాలన్న ఆలోచన వచ్చింది. ఇంట్లోనే రాగులు, జొన్నలు, అవిసెగింజలు, పొద్దుతిరుగుడు గింజలు, గుమ్మడి గింజలు, సేంద్రీయ బెల్లం, నెయ్యి వంటి వాటితో ప్రయోగాలు చేశాను. ఆ తరువాత నా ఆలోచనను నా చిరకాల స్నేహితుడు హిమాన్షు మిశ్రాతో పంచుకున్నాను. హిమాన్షుకు వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణపై అనుభవం ఉండడం, నాకు వంటపై మక్కువ ఉండడంతో ప్రజలకు చిరుధాన్యాలతో రుచికరమైన, ఆరోగ్యకరమైన చిరుతిళ్లు అందించడమే లక్ష్యంగా మేమిద్దరం కలిసి 2022లో 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' సంస్థను స్థాపించాం.



అవగాహన కల్పించడమే సవాలు

ఇప్పుడంటే ప్రజలకు చిరుధాన్యాలపై అవగాహన ఉంది. కానీ 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' ప్రారంభించినప్పటికి చిరుధాన్యాల ప్రయోజనాల గురించి ప్రజలకు సరైన అవగాహన లేదు. అదే మాకు పెద్ద సమస్యగా మారింది. దాంతో వినియోగదారులకు అవగాహన కల్పించడం కోసం ఎంతో కష్టపడ్డాను. చిరుధాన్యాల ఆహారపదార్థాలపై పలు చర్చల్లో పాల్గొన్నాను. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించా. డిజిటల్ మీడియా, సోషల్‌మీడియా ద్వారా, ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రచారం చేశాను. హైదరాబాద్‌లోని ఏకైక మిల్లెట్ ఇన్‌స్టిట్యూట్ న్యూట్రిహబ్ నుంచి కూడా గుర్తింపు సాధించాం. అలాగే జిమ్‌లు, ఆర్గానిక్ దుకాణాలు, కొన్ని కార్పొరేట్ కార్యాలయాలకు తమ ఉత్పత్తుల నమూనాలను ఉచితంగా అందించాం. ఇలా ఎంతో శ్రమించి చివరికి వినియోగదారుల నమ్మకం గెలుచుకోగలిగాం. మేము రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్) నుంచి చిరుధాన్యాలు సేకరిస్తున్నాం. దీని వలన రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతోంది.



లో-హీట్ బేకింగ్ (తక్కువ వేడితో వండడం) వల్ల చిరుతిళ్లలో ఫైబర్, ఇతర పోషకాలు పోకుండా ఉండడంతో పాటు చిరుతిళ్లు మనకు కావాల్సినట్టు క్రంచీగా (కరకరలాడుతూ) ఉంటాయి.

లో హీట్ బేకింగ్

తక్కువ వేడితో వండడం(లో-హీట్ బేకింగ్), వ్యాక్యూమ్ ప్యాకింగ్(ప్యాకెట్ లోపల గాలి తీసివేయడం) వంటి ఆవిష్కరణలు మా 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' సంస్థ ఎదుగుదలలో ఎంతో ఉపయోగపడ్డాయి. లో-హీట్ బేకింగ్ వల్ల చిరుతిళ్లలో ఫైబర్, ఇతర పోషకాలు పోకుండా ఉండడంతో పాటు చిరుతిళ్లు మనకు కావాల్సినట్టు క్రంచీగా(కరకరలాడుతూ) ఉంటాయి.

భవిష్యత్ ప్రణాళికలు

మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్‌ను వచ్చే ఐదేళ్లలో పలు దేశాలకు విస్తరించాలనుకుంటున్నా. మిడిల్ ఈస్ట్, దక్షిణాసియాలకు విస్తరించాలని ప్రణాళికలు కూడా రూపొందించుకుంటున్నాం. అలాగే మన దేశంలో పెద్ద ఆహార పదార్థాల కంపెనీల సహకారం కోసం ప్రయత్నిస్తున్నాం.

ఓపికతో ఎదురుచూడండి

ఓ మహిళా వ్యవస్థాపకురాలి(ఎంటర్‌ప్రెన్యూర్)గా నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. అయితే నాలా నచ్చిన రంగంలో లేదా వ్యాపారంలో ఎదగాలనుకునే మహిళలకు నేనిచ్చే సలహా ఏంటంటే మార్కెట్ పోకడ గురించి తెలుసుకొని ముందు చిన్నగా మొదలు పెట్టి, తర్వాత విస్తరించుకోమని. అలాగే తక్కువ ఖర్చుతో ప్రచారం కోసం డిజిటల్ మార్కెటింగ్‌ను ఉపయోగించుకోమని, విజయం కోసం ఓపికగా ఎదురుచూడమని చెప్తాను."

వినూత్నం

జమ్ములోని ఆలయాల్లో పూజలకు ఉపయోగించిన పూలు చెత్తకుప్పల్లోకి చేరిపోవడం, పర్యావరణాన్ని నష్టపరచడం నచ్చని, స్థానిక యువతి పాయల్ శర్మ, వాటితో పరిమళాలు వెదజల్లే అగర్‌బత్తీల తయారీకి పూనుకుంది. జీవనభృతి, ఆధ్యాత్మికత, పర్యావరణ సంరక్షణలను సమ్మిళితం చేసిన పాయల్ గురించిన కథ ఆసక్తికరమైన ఇది.

పూలకు సరికొత్త పరిమళాలు

జమ్ము నగరం చుట్టూరా లెక్కలేనన్ని ఆలయాలు, మసీదులు ఉన్నాయి. వాటిలో అనునిత్యం ఉపయోగించే టన్నులకొద్దీ పూలు చివరకు చెత్తకుప్పల్లోకీ, లేదా వీధిమూలల్లోకీ చేరిపోయి, పర్యావరణానికి హానికారకంగా మారుతూ ఉంటాయి. ఎంతో కాలంగా ఈ పరిస్థితిని గమనించిన పాయల్ శర్మకు, పవిత్రమైన పూలు అలా వృథా అయిపోవడం నచ్చలేదు. ఈ పవిత్రమైన వ్యర్థాలను ఆధ్యాత్మిక ఉపయోగాల కోసం సుస్థిరమైన మార్గంలో ఉపయోగించే వీలుందా? అనే దిశగా ఆలోచించింది. చివరకు ఈ వ్యర్థ పూలలో ఆమెకొక గొప్ప ప్రయోజనం కనిపించింది.



వ్యతిరేకతలను అధిగమించి...

పూల వృథాను అరికట్టడంతో పాటు, స్థానిక మహిళలకు జీవనభృతిని కూడా కల్పించవచ్చనే ఆలోచన తట్టడంతో మరో ఆలోచన లేకుండా, జెకె ఆరొమాటిక్ అండ్ హెర్బ్స్ అనే స్టార్టప్‌ను మొదలుపెట్టి, పూలతో అగర్‌బత్తీల తయారీ మొదలు పెట్టింది పాయల్. అయితే అనుకున్నదే తడవుగా ప్రయత్నాలు మొదలుపెట్టినా, ఆమెకు పూల సేకరణలో పలు సవాళ్లు ఎదురయ్యాయి. ఆమె వ్యాపారాన్ని సప్లయర్లు ప్రశ్నించారు. ప్రారంభంలో ఆలయాలు కూడా వ్యర్థ పూలను ఏరుకోడానికి ఆమెను అనుమతించలేదు. అయినప్పటికీ అవగాహనా కార్యక్రమాలు చేపడుతూ, వ్యర్థ పూలతో జరిగే పర్యావరణ నష్టం గురించీ, తన ప్రయత్నం లక్ష్యం గురించీ వివరిస్తూ, అందరి మనసులనూ చూరగొంది. అలా వాలంటీర్ల సహాయంతో పూలను సేకరించడం మొదలుపెట్టి, అగర్‌బత్తీల తయారీకి పూనుకుంది.




సాధారణంగా అగర్‌బత్తీల తయారీలో హానికారకమైన రసాయనాలు లేదా బొగ్గునూ వాడుతూ ఉంటారు. కానీ పాయల్ బొగ్గు ఉపయో గించని అగర్‌బత్తీలను తయారు చేస్తోంది.

అన్నీ పర్యావరణహితమే...

సాధారణంగా వాణిజ్యపరమైన అగర్‌బత్తీల తయారీలో హానికారకమైన రసాయనాలు లేదా బొగ్గునూ వాడుతూ ఉంటారు. ఇవి పర్యావరణానికీ, ప్రజల ఆరోగ్యానికీ హానికరం. కానీ పాయల్ బొగ్గు ఏమాత్రం ఉపయోగించని అగర్‌బత్తీలను తయారు చేస్తోంది. అగరొత్తుల తయారీ కోసం ఉపయోగించే పూలను ముందుగా ఎండబెట్టి, పొడిచేసి, గుగ్గలు, చెట్ల బంకను జోడించి ఆ మిశ్రమాన్ని అగరొత్తులుగా చుడుతుంది. ఈ పని కోసం ఆమె స్థానిక గ్రామాల్లోని మహిళలను నియమించు కుంది. పాయల్ దగ్గర గులాబీ, గంధం, లావెండర్, తులసి అగరొత్తులు తయారవుతాయి. ఇవన్నీ ఆలయాలు, ఇళ్లలో వాడకానికి ఎంతో సురక్షితమైనవి. పాయల్ బ్రాండ్ ఇస్సెన్స్ కోన్స్, ధూప్ స్టిక్స్, సేంద్రియ నూనెలను కూడా తయారు చేస్తోంది. ఇవన్నీ సింథటిక్ అడిటివ్స్ ఉపయోగించ కుండా తయారుచేసిన స్వచ్ఛమైన, సహజ సిద్ధమైన ఉత్పత్తులే కావడం విశేషం.

పాలు పాడవకుండా...

వేసవికాలంలో పాలు త్వరగా పాడవుతుంటాయి. ఉదయాన్నే చక్కగా కాచినప్పటికీ అవి ఎక్కువ సమయం వరకూ నిల్వ ఉండవు. ఒక్కోసారి మనం చేసే చిన్న పొరబాట్ల వల్ల పాలు విరిగిపోతుంటాయి. అలా కాకుండా పాలు రోజంతా తాజాగా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పాలను కాచడానికి ఉపయోగించే పాత్ర శుభ్రంగా ఉండాలి. ఈ పాత్రలో వేరే వంటకాలు చేయకూడదు. టీ, కాఫీ లాంటివి కూడా పెట్టకూడదు. ఓ మందపాటి స్టీల్ గిన్నెను పాల కోసం ప్రత్యేకంగా ఉంచుకోవడం మంచిది.
- ఉదయాన్నే తాజాగా తీసుకొచ్చిన పాలను చక్కగా కాచి చల్లార్చి ఫ్రిజ్‌లో ఉంచితే రోజంతా నిల్వ ఉంటాయి. ప్యాకెట్ పాలను మాత్రం వాటిపై ఉండే తేదీ ప్రకారం ఉపయోగించుకోవాలి. ఇవి ఎక్కువ సమయం వరకూ నిల్వ ఉండవు.
- ఒకసారి కాచిన తరవాత అలాగే బయట ఉంచితే వాటిలో బ్యాక్టీరియా పెరిగి, పాలు పాడవుతాయి.
- పాల పొంగు మీద కొంత మంది నీటి చుక్కలు చల్లుతుంటారు. అలా చేయకూడదు. దీనివల్ల పాలు తొందరగా పాడవుతాయి.
- పాలు కాచిన వెంటనే మూత పెట్టేస్తూ ఉంటారు. దీనివల్ల మూత అడుగు భాగంలో ఆవిరి బిందువులు ఏర్పడి ఆ నీటి చుక్కలు పాలలో పడతాయి. దీని వల్ల కూడా పాలు చెడిపోయే అవకాశం ఉంటుంది. పాలు పూర్తిగా చల్లారాకనే మూత పెట్టాలి.

ల్యాప్‌టాప్ వాడేటప్పుడు...



ల్యాప్‌టాప్ వాడేటప్పుడు సరైన పద్ధతులు పాటించకపోతే కంటి సమస్యలు, వెన్ను నొప్పి, మెడ కండరాలు పట్టేయడం లాంటి సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

- ల్యాప్‌టాప్‌ను వాడేటప్పుడు 20-20-20 రూల్ పాటించడం మంచిది. అంటే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి కనీసం 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని 20 సెకన్లపాటు చూస్తూ ఉండాలి. దీనివల్ల కళ్లు అలసిపోకుండా ఉంటాయి.
- ల్యాప్‌టాప్ ముందు సరైన భంగిమలో సౌకర్యవంతంగా ఉండేలా కూర్చోవాలి. వెన్నును వంచకుండా నిటారుగా ఉంచాలి. స్క్రీన్‌ను కంటి స్థాయికి కొద్దిగా కిందికి ఉంచాలి. చేతులు పొడవుగా చాచితే అందేంత దూరంలో ల్యాప్ టాప్ ఉండాలి.
- అదేపనిగా స్క్రీన్‌ను చూస్తూ పనిచేయకూడదు. మధ్యమధ్యలో కళ్లార్పుతూ ఉండాలి. అప్పుడే కళ్లకు తగినంత తేమ అంది పొడిబారకుండా ఉంటాయి. లేదంటే కళ్లు ఎరుపెక్కడం, కళ్లలో మంట లాంటి సమస్యలు వస్తాయి.
- ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద కాంతి మరీ ఎక్కువ లేదా మరీ తక్కువ కాకుండా చూసుకోవాలి. కళ్లకు శ్రమ కలిగించని విధంగా ఏర్పాటు చేసుకోవాలి. మానిటర్ ముందు, వెనక ఎక్కువ కాంతి ప్రసరించకుండా చూసుకోవాలి. రాత్రిపూట చీకటి గదిలో కూర్చుని ల్యాప్‌టాప్ మీద పనిచేయకూడదు.
- ఎ విటమిన్ ఎక్కువగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను రోజూ తీసుకోవాలి. కనీసం ఏడు లేదా ఎనిమిది గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి. దీనివల్ల కళ్లు, మెదడు, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
హైదరాబాద్ ● గురువారం 22 మే 2025



పవన్ మూర్తీభవించిన ధర్మాగ్రహం


ఎమ్ఎమ్ కీరవాణి

"ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌గారిని మీరంతా పవర్‌స్టార్ అని పిలుస్తారు. ఆయన మూర్తీభవించిన ధర్మాగ్రహం అని నేను అంటాను. ఆగ్రహం మనందరికీ వస్తుంది. కానీ సమాజం కోసం వచ్చేది ధర్మాగ్రహం. ఆయనకు మాత్రమే సరిపోయేలా 'హరిహర వీరమల్లు'ను తీర్చిదిద్దారు" అని సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి అన్నారు. పవన్‌కల్యాణ్, నిధి అగర్వాల్ జంటగా జ్యోతికృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. జూన్ 12న చిత్రం విడుదలవుతోంది. బుధవారం ఈ చిత్రం నుంచి మూడో గీతం 'అసుర హననం'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "జయాపజాయాలతో సంబంధం లేకుండా దూసుకుపోయే కార్చిచ్చు పవన్. ఆయనతో మొదటిసారి చేస్తున్న సినిమా కాబట్టి ఎంతో శ్రద్ధతో పనిచేశాను" అని చెప్పారు. చిత్రదర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్‌గారిని డైరెక్ట్ చేయడమనేది ప్రతీ ఒక్క దర్శకుడి కల. అది ఓ పెద్ద అవార్డుతో సమానం. కత్తికీ, ధర్మానికీ మధ్య జరిగే యుద్ధమే ఈ కథ" అని తెలిపారు. చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "సినిమా అద్భుతంగా వచ్చింది. తెలుగులో పాటూ విడుదలయ్యే అన్ని భాషల్లో భారీ విజయం సాధిస్తుంది" అని అన్నారు.

మాజీ రాష్ట్రపతి కలామ్ బయోపిక్‌లో ధనుష్



తమిళ హీరో ధనుష్ హీరోగా మరో క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏ.పీ.జే అబ్దుల్ కలామ్ జీవితం ఆధారంగా తెరకెక్కనున్న బయోపిక్‌లో ఆయన నటించనున్నారు. బుధవారం, కేన్స్ చిత్రోత్సవంలో ఈ సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ చిత్ర టైటిల్ 'కలామ్'. 'ద మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అనేది ఉపశీర్షిక. 'తానాజీ: ద అన్‌సంగ్ వారియర్', 'ఆదిపురుష్' చిత్రాల దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించనున్నారు. అభిషేక్ అగర్వాల్, భూషణ్‌కుమార్, అనిల్ సుంకర, కృషన్‌కుమార్ నిర్మించనున్నారు. అబ్దుల్ కలామ్ జీవితాన్ని, భారతీయ అంతరిక్ష, రక్షణ రంగాలకు ఆయన చేసిన అపూర్వ సేవలను ఈ చిత్రం ద్వారా హృద్యంగా ఆవిష్కరించనున్నారు. ఇతర వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.



'కన్నప్ప' నుంచి కిరాత లుక్!

మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ సాధిస్తూ యువ హీరోలతో పోటీ పడుతూ ముందుకు దూసుకుపోతున్నారు మోహన్ లాల్. మంచి విష్ణు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'కన్నప్ప' చిత్రంలో ఆయన కిరాత పాత్రతో అలరించపోతున్నారు. బుధవారం మోహన్‌లాల్ పుట్టిన రోజు సందర్భంగా 'కన్నప్ప' చిత్రంలోని ఆయన పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. దైవిక శక్తితో ముడిపడున్న కిరాత పాత్రను ఇందులో మోహన్‌లాల్ పోషించారు. మోహన్‌లాల్ అభిమానులనే కాకుండా ప్రేక్షకుల్ని మెప్పించే విధంగా ఈ పాత్రను తీర్చిదిద్దారు. జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా 'కన్నప్ప' విడుదల కానుంది. ప్రస్తుతం మంచు విష్ణు ఈ చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు.

మోహన్‌లాల్ జీవిత చరిత్ర 'ముఖరాగం'

బుధవారం 65వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన మోహన్‌లాల్ ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయాన్ని తన అభిమానులతో పంచుకున్నారు. 'ముఖరాగం' పేరుతో తన జీవిత కథ పుస్తకరూపంలో రానున్నదని ఆయన వెల్లడించారు. తన 47 ఏళ్ల నట జీవితంలో జరిగిన ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలు, విశేషాలు ఈ పుస్తకంలో ఉంటాయనీ, భానుప్రకాశ్ అనే రచయిత వీటికి అక్షర రూపం ఇచ్చారనీ మోహన్‌లాల్ చెప్పారు. దాదాపు వెయ్యి పేజీలు కలిగిన ఈ పుస్తకం డిసెంబర్ 25న విడుదలవుతుందని ఆయన తెలిపారు.

జోరుగా ప్రీ ప్రొడక్షన్...



అల్లు అర్జున్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు అట్లీ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఏఏ22.. ఏ6' వర్కింగ్ టైటిల్. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించనున్నారు. ఇటీవలె సినిమాను అనౌన్స్ చేసి ఓ ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా దర్శకుడు అట్లీ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అల్లు అర్జున్‌ను కలసి ప్రీ ప్రొడక్షన్ పనులను చర్చించనున్నారు. జూన్‌లో చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త లోకంలోకి తీసుకెళ్లేలా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

ప్రతిభ కలిగిన వారికోసం 'దిల్‌రాజు డ్రీమ్స్'



తన మొదటి సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న దిల్‌రాజు ఇప్పటివరకూ ఎంతో మంది కొత్త దర్శకులను, సాంకేతిక నిపుణులను పరిశ్రమకు పరిచయం చేశారు. తాజాగా ఆయన మరో అడుగు ముందుకు వేసి తెలుగు చిత్ర పరిశ్రమకు మరింత మంది ప్రతిభ కలిగిన వారిని పరిచయం చేయడం కోసం ఏకంగా 'దిల్‌రాజు డ్రీమ్స్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా యువ ప్రతిభావంతులకు మంచి అవకాశాలు కల్పించాలని నిర్ణయించుకున్నారు. జూన్ నుంచి ఆయన సిద్ధం చేసిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ యాక్టివ్ అవుతుంది. ఈ సంస్థ వెబ్‌సైట్‌లో యువ ప్రతిభావంతులు తమ వివరాలను నమోదు చేస్తే దిల్ రాజు డ్రీమ్స్ బృందం స్వయంగా వారిని సంప్రదిస్తుంది. తమ ఆలోచనలను యువ ప్రతిభావంతులు ఈ బృందం దృష్టికి తీసుకెళ్లవచ్చు. తమ టాలెంట్‌ను నిరూపించుకోవాలనుకొనే వారు ఎంతో మంది ఎవరిని ఎలా ఎప్రోచ్ అవ్వాలో, ముందుకు ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. అటువంటి వారికి నిజంగా ఇది గోల్డెన్ ఛాన్స్.

నెలకు రూ.40 లక్షలు కావాలి

● ఫ్యామిలీ కోర్టులో రవి మోహన్ భార్య ఆర్తి పిటీషన్




సినీ హీరో రవి మోహన్ నుంచి జీవనాంశం కోరుతూ ఆయన భార్య ఆర్తి రవి చెన్నై ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విడాకులు కోరుతున్న భర్త నుంచి నెలకు రూ.40 లక్షలు ఇప్పించాలని ఆమె ఆ పిటిషన్‌లో కోరారు. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని రవి మోహన్ న్యాయవాదులను ఆదేశిస్తూ తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చినా ఫలితం లేకపోయింది. తన భర్త నుంచి నెలకు రూ.40 లక్షల భరణం కావాలని ఆర్తి ఈ సందర్భంగా కోరారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కేన్స్‌లో మెరిసి.. శ్రీదేవిని గుర్తుచేసి



హీరోయిన్ జాన్వీ కపూర్ 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో తళుక్కున మెరిశారు. ఆమె కేన్స్ రెడ్‌కార్పెట్‌పై దర్శనమివ్వడం ఇదే తొలిసారి. పొడవాటి పింక్ కలర్ గౌన్‌లో ఉన్న ఆమె తన తల్లి, దివంగత హీరోయిన్ శ్రీదేవిని గుర్తుచేశారు. జాన్వీతో పాటు 'హోమ్ బౌండ్' చిత్రబృందం కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అన్‌సర్టైన్ రిగార్డ్ విభాగంలో ఈ సినిమాను కేన్స్‌లో ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది భారత్ నుంచి ఈ చిత్రోత్సవానికి ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించారు. ఇషాన్ కట్టర్ కథానాయకుడు. మరోవైపు కేన్స్ రెడ్‌కార్పెట్‌పై నటి, మాజీ మిస్ హర్యానా టైటిల్ విన్నర్, రుచి గుజ్జర్ మెడలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలు ఉన్న నెక్లెస్ ధరించి అందరి దృష్టినీ ఆకట్టుకున్నారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ వేడుక 24వ తేదీ వరకు జరుగుతుంది. ఇప్పటికే భారత్ నుంచి ఊర్వశీ రౌతేలా, 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ తదితరులు రెడ్ కార్పెట్‌పై హొయలొలికించిన సంగతి తెలిసిందే.



'సారీ సార్ షో లేదు'

● పెద్ద సినిమా వసూళ్లలో వాటాపైనే ఎగ్జిబిటర్ల ఆశలు ● అద్దె అయితే రూ. వేలల్లో, వాటా అయితే రూ. లక్షల్లో ఆదాయం

● మల్టీప్లెక్స్‌ల బాటలోనే ఆదాయాన్ని పంచాలంటున్న ఎగ్జిబిటర్లు ● నేడు తుది నిర్ణయం

'ఇకపై సినిమా ప్రదర్శనలకు అద్దె ప్రాతిపదికన థియేటర్లను ఇవ్వడం ఆపేస్తున్నాం. సినిమాకు వచ్చిన వసూళ్లను బట్టి వాటాలు పంచాలి. ఈ ఒప్పందానికి నిర్మాతలు, పంపిణీదారులు అంగీకరిస్తే సరే. లేదంటే జూన్ 1 నుంచి థియేటర్లను మూసేస్తాం'... ఇదీ ఇటీవలే రెండు తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్లు హైదరాబాద్‌లో సమావేశమై తీసుకున్న నిర్ణయం. ఆకాశాన్నంటిన అగ్రతారల పారితోషికాలు, పాన్ ఇండియా పేరుతో తడిసి మోపడవుతున్న నిర్మాణ వ్యయం, థియేటర్లపై ప్రేక్షకుల శీతకన్ను లాంటి సమస్యలతో ఇప్పటికే ఇండస్ట్రీ కుదేలైంది. సమ్మెకు ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లైంది.

ఐదేళ్ల క్రితం 3500 వరకూ ఉన్న సింగిల్ స్ర్కీన్లు ఇప్పుడు 1300కు తగ్గిపోయాయి. సమీప భవిష్యత్‌లోనూ ఈ పరిస్థితి మారేలా కనిపించడం లేదు. థియేటర్లలో సినిమాలు చూసే ప్రేక్షకుల సంఖ్య తగ్గడం ఓ కారణమైతే, వసూళ్లలో న్యాయమైన భాగం తమకు దక్కకపోవడం వల్ల నష్టాలు వచ్చి సింగిల్ స్ర్కీన్లు మూసేయాల్సి వస్తోందనేది ఎగ్జిబిటర్ల వాదన. తమకు రాబడి పెరిగితే థియేటర్లను మూసేయకుండా ఎలాగోలా నెట్టుకొస్తామని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. వసూళ్లలో వాటాల విధానం వల్ల ఇరుపక్షాలు లాభపడడమే కాదు ఇండస్ట్రీ కూడా పదికాలాలు పచ్చగా ఉంటుందని వారు అంటున్నారు.

12 టికెట్లు తెగితేనే షో

'ఈ ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత పైసా ఆదాయం చూడలేదు. ఫిబ్రవరి నుంచి విపరీతమైన నష్టాలు వస్తున్నాయి. నెల నెలా రెండు మూడు లక్షల రూపాయల వరకూ నష్టపోతున్నాం. అదే వాటాల విధానంలో అయితే సినిమా దెబ్బతిన్నా ఎంతో కొంత చేతికొస్తుంది' అంటున్నారు ఎగ్జిబిటర్లు. 'హైదరాబాద్‌లోని మెయిన్ థియేటర్లలో సైతం 12 టికెట్లు తెగితేనే షో వేస్తున్నాం. లేకపోతే వేయడం లేదని ఓ సీనియర్ ఎగ్జిబిటర్ చెప్పారు. 'కనీసం పదిమంది పైన వస్తేనే షో వేస్తాం లేదంటే వేయం' అని ప్రేక్షకులకు ముందే చెప్పి టికెట్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. షో పడకపోతే డబ్బు వాపసు ఇస్తున్నారు. షో పడుతుందో లేదో అనే సందేహంతో అరగంట ముందే ఏసీ వేస్తే వృథా అవుతుందని ఆపుతున్నామని వారు చెప్పారు. ఇటీవలే ఓ అగ్ర కథానాయిక నిర్మించిన లో బడ్జెట్ చిత్రం విడుదలైంది. ఆ సినిమా ఒక థియేటర్‌లో 8 రోజులు నడిస్తే జనాల్లేక 17 ఆటలు బంద్ చేశారు. అంటే రోజూ రెండు షోలు రద్దయ్యాయి. హైదరాబాద్‌లోని మెయిన్ సెంటర్లలో ఉన్న థియేటర్లలో ప్రదర్శనకు కనీసం 12 మంది ప్రేక్షకులు కూడా రావడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మల్టీప్లెక్స్‌లో కూడా ఇదే పరిస్థితి. వాటికి రోజుకు ఐదు షోలకు అనుమతులు ఉన్నా అందులో సగం షోలు కూడా పడట్లేదు. మల్టీప్లెక్స్‌ల్లో బుకింగ్ కౌంటర్ దగ్గరకు వెళ్లిన ప్రేక్షకులకు 'సారీ సార్ షో లేదు' అనే సమాధానం తరచూ ఎదురవుతోంది.

చాలాకాలంగా మల్టీప్లెక్స్‌ల్లో వాటాల విధానమే అమల్లో ఉంది. ఒప్పందాన్ని బట్టి వచ్చిన వసూళ్లలో 45-55 లేదా 40-60 నిష్పత్తిలో పంచుకుంటున్నారు. ఇప్పుడు ఇదే విధానాన్ని తమకి కూడా వర్తింపజేయాలనేది సింగిల్ స్ర్కీన్ల యజమానుల డిమాండ్.

టికెట్ రేట్లు పెంచినా అద్దె పెరగలేదు

సినిమాకు వసూళ్లు ఎంత వచ్చినా థియేటర్ల అద్దెను మాత్రం నిర్మాతలు, పంపిణీదారులు పెంచడం లేదని, ప్రభుత్వాల నుంచి జీవోలు తెచ్చుకొని టికెట్ ధరలు భారీగా పెంచుకొని వారు లాభపడుతున్నారని. అందులో తమకు మాత్రం ఎలాంటి వాటా దక్కడం లేదని థియేటర్ల యజమానులు వాపోతున్నారు. 'పెద్ద సినిమాలకు వచ్చిన వసూళ్లను నిర్మాతలు, పంపిణీదారులు పూర్తిగా తమ జేబుల్లో వేసుకుంటున్నారని. ఇదే విధానం కొనసాగితే మున్ముందు మరిన్ని సింగిల్ స్ర్కీన్లు మూతపడడం ఖాయమని చెబుతున్నారు. 'తాము కూర్చున్న కొమ్మనే వారు నరుక్కుంటున్నారు. అదనపు షోలు, బెనిఫిట్ షోల వల్ల మాకు పైసా ఆదాయం లేదు. టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వాల నుంచి జీవోలు తెచ్చుకుంటున్న నిర్మాతలు థియేటర్ల అద్దెను మాత్రం పెంచడం లేదు' అని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. 'షేరింగ్ విధానంలో అయితేనే థియేటర్లను ఇస్తామని లేదంటే థియేటర్లను మూసేస్తాం తప్ప అద్దె విధానంలో మాత్రం ఆడించం అని ఇప్పటికే గోదావరి జిల్లాల్లో థియేటర్ల యజమానులు తేల్చిచెప్పారు. ఈ విషయం మీద ఇప్పటికే పలు సార్లు చర్చలు జరిగాయి. గురువారం జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

పంపిణీదారుడిదే పై చేయి

ఒప్పంద పత్రంలోనే పంపిణీదారులు తమకు అనుకూలంగా ఉండేలా రెంట్/పర్సంటేజీ విధానంలో చెల్లింపులు అని రాసుకుంటున్నారు. అవకాశాన్ని బట్టి దాని అర్థాన్ని అన్వయించుకుంటున్నారు. ఒక పెద్ద సినిమా విడుదలై రూ. 40 లక్షల వసూళ్లు వస్తే ఎగ్జిబిటర్‌కు రూ. లక్ష ఇస్తున్నారు. రూ. 39 లక్షలు నిర్మాతలు, పంపిణీదారులు తీసుకుంటున్నారు. అక్కడ అద్దె విధానంలో లెక్క గట్టి చెల్లింపులు చేస్తున్నారు. అదే ఏదైనా చిన్న సినిమాకు రూ. 40 వేల వసూళ్లు వస్తే మాత్రం రూ. 20 వేలు ఇస్తున్నారు. అదేమంటే 50-50 పర్సంటేజీ అంటున్నారు. ప్రింట్ సిస్టమ్ ఉన్నప్పుడు ఎగ్జిబిటర్ నష్టపోతే ఆ నష్టపోయిన సొమ్మును కట్టి పంపిణీదారుడు తన ప్రింట్ తీసుకెళ్లేవాడు. ఇప్పుడు ఆ అవకాశమూ ఎగ్జిబిటర్లకు లేదు.

నేడు తుది నిర్ణయం

ముందు కనీసం రెండు మూడు నెలలయినా పర్సంటేజీ విధానంలో ఆడించి చూస్తే అవగాహన వస్తుంది. బాగుంటే పర్వాలేదు లేదంటే సూపర్‌మార్కెట్లకో, గోడౌన్లకో కిరాయికి ఇచ్చుకోక తప్పదంటున్నారు ఎగ్జిబిటర్లు. బుధవారం డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు విడివిడిగా సమావేశమయ్యారు. డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో షేరింగ్ విధానంపై ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. తొందరపడి ఓ నిర్ణయానికి రావొద్దు, సావధానంగా చర్చించి ఓ నిర్ణయానికి వద్దాం అని పంపిణీదారులు ఎగ్జిబిటర్లను కోరారు. నిర్మాత దిల్‌రాజు, సురేశ్‌బాబు, నాగవంశీ, దానయ్య, సునీల్ నారంగ్, ఏఎం రత్నం తదితరులు సమావేశమై ఎగ్జిబిటర్ల సమస్యలపై చర్చించారు. పరిశ్రమకు చెందిన అన్ని విభాగాలతో ఓ కమిటీ వేసి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని నిర్మాతలు ప్రతిపాదించారు. నిర్మాతల మండలి గురువారం మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుంది. తర్వాత రెండు మూడు రోజుల్లో నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్ల ఉమ్మడి సమావేశం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నేతృత్వంలో జరుగుతుంది. ఆ సమావేశం పూర్తయ్యాకనే మీడియా ముందుకొచ్చి వివరాలను ప్రకటించాలని, అప్పటివరకూ ఎక్కడా దీనిపై స్పందించకూడదనిని నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు, నిర్ణయం తీసుకున్నారు.

- ఇటీవలే ఓ యువ హీరో నిర్మించిన మిడ్‌రేంజ్ సినిమా విడుదలైంది. 50-50 పర్సంటేజీ విధానంలో ఆ హీరో, పంపిణీదారుడు కలసి ఎగ్జిబిటర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. తొలి రోజు ఆటకు రూ. 4 లక్షల చొప్పున వసూళ్లు వచ్చాయి. ఒప్పందం ప్రకారం చెరో రెండు లక్షలు తీసుకోవాలి. కానీ వసూళ్లు ఎక్కువగా వచ్చాయని చెప్పి ఎగ్జిబిటర్‌కు రూ. లక్ష చేతులో పెట్టి రూ. 3 లక్షలు డిస్ట్రిబ్యూటర్ తీసుకున్నారు. చేసేదేం లేక ఎగ్జిబిటర్ మిన్నకున్నాడు.
- హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ థియేటర్‌లో పెద్ద హీరో సినిమాకు బెనిఫిట్ షో వేస్తే రూ. 13 లక్షల వసూళ్లు వచ్చాయి. కానీ థియేటర్ యజమానికి మాత్రం ఒప్పందం ప్రకారం ఆటకు రూ. 20 వేలు చొప్పున కిరాయి మాత్రమే దక్కింది. మిగిలిన సొమ్మంతా డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల చేతికివెళ్లింది. అదే 40 శాతం వాటా గనుక ఇస్తే రూ. 5 లక్షల వరకూ ఎగ్జిబిటర్‌కు వస్తాయి. అంతా నిర్మాతలు, పంపిణీదారులకే దక్కితే మాకేం మిగులుతుంది అని ఎగ్జిబిటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణరంగంలోకి హీరో యశ్ మాతృమూర్తి



కన్నడ హీరోగా కెరీర్ ప్రారంభించి పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన యశ్ ప్రస్తుతం 'రామాయణ' చిత్రంలో రావణుడిగా నటిస్తున్న సంగతి విదితమే. ఆయన మాతృమూర్తి పుష్ప అరుణ్‌కుమార్ ఇప్పుడు నిర్మాతగా మారారు. కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం కోసం ఆవిడ చిత్ర నిర్మాణసంస్థను ఏర్పాటు చేసి 'కొత్తలవాడి' చిత్రం తీస్తున్నారు. పృథ్వీ అంచార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సిరాజ్ దర్శకుడు. ఈ సినిమా పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ మేకర్స్ బుధవారం టీజర్ విడుదల చేశారు. మాస్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ ఆకట్టుకుంటోంది.

పర్సెంటేజీ విధానాన్ని అమలు చేయాలి

ప్రతాని రామకృష్ణ గౌడ్



థియేటర్ల బంద్ విషయంపై తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఛైర్మన్ ప్రతానిరామకృష్ణ గౌడ్ స్పందించారు. "2002 వరకూ పర్సెంటేజీ విధానమే అమల్లో ఉండేది. ఆ తర్వాత అది రెంట్ విధానంలోకి మారింది. అప్పటి నుంచే సింగల్ థియేటర్లకు కష్టాలు మొదలయ్యాయి. నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు పర్సెంటేజీ విధానమే లాభదాయకమైనది. చిన్న నిర్మాతలకు మరింత మేలు జరుగుతుంది. ఇప్పుడు థియేటర్స్ మూతపడితే మాలాంటి నిర్మాతలకు భారీ నష్టం జరుగుతుంది" అని ప్రతాని అన్నారు. ఆయన నటించి స్వీయ దర్శకత్వం వహించి ఆర్.కె ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించిన 'దీక్ష' చిత్రం విడుదలకు సిద్ధమైంది.

హాస్యంతో అలరిస్తుంది



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'వీరరాజు 1991'. రుద్ర వీరాజ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించారు. కిరణ్ చెరుకూరి నిర్మించారు. అజయ్ ఘోష్, బెనర్జీ కీలకపాత్రలు పోషించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. రుద్రవీరాజ్ మాట్లాడుతూ 'ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది. వ్యంగ్యం, వినోదం కలబోసిన సినిమా ఇది' అని చెప్పారు. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారని నిర్మాత తెలిపారు.

మంచి నటిగా గుర్తుండిపోవాలి

ఆకాంక్ష సింగ్

'మళ్లీరావా' ఫేమ్ ఆకాంక్ష సింగ్ నటించిన చిత్రం 'షష్ఠి పూర్తి'. డా.రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేశ్ ప్రధాన పాత్రల్లో పవన్ ప్రభ తెరకెక్కించారు. రూపేశ్ నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు ఆకాంక్ష. "తెలుగులో చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న చిత్రమిది. ఇందులో జానకి అనే గ్రామీణ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో ఎన్నో షేడ్స్ ఉంటాయి. అద్భుతమైన కథతో పాటు ఉన్నతమైన సాంకేతిక విలువలు ఉన్న చిత్రమిది. ఈ చిత్ర ప్రయాణం ఓ మరిచిపోలేని అనుభూతి. సినిమా కేవలం షష్ఠిపూర్తి గురించే కాకుండా అన్ని రకాల అంశాలనూ టచ్ చేస్తుంది. దర్శకుడు పవన్‌కు అద్భుతమైన విజన్‌తో పాటు మంచి క్లారిటీ ఉంటుంది. రాజేంద్రప్రసాద్‌గారు గొప్ప నటుడు. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నన్ను ఓ మంచి నటిగానే ప్రేక్షకులు గుర్తుపెట్టుకోవాలనేది నా కోరిక. అందుకు తగ్గట్లుగానే మంచి కథల్ని, గుర్తుండిపోయే పాత్రల్నీ ఎంపిక చేసుకుంటాను. ఇళయరాజాగారి సంగీతం ప్రధానాకర్షణ. తల్లిదండ్రుల గురించి గొప్ప సందేశమిచ్చే ఈ చిత్రాన్ని అందరూ చూడాలి" అని చెప్పారు.



జూలై 8 నాటికి భారత్‌-యూఎస్‌ తాత్కాలిక వాణిజ్య ఒప్పందం!

తుది దశకు చేరిన చర్చలు

బెట్టు సడలిస్తున్న రెండు దేశాలు



న్యూఢిల్లీ: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం భారత్‌-అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరాయి. దీంతో జూలై 8వ తేదీ లోపే రెండు దేశాల మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్పాయి. ఈ ఒప్పందం కుదిరితే జూలై 9 నుంచి భారత ఎగుమతులపై అమల్లోకి వచ్చే 26 శాతం సుంకాల బెడద తప్పుతుంది. గత నెల 2న విధించిన ఈ సుంకాల అమలును ట్రంప్‌ సర్కారు జూలై 9 వరకు పక్కనపెట్టింది. దీంతో ఈలోపే బీటీఏకి సంబంధించి ఏదో రూపంలో తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్‌ యోచిస్తోంది. ఆ తర్వాత సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి బీటీఏపై తుది ఒప్పందానికి రావాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

బెట్టు సడలింపు !

ఈ తాత్కాలిక ఒప్పందం కోసం రెండు దేశాలు మెట్టు దిగుతున్నట్టు సమాచారం. అమెరికా తన దిగుమతులపై విధించిన 26 శాతం సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తే, ఆ దేశ వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఆటోమొబైల్స్‌ ముఖ్యంగా విద్యుత్‌ వాహనాల (ఈవీ) దిగుమతులను కనీస దిగుమతి ధర (ఎంఐపీ)తో కోటా పద్ధతిలో అనుమతించేందుకు భారత్‌ సిద్ధమైనట్టు తెలుస్తోంది. మన దేశం నుంచి ఎగుమతయ్యే టెక్స్‌టైల్స్‌, తోలు వస్తువులు, రొయ్యలు, ప్లాస్టిక్‌ వస్తువులు, రసాయనాలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటి పండ్లు, జెమ్స్‌ అండ్‌ జువెలరీ, ఫార్మా ఉత్పత్తులపై అమెరికా దిగుమతి సుంకాలు పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఇందుకు ప్రతిగా తన పారిశ్రామిక వస్తువులు, వైన్స్‌, పెట్రో కెమికల్‌ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, యాపిల్స్‌, జన్యుమార్పిడితో పండించిన సోయా, మొక్కజొన్న దిగుమతులపై భారత్‌ మరింత ఉదారంగా వ్యవహరించాలని అమెరికా కోరుతోంది. ఈ సమస్యలను అధిగమిస్తే జూలై 8లోగా రెండు దేశాల మధ్య తాత్కాలిక బీటీఏ సాధ్యమేనని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

అదే బాటలో ఈయూ

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కోసం భారత్‌-యూరోపియన్‌ యూనియన్‌ (ఈయూ) మధ్య జరుగుతున్న చర్చలూ ఊపందుకున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఈయూతోనూ ఈ ఏడాది జూలైలోగా తాత్కాలిక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని తెలిపాయి. ఇందుకోసం ఒక ఉన్నతాధికార బృందం ఈ వారం ఈయూ కేంద్రమైన బ్రస్సెల్స్‌ వెళ్లనుంది. తమ దేశాల నుంచి దిగుమతయ్యే ఆటోమొబైల్స్‌, వైద్య పరికరాలు, మద్యం, మాంసం, పౌల్ట్రీ దిగుమతులపై భారత్‌ సుంకాలను పూర్తిగా ఎత్తివేయడం లేదా గణనీయంగా తగ్గించాలని ఈయూ కోరుతోంది. దీనికి తోడు తమ కంపెనీలు భారత్‌లో అమ్మే వస్తువుల మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్‌)ను సంరక్షించాలని కోరుతోంది. అందుకు ప్రతిగా భారత్‌ నుంచి ఎగుమతయ్యే రెడీమేడ్‌ దుస్తులు, ఔషధాలు, స్టీలు, పెట్రో ఉత్పత్తులు, విద్యుత్‌ మెషినరీపై సుంకాలు కనీస స్థాయికి తగ్గించేందుకు లేదా పూర్తిగా ఎత్తివేసేందుకు ఈయూ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం కుదిరితే ఈయూలోని 27 దేశాలకు భారత ఎగుమతులు గణనీయంగా పెరగనున్నాయి.

హోండా మాక్సీ స్కూటర్‌ ఎక్స్‌-ఏడీవీ



హోండా మోటార్‌సైకిల్‌ అండ్‌ స్కూటర్‌ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) మార్కెట్లోకి సరికొత్త అడ్వెంచర్‌-మాక్సీ స్కూటర్‌ ఎక్స్‌-ఏడీవీ విడుదల చేసింది. ఈ హోండా ఎక్స్‌-ఏడీవీ ధర రూ.11.90 లక్షలు (గురుగ్రామ్‌ ఎక్స్‌షోరూమ్‌). హోండా బిగ్‌ వింగ్‌ షోరూమ్‌ల్లో ఈ మోటార్‌సైకిల్‌ అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే ఈ బైక్‌ బుకింగ్స్‌ ప్రారంభించామని, జూన్‌లో డెలివరీలు ప్రారంభమవుతాయని పేర్కొంది. మాక్సీ స్కూటర్‌ను అడ్వెంచర్‌ మోటార్‌సైకిల్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపింది.

జోస్‌ అలుక్కాస్‌లో శుభమాంగళ్యం ఆఫర్లు

JOS ALUKKAS

హైదరాబాద్‌: జువెలరీ సంస్థ జోస్‌ అలుక్కాస్‌.. పెళ్లిళ్ల సీజన్‌ను పురస్కరించుకుని శుభమాంగళ్యం పేరుతో వివాహ ఆభరణాల ఉత్సవాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా వివాహ వేడుకల కోసం చేసే కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది. ఈసీజన్‌లో ప్రత్యేక ఆఫర్‌గా బంగారం కొనుగోళ్లపై అంతే బరువు గల వెండిని ఉచితంగా అందించనున్నట్లు జోస్‌ అలుక్కాస్‌ వెల్లడించింది. అలాగే పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై తరుగు మీద బంగారు ఆభరణాలకు 30%, వజ్రాలకు 25% తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. దీంతోపాటు ప్లాటినం ఆభరణాల తరుగు మీద 15% తగ్గింపు అందిస్తోంది. వెండి ఆభరణాలు ఎటువంటి తరుగు లేకుండా లభిస్తాయని పేర్కొంది.

కలరా వ్యాక్సిన్‌ హిల్‌కాల్‌ ఫేజ్‌-3 పరీక్షలు విజయవంతం

భారత్‌ బయోటెక్‌

హైదరాబాద్‌ (ఆంధ్రజ్యోతి బిజినెస్‌): భారత్‌ బయోటెక్‌ త్వరలో మరో వినూత్న వ్యాక్సిన్‌ను మార్కెట్లోకి విడుదల చేసేందుకు రెడీ అవుతోంది. కలరా మహమ్మారిని అడ్డుకునేందుకు కంపెనీ అభివృద్ధి చేస్తున్న 'హిల్‌కాల్‌' వ్యాక్సిన్‌ మూడో దశ (ఫేజ్‌-3) పరీక్షలు 1,800 మందిపై విజయవంతంగా పూర్తి చేసినట్టు వెల్లడించింది. దేశంలోని 10 కేంద్రాల్లో 1,800 మందిని వారి వయసు ఆధారంగా మూడు గ్రూపులుగా విభజించి కంపెనీ ఈ పరీక్షలు పూర్తి చేసింది. 'వ్యాక్సిన్లు అవసరమైన వ్యక్తులకు అందుబాటు ధరల్లో, సమర్థవంతమైన వ్యాక్సిన్లను అందజేయాలనే మా నిబద్ధతకు ఇది నిదర్శనం' అని భారత్‌ బయోటెక్‌ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌ కృష్ణ ఎల్లా చెప్పారు. కలరా సోకకుండా ముందు జాగ్రత్తగా నోటి ద్వారా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చు. ప్రస్తుతం ఏటా ప్రపంచవ్యాప్తంగా 28.6 లక్షల మంది కలరా బారిన పడుతుంటే వారిలో 95,000 మంది మృత్యువాత పడుతున్నారు.

'అడ్వాన్స్‌ టిప్‌'పై ఉబర్‌కు నోటీసు

న్యూఢిల్లీ: కస్టమర్లు వేగవంతంగా సర్వీస్‌ కావాలనుకుంటే అడ్వాన్స్‌గా టిప్‌ ఇచ్చే విధంగా ఒత్తిడి చేస్తున్నందుకు ఉబర్‌కు కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) నోటీసు జారీ చేసింది. కస్టమర్లు సర్వీస్‌ పొందడానికి ముందే టిప్‌ ఇచ్చేలా చేసే చర్య తీవ్ర ఆందోళనకరం, అనైతికమని వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌ జోషి తన సోషల్‌ మీడియా వేదికపై వ్యాఖ్యానించారు. ఒక సేవను అందుకున్న అనంతరం దానికి సంతృప్తి చెందితే మెచ్చుకుంటూ ఇచ్చేది టిప్‌ అని, అంతే తప్పితే ముందుగానే ఒత్తిడి చేసి వసూలు చేసేది కాదని పేర్కొంటూ ఆ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని సీసీపీఏను మంత్రి ఆదేశించారు. ఆయన ఆదేశం మేరకు సీసీపీఏ బుధవారం ఉబర్‌కు నోటీసు జారీ చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్‌ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్‌	520	విజయవాడ	530
వరంగల్‌	522	గోదావరి	517
చిత్తూరు	623	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్‌ ధర — వెన్‌కాబ్‌ బ్రాయిలర్‌ చికెన్‌



హైదరాబాద్‌	125	విజయవాడ	119
వరంగల్‌	125	గుంటూరు	122
కరీంనగర్‌	125	ఒంగోలు	122
మహబూబ్‌నగర్‌	125	చిత్తూరు	111
కర్నూలు	125	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్‌	97,420 ▲	89,300 ▲	1,11,000 ▲
విజయవాడ	98,750 ▲	93,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,220 ▲	89,300 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,420 ▲	89,300 ▲	1,01,000 ▲
ప్రొద్దుటూరు	96,450 ▲	88,730 ▲	99,500 ▲
ముంబై	95,309 ▲	87,303 ▲	97,332 ▲

మార్కెట్‌ లాభాల బాట

సెన్సెక్స్‌ 410 పాయింట్లు అప్‌

ముంబై: ఈక్విటీ మార్కెట్లో మూడు రోజుల వరుస నష్టాలకు తెర పడింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌, ఐసీఐసీఐ బ్యాంక్‌ వంటి బ్లూచిప్‌ షేర్లలో కొనుగోళ్లు బుధవారం మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. ప్రధానంగా ఆసియా మార్కెట్లు పాజిటివ్‌ ట్రెండ్‌ ప్రదర్శించడం సెంటిమెంట్‌ బలపడేందుకు దోహదపడింది. సెన్సెక్స్‌ ఒక దశలో 835.2 పాయింట్ల లాభంతో 82,021.64 స్థాయిని తాకింది. కాని ముగింపు సమయానికి లాభాన్ని 410.19 పాయింట్లకు సరిపెట్టుకుని 81,596.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129.55 పాయింట్ల లాభంతో 24,813.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 లాభాలతో ముగిశాయి. బజాజ్‌ ఫిన్‌సర్వ్‌ షేరు గరిష్ఠంగా 2.02 శాతం లాభపడగా ఇండస్‌ ఇండ్‌ బ్యాంక్‌ షేరు గరిష్ఠంగా 1.39 శాతం నష్టపోయింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్‌ సూచీ 0.90 శాతం, స్మాల్‌క్యాప్‌ సూచీ 0.51 శాతం లాభపడ్డాయి. కన్స్యూమర్‌ డ్యూరబుల్స్‌ మినహా మిగతా రంగాల వారీ సూచీలన్నీ లాభాల్లోనే ముగిశాయి.

వచ్చే వారం మూడు ఐపీఓలు: ప్రైమరీ మార్కెట్లో వచ్చే వారం మూడు ఐపీఓలు సందడి చేయనున్నాయి. లీలా ప్యాలెస్‌ హోటల్స్‌ అండ్‌ రిసార్ట్స్‌ నిర్వహణ సంస్థ స్క్లాస్‌ బెంగళూరు లిమిటెడ్‌, ఏజిస్‌ వోప్యాక్‌ టెర్మినల్స్‌ ఇష్యూలు వచ్చే సోమవారం ప్రారంభమై బుధవారం ముగుస్తాయి. స్క్లాస్‌ బెంగళూరు లిమిటెడ్‌ ఇష్యూ ధర శ్రేణిని రూ.413-435గా ప్రకటించింది.

● ఏజిస్‌ వోప్యాక్‌ టెర్మినల్స్‌ ఇష్యూ ధర శ్రేణిని రూ.223-235గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.2,800 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

● ఇష్యూకి వస్తున్న మరో కంపెనీ ప్రోస్టార్మ్‌ ఇన్ఫో సిస్టమ్స్‌ లిమిటెడ్‌. ఈ కంపెనీ ఇష్యూ ధర శ్రేణిని రూ.95-105గా ప్రకటించింది. రూ.168 కోట్ల సమీకరణ లక్ష్యంతో కంపెనీ మార్కెట్లోకి వస్తోంది. ఈ ఇష్యూ వచ్చే మంగళవారం (27వ తేదీ) ప్రారంభమై గురువారం (29వ తేదీ) ముగుస్తుంది.

కేజీ బేసిన్‌ క్లస్టర్‌-2పై ఓఎన్‌జీసీ కసరత్తు

ఎక్సాన్‌, బీపీ, షెల్‌ కంపెనీలతో చర్చలు

న్యూఢిల్లీ: కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని క్లస్టర్‌-2 ప్రాజెక్టు (కేజీ-డీడబ్ల్యూఎన్‌-98/2) ఉత్పత్తి పెంపుపై ఓఎన్‌జీసీ దృష్టి పెట్టింది. ఇందుకోసం తమతో భాగస్వామ్య పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి ఉన్న అంతర్జాతీయ చమురు దిగ్గజ సంస్థలతో చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎక్సాన్‌ మొబిల్‌, బ్రిటిష్‌ పెట్రోలియం (బీపీ), షెల్‌ కంపెనీలతో చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ విషయంలో ఎక్సాన్‌తో జరుగుతున్న చర్చలు ఆశాజనకంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఎందుకంటే: ఆంధ్రప్రదేశ్‌ తీరంలోని లోతట్టు సముద్ర జలాల్లో ఉన్న ఈ బ్లాకులో చమురు, గ్యాస్‌ ఉత్పత్తి కోసం ఓఎన్‌జీసీ దాదాపు 500 కోట్ల డాలర్లు (సుమారు రూ.42,500 కోట్లు) ఖర్చు చేసింది. ఈ బ్లాకు నుంచి రోజూ 45,000 బ్యారళ్ల చమురు, 10 మిలియన్‌ మెట్రిక్‌ స్టాండర్డ్‌ క్యూబిక్‌ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్‌ ఉత్పత్తి చేయవచ్చని ముందు అంచనా వేసింది. అయితే ప్రస్తుతం ఈ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. దీంతో అంతర్జాతీయ చమురు దిగ్గజాల అధునాతన టెక్నాలజీ, అనుభవాన్ని ఉపయోగించుకుని ఉత్పత్తి పెంచాలని ఓఎన్‌జీసీ యోచిస్తోంది.

లాభాల్లో ఇండిగో రికార్డు

క్యూ4లో రూ.3,067 కోట్లు

న్యూఢిల్లీ: పౌర విమానయాన సంస్థ ఇండిగో చరిత్రలోనే రికార్డు లాభాలను 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికం (క్యూ4)లో నమోదు చేసింది. ప్రయాణాల డిమాండ్‌ బలంగా ఉండడంతో క్యూ4లో రూ.3,067.5 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఆర్జించిన లాభం రూ.1,894.8 కోట్లతో పోల్చితే ఇది 62% అధికం. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం రూ.18,505.1 కోట్ల నుంచి రూ.23,097.5 కోట్లకు పెరిగింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్‌ను సిఫారసు చేసింది. 2024-25లో ఇండిగో 3.19 కోట్ల మంది ప్రయాణికులను వివిధ గమ్యస్థానాలకు చేర్చింది.

ఇండస్‌ఇండ్‌ నష్టం రూ.2,329 కోట్లు

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో ఇండస్‌ఇండ్‌ బ్యాంక్‌ లాభాలకు భారీగా గండి పడింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.2,349 కోట్ల కన్సాలిడేటెడ్‌ నికర లాభం ప్రకటించిన బ్యాంక్‌ ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో రూ.2,329 కోట్ల భారీ నష్టాలను చవిచూసింది. కేటాయింపుల భారం రూ.950 కోట్ల నుంచి మూడింతలు పెరిగి రూ.2,522 కోట్లకు చేరడమే ఇందుకు ప్రధాన కారణం.

సతీశ్‌ సంచలనం

మలేసియా మాస్టర్స్‌ బ్యాడ్మింటన్‌

● మూడోసీడ్‌కు షాకిచ్చి రెండోరౌండ్‌కు
● ప్రణయ్‌, శ్రీకాంత్‌ ముందుకు.. సింధు ఇంటికి



సతీశ్‌

కౌలాలంపూర్‌: భారత యువ షట్లర్‌ సతీశ్‌ కరుణాకరణ్‌ మలేసియా మాస్టర్స్‌ టోర్నమెంట్‌లో సంచలనం సృష్టించాడు. సింగిల్స్‌ ఆరంభ రౌండ్లో సతీశ్‌ 21-13, 21-14తో ప్రపంచ ఏడో ర్యాంకర్‌, మూడోసీడ్‌ చో తిన్‌ చెన్‌ (చైనీస్‌ తైపీ)కు షాకిచ్చాడు. విగతా భారత షట్లర్లలో సీనియర్లు కిడాంబి శ్రీకాంత్‌, హెచ్‌ఎస్‌ ప్రణయ్‌ శుభారంభం చేయగా.. రెండుసార్లు ఒలింపిక్‌ పతక విజేత పీవీ సింధు ఆరంభ రౌండ్లోనే వెనుదిరిగింది. ప్రణయ్‌ 19-21, 21-17, 21-16తో ఐదోసీడ్‌ కెంటా నిషిమొటో (జపాన్‌)పై, శ్రీకాంత్‌ 23-21, 13-21, 21-11తో లా గువాంగ్‌ (చైనా)పై, ఆయుష్‌ షెట్టి 20-22, 21-10, 21-8తో బ్రయాన్‌ (కెనడా)పై గెలిచి రెండో రౌండ్‌ చేరారు. రజావత్‌ 15-21, 17-21తో హెంగ్‌ (సింగపూర్‌) చేతిలో ఓడాడు. పేలవఫామ్‌ను కొనసాగిస్తున్న సింధు 11-21, 21-14, 15-21తో గుయెన్‌ తుయ్‌ లిన్‌ (వియత్నాం) చేతిలో ఓడగా.. మరో ముగ్గురు మహిళా షట్లర్లు ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్‌, మాళవిక కూడా పరాజయాలతో నిష్క్రమించారు. మిక్స్‌డ్‌ డబుల్స్‌లో ధ్రువ్‌ కపిల/తనీషా జోడీ 21-18, 15-21, 21-14తో ఇండోనేసియా జంట అద్నాన్‌/ఇన్‌దాపై నెగ్గగా.. మిగతా భారత జోడీల్లో అషిత్‌ సూర్య/అమృత ప్రముతేష్‌, రోహన్‌/రుత్వికా శివాని, సతీశ్‌/ఆద్య మిక్స్‌డ్‌లో తమ పోరును ఆదిలోనే ముగించారు.

ఇంగ్లండ్‌తో టెస్ట్‌ సిరీస్‌కు 24న భారత జట్టు ఎంపిక?

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టెస్ట్‌ సిరీస్‌కు భారత జట్టును శనివారం రాత్రి ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఆ రోజు సెలెక్షన్‌ కమిటీ భేటీ అనంతరం నూతన సారథితోపాటు జట్టును కూడా ప్రకటిస్తారని సమాచారం. కాగా, టెస్టులకు రోహిత్‌ శర్మ రిటైర్మెంట్‌ ప్రకటించడంతో కెప్టెన్సీ రేసులో బుమ్రా కంటే శుభ్‌మన్‌ గిల్‌ పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అయితే, ఓ సెలెక్టర్‌ మాత్రం గిల్‌ సామర్థ్యాన్ని శంకిస్తున్నాడని తెలుస్తోంది.

ఈ-స్పోర్ట్స్‌ వరల్డ్‌ కప్‌నకు అర్జున్‌

న్యూఢిల్లీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్‌ అర్జున్‌ ఇరిగేసి ఈ-స్పోర్ట్స్‌ వరల్డ్‌ కప్‌ చెస్‌ టోర్నీకి అర్హత సాధించాడు. 12 మంది క్రీడాకారులు పోటీపడే ఈ వరల్డ్‌ కప్‌ జూలై 7 నుంచి ఆగస్టు 24 వరకు సౌదీ అరేబియాలో జరగనుంది. ఆన్‌లైన్‌ ఈవెంట్‌ అయిన చాంపియన్స్‌ చెస్‌ టూర్‌(సీసీటీ)లో టాప్‌-12లో నిలవడంతో అర్జున్‌ ఈ-స్పోర్ట్స్‌ వరల్డ్‌కప్‌నకు బెర్త్‌ దక్కించుకున్నాడు. దీంతో ఈ మెగా టోర్నీకి ఎంపికైన తొలి భారత ఆటగాడిగా అర్జున్‌ రికార్డుకెక్కాడు. సీసీటీలో భాగంగా ఈ ఏడాది ఆరంభంలో చెసబుల్‌ మాస్టర్స్‌ నిర్వహించగా.. ప్రస్తుతం క్లాసిక్‌ ఈవెంట్‌ జరుగుతోంది. ఇప్పటికే చెసబుల్‌ మాస్టర్స్‌లో సెమీస్‌ చేరిన అర్జున్‌.. తాజాగా చెస్‌ డాట్‌ కామ్‌ క్లాసిక్‌లో ప్లేఆఫ్స్‌కు చేరి వరల్డ్‌కప్‌ అర్హతకు కావాల్సిన పాయింట్లను దక్కించుకొన్నాడు. ఈ టోర్నీకి ఇప్పటికే కార్ల్‌సన్‌, నెపోమ్నియాచి, నకమురలాంటి స్టార్లు ఎంపికయ్యారు.

కనక్‌కు స్వర్ణం



న్యూఢిల్లీ: భారత యువ షూటర్‌ కనక్‌ ఐఎస్‌ఎస్‌ఎఫ్‌ జూనియర్‌ ప్రపంచ కప్‌లో స్వర్ణ పతకంతో సత్తా చాటింది. జర్మనీలోని సుల్‌ నగరంలో బుధవారం జరిగిన ఈ మెగా ఈవెంట్‌లోని మహిళల 10 మీటర్ల ఎయిర్‌ పిస్టల్‌ ఫైనల్స్‌లో 17 ఏళ్ల కనక్‌ 239 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. మాల్డోవాకు చెందిన అన్నా డుల్క్‌కు రజతం, తైపీ షూటర్‌ యెన్‌ చెంగ్‌కు కాంస్యం దక్కాయి.

నగాల్‌ పరాజయం

పారిస్‌: భారత టెన్నిస్‌ స్టార్‌ సుమిత్‌ నగాల్‌ ఫ్రెంచ్‌ ఓపెన్‌ సింగిల్స్‌ మెయిన్‌ డ్రాకు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్‌ రెండో రౌండ్‌లో సుమిత్‌ 2-6, 4-6తో జూరిజ్‌ రోడియోనోవ్‌ (ఆస్ట్రియా) చేతిలో చిత్తయ్యాడు. అంతకుముందు జరిగిన తొలి రౌండ్‌లో మిచెల్‌ క్రూగెర్‌ (అమెరికా)పై సుమిత్‌ గెలిచాడు.

ముంబై వచ్చేసింది

● ప్లేఆఫ్స్‌కు హార్దిక్‌ సేన
● విజృంభించిన సూర్యకుమార్‌
● అదరగొట్టిన శాంట్నర్‌, బుమ్రా
● ముగిసిన ఢిల్లీ కథ



శాంట్నర్‌ (3/11)



సూర్యకుమార్‌ (43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్‌)

ముంబై: సూర్యకుమార్‌ యాదవ్‌ (43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్‌) మెరుపులతోపాటు శాంట్నర్‌ (3/11) తిప్పేయడంతో.. ముంబై ఇండియన్స్‌ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన కీలక మ్యాచ్‌లో ముంబై 59 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తప్పనిసరిగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ నాకౌట్‌ రేసు నుంచి అవుటైంది. మరొక్క మ్యాచ్‌ మాత్రమే మిగిలివున్న ఢిల్లీ ఆ పోటీలో నెగ్గినా 15 పాయింట్లే అవుతాయి. ఇక ఐదుసార్లు టైటిల్‌ గెల్చుకున్న ముంబై ప్లే ఆఫ్స్‌ చేరడం ఇది 11వసారి. గుజరాత్‌, బెంగళూరు, పంజాబ్‌ జట్లు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌ బెర్తులను ఖరారుచేసుకున్న సంగతి తెలిసిందే.

తొలుత ముంబై 20 ఓవర్లలో 180/5 స్కోరు చేసింది. తిలక్‌ వర్మ (27), నమన్‌ ధిర్‌ (24 నాటౌట్‌), రికెల్టన్‌ (25) రాణించారు. ముకేశ్‌ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఢిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలింది. సమీర్‌ రిజ్వీ (39), విప్రజ్‌ (20) టాప్‌ స్కోరర్లు. బుమ్రా 3 వికెట్లు తీశాడు. అనారోగ్యంతో ఢిల్లీ కెప్టెన్‌ అక్షర్‌ మ్యాచ్‌కు దూరమవడంతో.. డుప్లెసి సారథిగా వ్యవహరించాడు. సూర్య 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌'గా నిలిచాడు.

బ్యాటర్లు విఫలం: ఛేదనలో ఢిల్లీ ఘోరంగా తడబడింది. ఓపెనర్లు డుప్లెసి (6), రాహుల్‌ (11) స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌ చేరారు. అభిషేక్‌ పోరెల్‌ (6)ను జాక్స్‌ అవుట్‌ చేయడంతో ఢిల్లీ 27/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో విప్రజ్‌, సమీర్‌ ఆదుకొనే ప్రయత్నం చేయడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ 49/3తో నిలిచింది. అయితే, 8వ ఓవర్‌లో విప్రజ్‌ను శాంట్నర్‌ రిటర్న్‌ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో.. నాలుగో వికెట్‌కు 28 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ధాటిగా ఆడగలిగే స్టబ్స్‌ (2)ను బుమ్రా ఎల్బీ చేయడంతో.. 10 ఓవర్లకే ఢిల్లీ సగం వికెట్లు చేజార్చుకొంది. రిజ్వీ, అశుతోష్‌ శర్మ (18) ఆరో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యంతో కొంతసేపు పోరాడారు. అయితే, 15వ ఓవర్‌లో వీరిద్దరినీ శాంట్నర్‌ అవుట్‌ చేయడంతో.. ఢిల్లీ ఓటమి ఖరారైంది. మాధవ్‌ తివారి (3), కుల్దీప్‌ (7), ముస్తాఫిజుర్‌ (0) సింగిల్‌ డిజిట్‌కే వెనుదిరిగారు.

ఆఖర్లో అదరగొట్టారు: మందకొడి పిచ్‌పై ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్‌ చేసినా.. డెత్‌ ఓవర్లలో సూర్యకుమార్‌, నమన్‌ ఆరో వికెట్‌కు అజేయంగా 21 బంతుల్లో 57 పరుగులు జోడించడంతో ముంబై సవాల్‌ విసరగలిగే స్కోరు చేసింది. టాస్‌ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి శుభారంభం దక్కలేదు. రోహిత్‌ శర్మ (5) విఫలమైనా.. మరో ఓపెనర్‌ రికెల్టన్‌, విల్‌ జాక్స్‌ (13 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 21) దూకుడుగా ఆడారు. దీంతో పవర్‌ప్లేను ముంబై 54/2తో ముగించింది. మూడు ఫోర్లు, సిక్స్‌తో జోరుమీదున్న జాక్స్‌ను ముకేశ్‌ వెనక్కిపంపడంతో.. రెండో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కుల్దీప్‌, విప్రజ్‌ పరుగులను కట్టడి చేయడంతో.. 7-15 ఓవర్ల మధ్య ముంబై 60 పరుగులే చేయగలిగింది. ఏడో ఓవర్‌లో రికెల్టన్‌ను కుల్దీప్‌ అవుట్‌ చేసి షాకిచ్చాడు. ఈ దశలో సూర్య, తిలక్‌ ఆచితూచి ఆడుతూ.. నాలుగో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, కీలక సమయంలో తిలక్‌ను ముకేశ్‌ వెనక్కిపంపగా.. కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యా (3)ను చమీర క్యాచవుట్‌ చేశాడు. కానీ, చివరి రెండు ఓవర్లలో సూర్య, నమన్‌ చెలరేగి 48 పరుగులు పిండుకోవడంతో.. ముంబై స్కోరు 180 పరుగుల మార్క్‌ను అందుకొంది. 19వ ఓవర్‌లో ముకేశ్‌ బౌలింగ్‌లో సూర్య సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. 4,6,6,4 బాదిన నమన్‌ ఏకంగా 27 పరుగులు రాబట్టాడు. చమీర వేసిన ఆఖరి ఓవర్‌లో సూర్య రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో ఫినిషింగ్‌ టచ్‌ ఇచ్చాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్‌	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్‌	12	8	3	1	17	0.389
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	0.019
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	12	5	7	0	10	-0.506
హైదరాబాద్‌	12	4	7	1	9	-1.005
రాజస్థాన్‌	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్‌ రన్‌రేట్‌

నేటి మ్యాచ్‌ — వేదిక: అహ్మదాబాద్‌
గుజరాత్‌ x లఖ్‌నవూ — రా.7.30 నుంచి

1 ఐపీఎల్‌ చరిత్రలో తొలి నాలుగు మ్యాచ్‌లు గెలిచినా.. ప్లేఆఫ్స్‌కు దూరమైన మొదటి జట్టుగా ఢిల్లీ

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్‌ (సి) తివారి (బి) కుల్దీప్‌ 25, రోహిత్‌ (సి) పోరెల్‌ (బి) ముస్తాఫిజుర్‌ 5, విల్‌ జాక్స్‌ (సి) విప్రజ్‌ (బి) ముకేశ్‌ 21, సూర్యకుమార్‌ (నాటౌట్‌) 73, తిలక్‌ (సి) రిజ్వీ (బి) ముకేశ్‌ 27, హార్దిక్‌ (సి) ముకేశ్‌ (బి) చమీర 3, నమన్‌ ధిర్‌ (నాటౌట్‌) 24, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 180/5; వికెట్ల పతనం:** 1-23, 2-48, 3-58, 4-113, 5-123; **బౌలింగ్‌:** ముకేశ్‌ 4-0-48-2, చమీర 4-0-54-1, ముస్తాఫిజుర్‌ 4-0-30-1, విప్రజ్‌ నిగమ్‌ 4-0-25-0, కుల్దీప్‌ 4-0-22-1.

ఢిల్లీ: రాహుల్‌ (సి) రికెల్టన్‌ (బి) బౌల్ట్‌ 11, డుప్లెసి (సి) శాంట్నర్‌ (బి) చాహర్‌ 6, పోరెల్‌ (స్టంప్డ్‌) రికెల్టన్‌ (బి) జాక్స్‌ 6, రిజ్వీ (బి) శాంట్నర్‌ 39, విప్రజ్‌ (సి అండ్‌ బి) శాంట్నర్‌ 20, స్టబ్స్‌ (ఎల్బీ) బుమ్రా 2, అశుతోష్‌ (స్టంప్డ్‌) రికెల్టన్‌ (బి) శాంట్నర్‌ 18, మాధవ్‌ తివారి (బి) బుమ్రా 3, చమీర (నాటౌట్‌) 8, కుల్దీప్‌ (సి/సబ్‌) బవ (బి) కర్ణ్‌ శర్మ 7, ముస్తాఫిజుర్‌ (బి) బుమ్రా 0, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 18.2 ఓవర్లలో 121 ఆలౌట్‌; వికెట్ల పతనం:** 1-12, 2-20, 3-27, 4-55, 5-65, 6-103, 7-104, 8-108, 9-120, 10-121; **బౌలింగ్‌:** బౌల్ట్‌ 4-0-29-1, దీపక్‌ చాహర్‌ 3-0-22-1, విల్‌ జాక్స్‌ 1-0-16-1, శాంట్నర్‌ 4-0-11-3, బుమ్రా 3.2-0-12-3, కర్ణ్‌ శర్మ 3-0-31-1.

'ఎక్స్‌ట్రా టైమ్‌' ఇప్పుడా ?

తమకు అన్యాయం జరిగిందన్న నైట్‌రైడర్స్‌

న్యూఢిల్లీ: ఈ సీజన్‌ మధ్యలో ఐపీఎల్‌ మ్యాచ్‌లకు ఎక్స్‌ట్రా టైమ్‌ (అదనపు సమయం)ను కేటాయించడాన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్‌ యాజమాన్యం తప్పుపట్టింది. ఈ అంశంలో తమకు అన్యాయం జరిగిందని ఆ జట్టు సీఈవో వెంకీ మైసూర్‌.. ఐపీఎల్‌ సీఓఓ హేమంగ్‌ అమిన్‌ను ఈ-మెయిల్‌ ద్వారా ప్రశ్నించాడు. ప్లేఆఫ్స్‌ నేపథ్యంలో వర్షం కారణంగా కీలకమైన మ్యాచ్‌లు రద్దు కాకూడదన్న ఉద్దేశంతో ఈసారి లీగ్‌లో మిగతా మ్యాచ్‌లకు అదనంగా గంట సమయాన్ని కేటాయించారు. అయితే, ఈ కొత్త నిబంధనను ఐపీఎల్‌ పునరుద్ధరణ జరిగిన మూడ్రోజుల తర్వాత అంటే.. ఈనెల 20 నుంచి జరిగే మ్యాచ్‌ల నుంచి వర్తిస్తుందని ప్రకటించారు. దీనిపైనే వెంకీ మైసూర్‌ మండిపడ్డాడు. 'ఐపీఎల్‌ పునరుద్ధరణతోనే అదనపు గంట సమయం ప్రస్తావన ఎందుకు తీసుకురాలేదు? లీగ్‌ మళ్లీ మొదలయ్యాక తొలి మ్యాచ్‌లో భాగంగా ఈనెల 17న బెంగళూరులో ఆర్సీబీతో నైట్‌రైడర్స్‌ పోరు వర్షంతో రద్దయింది. దీంతో మా జట్టు ప్లేఆఫ్స్‌ రేసు నుంచి నిష్క్రమించింది. మ్యాచ్‌కు రెండ్రోజుల ముందే బెంగళూరులో భారీ వర్షం పడింది. మా మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు ఉందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా.. బీసీసీఐ, ఐపీఎల్‌ సీఓఓ అప్పుడు మౌనంగా ఉన్నారు. మ్యాచ్‌లకు అదనంగా గంట సమయం ఉంటుందని ఆరోజే ప్రకటించి ఉంటే.. మా మ్యాచ్‌ కనీసం ఐదు ఓవర్లపాటైనా జరిగి ఉండేది. అప్పుడు మా జట్టు ప్లేఆఫ్స్‌ అవకాశాలకు చాన్స్‌ ఉండేదేమో! ఇప్పుడేమో ఈనెల 20 నుంచి మ్యాచ్‌లకు ఎక్స్‌ట్రా టైమ్‌ వర్తిస్తుందని చెబుతున్నారు. ఈ విషయంలో మాకు అన్యాయం జరిగినట్టే కదా!' అని ఈ-మెయిల్‌లో వెంకీ మండిపడ్డాడు. కోల్‌కతానే కాదు మరికొన్ని జట్లు కూడా.. సీజన్‌ మధ్యలో నిబంధనల మార్పును తప్పుపడుతున్నాయి.

కాళేశ్వరాన్ని విఫల ప్రయోగంగా చిత్రీకరించే యత్నం

» కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులు దూది మూటలు: కేటీఆర్

నల్లగొండ, మే 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): "కాళేశ్వరాన్ని విఫల ప్రయోగంగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగానే ఆ రెండు పార్టీలు కలిసి వండుతున్న వంటకమే ఇది. మాజీ సీఎం కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులు దూది మూటల్లాంటివి. ఎన్ని నోటీసులిచ్చినా, ఎన్ని డ్రామాలాడినా అవన్నీ దూదిపింజల్లా తేలిపోతాయి. ఈ దేశంలో చట్టాలపై మాకు విశ్వాసముంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం నల్లగొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్ని చిల్లర ప్రయత్నాలు చేసినా న్యాయం, ధర్మం గెలుస్తాయని, తెలంగాణకు మేలు చేసిన వారిని దేవుడు కాపాడతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతికానితనం, కమీషన్ల కక్కుర్తి వల్లే ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోయిందని మండిపడ్డారు. మూడు నెలలైనా అందులోంచి మృతదేహాలు తీసే దమ్ము ప్రభుత్వానికి లేకపోయిందని, పనుల విషయంలో ఏం జరిగిందో చెప్పే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయిందని, ఆ ఘటనపై విచారణ చేపట్టలేదని, కమిషన్ వేయలేదని, నిర్మాణసంస్థ మీద ఏ చర్యలు తీసుకోలేదని అన్నారు. వట్టెం పంపుహౌస్ మునిగిందని, పెద్దవాగు ప్రాజెక్టు రెండు సార్లు కొట్టుకుపోయిందని, వాటిపైనా ఎలాంటి చర్యలు లేవని ధ్వజమెత్తారు. కాళేశ్వరాన్ని మాత్రం విఫల ప్రయోగంగా చూపించే ప్రయత్నంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని అభిప్రాయపడ్డారు. హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

సనత్‌నగర్ టిమ్స్‌కు ఆరోగ్య కార్యదర్శి

» అధికారులతో కలిసి ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆయా శాఖల ఉన్నత అధికారులంతా ఆస్పత్రుల నిర్మాణ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. దీంతో బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు నేతృత్వంలో అధికారుల బృందం సనత్ నగర్ టిమ్స్‌ను సందర్శించింది. ఆస్పత్రి నిర్మాణ పనులను అధికారులు పరిశీలించి అక్కడే నిర్వహించిన సమీక్షలో వివిధ శాఖల మధ్య సమన్వయంతో మిగిలిన పనుల వేగవంతం చేయడానికి అవసరమైన నిర్మాణాత్మక కార్యాచరణ రూపొందించారు. ఆస్పత్రిలో క్లినికల్, మౌలిక వసతుల కల్పన ఎలా ఉండాలన్న అంశంపై నిమ్స్‌తోపాటు ఏఐజీ, యశోద, కిమ్స్‌లకు చెందిన సీనియర్ వైద్యుల బృందం అధికారులకు సూచనలు అందించింది. టిమ్స్‌ను సందర్శించిన వారిలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, డీఎంఈ నరేంద్ర కుమార్, టిమ్స్ నోడల్ అధికారులున్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 892 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. మొత్తం 4,13,597 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం జనరల్ 2,49,204, ప్రథమ సంవత్సరం ఒకేషనల్ 17,003, ద్వితీయ సంవత్సరం జనరల్ 1,34,988, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ 12,402 మంది ఉన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందు చేరుకోవాలని ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి జయప్రదా బాయి కోరారు.

డిస్కమ్ యూనిట్‌గా ఏఈ, జేఏవోల నియామకం

» దక్షిణ డిస్కమ్ ఉత్తర్వులు

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి దక్షిణ టీజీఎస్పీడీసీఎల్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై భర్తీ చేయబోయే ఏఈల, జేఏవో, జేపీవో, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు డిస్కమ్‌ను యూనిట్‌గా తీసుకోనున్నారు. సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్, జూనియర్ లైన్‌మెన్, వాచ్‌మెన్ నియామకంలో ఆపరేషన్ సర్కిల్/జిల్లాను యూనిట్‌గా తీసుకుంటారు. ఇక, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి దాకా ఒకేచోట చదివిన వారినే స్థానిక అభ్యర్థులుగా పరిగణనలోకి తీసుకోనున్నారు. రెండు లేదా అంతకు మించిన డిస్కమ్‌ల పరిధిలోని జిల్లాల్లో ఒకటి నుంచి ఏడో తరగతి దాకా చదివిన వారిని డిస్కమ్ అభ్యర్థిగా పరిగణనలోకి తీసుకుంటారు.

మారణహోమాన్ని ఆపాలి

మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి

» శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్

» చర్చలతో సమస్యకు పరిష్కారం: డి.రాజా, కూనంనేని

» అది ఎన్‌కౌంటర్ కాదు.. హత్యాకాండ: హరగోపాల్

» సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి: న్యూ డెమోక్రసీ

» హత్యాకాండ.. ఫాసిస్టు చర్య: పోటు రంగారావు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి కాల్పుల విరమణ పాటించాలని, మధ్యభారతంలో మారణహోమాన్ని ఆపాలని శాంతి చర్చల కమిటీ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండలో బుధవారం నిర్వహించిన ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, అస్సాం, మణిపూర్ ఉద్యమకారులతో చర్చలు జరిపి ఒప్పందాలు చేసుకున్న కేంద్రం.. మావోయిస్టులతో చర్చలు జరిపితే సమస్య ఏంటని ప్రశ్నించారు. కాల్పుల విరమణ, శాంతిచర్చల కోసం కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించినా.. వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా, అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌ను శాంతి చర్చల సమన్వయ కమిటీ ఒక ప్రకటనలో ఖండించింది. కేంద్రం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతిచర్చలను ప్రారంభించాలని కోరింది. కర్రెగుట్టలు, అబూజ్‌మడ్‌లో జరిగింది ఎన్‌కౌంటర్లు కాదని, హత్యాకాండ అని ప్రొఫెసర్ జి.హరగోపాల్ వ్యాఖ్యానించారు. మావోయిస్టుల మృతదేహాలను మార్చురీలో భద్రపర్చాలని, గుర్తు పట్టిన శవాలను వారి బంధువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ పదే పదే కోరుతున్నా.. పట్టించుకోకుండా ఎన్‌కౌంటర్లకు పాల్పడడం హేయమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ, ఏపీ కార్యదర్శులు పి.సూర్యం, దివాకర్ ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి, బలగాలను వెనక్కి రప్పించాలని, ఈ హత్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నంబాల ఎన్‌కౌంటర్‌పై పౌర హక్కుల సంఘం నేతలు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు విచారం వ్యక్తం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడిన బలగాలను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మెచ్చుకోవడం శోచనీయమన్నారు. దేశ పౌరులమీదే యుద్ధం చేస్తూ, చంపడం అన్యాయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు నిరసన వ్యక్తం చేశారు. శాంతి చర్చలకు సిద్ధమన్న మావోయిస్టు పార్టీ ప్రతిపాదనను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాన్ని అమలుచేస్తోందని విమర్శించారు. అంబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఖండించారు. చర్చలతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వామపక్ష భావజాలాన్ని అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ చేపట్టిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్లు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం బాధాకరమన్నారు. నంబాల కేశవరావుతోపాటు మరికొంత మందిని కేంద్ర బలగాలు కాల్చి చంపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. అనేక పర్యాయాలు చర్చల కోసం మావోయిస్టులు విజ్ఞప్తి చేసినా కేంద్రం మూర్ఖంగా ఎన్‌కౌంటర్లకు పాల్పడుతోందని మండిపడ్డారు.



ఆసియా పసిఫిక్ ప్రాంతీయ వర్క్‌షాపులో పలు దేశాల ఎంపీలతో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్

వ్యవస్థలో మార్పే అసలైన పరీక్ష

» ఫిజీలో ఆసియా- పసిఫిక్ పీఏసీల వర్క్‌షాప్‌లో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ)ల లక్ష్యం తప్పులను ఎత్తి చూపడమే కాదని.. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే వాటికి అసలైన పరీక్ష అని బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్, ఫిజీ రిపబ్లిక్ పార్లమెంట్ సంయుక్తంగా నిర్వహించిన ఆసియా పసిఫిక్ ప్రాంతీయ వర్క్‌షాప్‌లో భారత్ నుంచి డాక్టర్ కె. లక్ష్మణ్ పాల్గొన్నారు. మొత్తం 11 దేశాల ఎంపీలు హాజరైన ఈ సదస్సులో.. ప్రజాపద్దు సంఘాల పనితీరు, ప్రభావం, వాటి సమగ్రతను మెరుగు పరచడం అనే అంశాలపై బుధవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. పార్లమెంటరీ వ్యవస్థలో పీఏసీల పాత్ర చాలా కీలకమని చెప్పారు. ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసిన తీరుపై సమగ్రంగా పరిశీలన చేయడం చట్టసభల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. దీంట్లో పీఏసీలదే ముఖ్య పాత్ర అని తెలిపారు. పీఏసీ సభ్యులు తమ అధ్యయనాల సందర్భంగా నేరుగా క్షేత్రస్థాయికి వెళతారని, అక్కడ పథకాల అమలు కూడా పరిశీలిస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ సమయంలో ప్రజల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి అధికారుల నుంచి వాస్తవిక సమాచారం కూడా తీసుకుంటారన్నారు. పీఏసీల సిఫార్సులు తాత్కాలికమే అయినా.. వాటి అమలు కోసం చేపట్టిన చర్యల నివేదికల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు.

సుమోటోగా పరిశీలన..

ఇటీవల కాలంలో పీఏసీలు ఆడిట్‌లో లేని అంశాలపై స్వయంగా(సుమోటో) ఎంచుకుని పరిశీలిస్తున్నాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. అందులో బ్యాంకింగ్, బీమా రంగ సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాల సమీక్ష, ప్రజా మౌలిక వసతులపై వసూలు చేసే రుసుములు, టారిఫ్‌లు, చార్జీల వంటివి ముఖ్యమైనవని ఆయన వివరించారు.

ట్రంప్ ఒత్తిడికి లొంగిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. భారతదేశంపై పెత్తనం చెలాయించాలని 1971లో పాకిస్థాన్ యుద్ధం చేస్తే.. ఆ దేశాన్నే చీల్చి.. ఆ దేశ ప్రభుత్వ పెద్దలకు గుణపాఠం చెప్పిన ఘనత ఉక్కు మహిళ ఇందిరా గాంధీది అని కొనియాడారు. ఉగ్రవాదం ముసుగులో దేశ పౌరులపై దాడులను నిర్మూలించడంలో ఇందిరా గాంధీయే మనకు ఆదర్శమన్నారు. పహల్గాం ఘటన తర్వాత మోదీ సర్కారుకు ఖర్గే, రాహుల్‌సహా కాంగ్రెస్ శ్రేణులూ అండగా నిలబడ్డాయని తెలిపారు. అయినా దానిని సద్వినియోగం చేసుకోకుండా దురదృష్టవశాత్తూ కేంద్రం వెనుకడుగు వేసిందన్నారు.



రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయంలో నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, జగ్గారెడ్డి, మహేశ్‌గౌడ్, వీహెచ్

పాక్‌ను ఓడిస్తే ప్రపంచం అభినందించేది..

పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఆపకుంటే ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తానని తాను బెదిరిస్తే.. భారత ప్రభుత్వం తన ఒత్తిడికి లొంగిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించే పరిస్థితి వచ్చిందని రేవంత్ అన్నారు. ఈ దేశంలో నడుస్తున్న ప్రభుత్వం ట్రంప్ ఒత్తిళ్లకు లొంగి పోయిందని ప్రజలు కూడా భావించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. యుద్ధంలో పాక్‌ను ఓడిస్తే ప్రపంచం కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించి ఉండేదని పేర్కొన్నారు. గొప్పల కోసం బీజేపీ శ్రేణులను ఆ పార్టీ నాయకత్వం వీధుల్లో తిప్పుతుందంటేనే నైతికంగా ప్రజలకు వారు జవాబు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని అర్థమవుతోందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తమ ప్రభుత్వం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే యుద్ధ వాతావరణ సమయంలో ప్రభుత్వానికి అండగా నిలబడ్డ రాహుల్‌గాంధీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. యుద్ధ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా మొదట తిరంగా ర్యాలీ చేసింది తెలంగాణ ప్రభుత్వమని గుర్తు చేశారు. ఆనాడు తమను అభినందించడానికి కిషన్‌రెడ్డికి నోరు రాలేదని విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఆ ప్రభుత్వానికి అండగా నిలబడాల్సిన సమయంలో కిషన్‌రెడ్డి దుప్పటి కప్పుకొని పడుకున్నారని ఎద్దేవా చేశారు. దేశ రక్షణ, సమగ్రత విషయంలో తాము రాజకీయాలు చేయబోమని, భారత ప్రభుత్వానికి, జవాన్లకు అండగా నిలబడతామని రేవంత్ స్పష్టం చేశారు. సచివాలయం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సంకుచిత మనస్తత్వం కలిగిన కొందరు విమర్శలు చేశారని తప్పుబట్టారు. ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహానాయకుడు రాజీవ్‌గాంధీ అని, ఆర్థిక, సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలబెట్టారని కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో భాగస్వామ్యం కల్పించారన్నారు.

దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్: భట్టి

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. వారిలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీలు వి.హన్మంతరావు, మధుయాష్కీగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు, దేశంలో కంప్యూటర్ విప్లవాన్ని తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్‌గాంధీ అని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కొనియాడారు. క్లిష్ట సమయంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మాజీమంత్రి లక్ష్మీనారాయణ కోడలు కంజర్ల విజయలక్ష్మి గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతో పాటు ఆమె భర్త చంద్రకాంత్ యాదవ్, సనత్‌నగర్‌కు చెందిన పలువురు నాయకులు పార్టీ కండువా కప్పుకున్నారు.

బీఆర్ఎస్ వల్లే కృష్ణా జలాల్లో అన్యాయం

» ఏపీకి 514టీఎంసీ వాటాను వదిలేస్తూ ఒప్పందం చేసుకున్నారు: మంత్రి ఉత్తమ్



మేళ్లచెర్వు/కోదాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో కృష్ణా నదీ జలాల పంపకంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో కృష్ణా నదిపై నిర్మించే ఎత్తిపోతల పథకాలపై జిల్లా అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 813 టీఎంసీల వాటా ఉండగా, రాష్ట్రం విడిపోయాక బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు 299టీఎంసీలు చాలంటూ, ఏపీకి 514 టీఎంసీల వాటాను వదిలేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వంలో లిఖితపూర్వక ఒప్పందం చేసుకుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ కేటాయింపులను రద్దు చేసిందని చెప్పారు. విస్తీర్ణం, జనాభా ప్రాతిపదికన తెలంగాణకు కృష్ణా జలాల్లో 70% వాటాను కేటాయించాలని కృష్ణా ట్రిబ్యునల్ బోర్డు ఎదుట తెలంగాణ తరఫున వాదనలను తానే స్వయంగా వినిపించినట్లు ఉత్తమ్ గుర్తు చేశారు. ఇక, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు మొదలుపెట్టగా, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దానిని రద్దు చేసి కాళేశ్వరం పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టు... ఆ పార్టీ పాలనలోనే కూలిపోయిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంతో రూ.62వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని, ఈ నిధులతో కృష్ణానదిపై బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్‌బీసీ, గోదావరి నదిపై దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు పూర్తయ్యేవని చెప్పారు.

'భూదాన్ కేసు'ను కొట్టేయలేం..

» పిటిషనర్లకు ఏ ఉపశమనం కల్పించలేమన్న హైకోర్టు ధర్మాసనం

» వివరణ ఇవ్వాలంటూ ఈడీకి నోటీసులు.. జూన్‌కు విచారణ వాయిదా

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): నాగారం భూదాన్ భూకుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పెట్టిన కేసులో పిటిషనర్లకు అనుకూలంగా ఎలాంటి ఉపశమనం కల్పించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇది తీవ్ర అభియోగాలున్న భూకుంభకోణానికి సంబంధించిన నేరంగా గుర్తించినట్లు వెల్లడించింది. తమపై ఈడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కీలక నిందితులుగా ఉన్న మునావర్‌ఖాన్, ఖాదర్ ఉన్నిసా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నర్సింగ్‌రావు ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. తీవ్ర అభియోగాలతోపాటు పెద్ద ఎత్తున భూఆక్రమణ, రూ.వంద కోట్లు మేర ఆర్థిక అక్రమాలు ఇమిడి ఉన్నందున కేసులో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఈడీకి ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రజాప్రయోజనం ఇమిడి ఉండటంతోపాటు తీవ్ర ఆరోపణలున్న నేపథ్యంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు వివరణ ఇవ్వాలని ఈడీకి నోటీసులు జారీ చేస్తూ విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

'మూడు నెలల రేషన్'కు గడువు కోరిన రాష్ట్రం

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలానికి ముందే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం నిల్వలను పెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఇప్పటికిప్పుడు సమకూర్చలేమని, మరో నెల రోజుల గడువు కావాలని కేంద్రానికి లేఖ రాసింది. అంటే మే నెలాఖరుకు కాకుండా, జూన్ ఆఖరుకు సమకూరుస్తామని లేఖలో పేర్కొంది. జూన్ నుంచి వానాకాలం మొదలవుతుందని, వరదలు, వాగులు, వంకలు పొంగటం వంటి సమస్యలు ఎదురైతే... పేద ప్రజలకు ఆహారధాన్యాలు చేరవేయడం ఇబ్బందిగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. జూన్, జూలై, ఆగస్టు నెలల బియ్యం కోటాను జూన్‌లోనే అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారం రాష్ట్రం సుమారు 5లక్షల టన్నుల బియ్యం సమకూర్చాల్సి ఉంటుంది. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో ఇప్పటికిప్పుడు మూడు నెలల కోటాను సర్దుబాటు చేయటం కష్టమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రానికి రాసిన లేఖలో రాష్ట్రంలోని పరిస్థితులను వివరించి, జూన్ ఆఖరు వరకు గడువు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు జూన్‌లో ఒక నెల కోటా, జూలైలో రెండు నెలల కోటాను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఆర్థిక వృద్ధికి మేధోమథనం!

త్వరలో 'తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు'.. మేధావులు, నిపుణులు, ప్రముఖులతో ఏర్పాటు

» 24న నీతి ఆయోగ్ సమావేశంలో విజన్ బోర్డును ప్రస్తావించనున్న సీఎం

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వృద్ధిని, ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించేందుకు, వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకుగాను ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చుతూ, ఆయా అంశాలపై మేధోమథనం చేసేందుకు 'తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగేలా, దేశ జీడీపీలో ప్రస్తుతం ఉన్న రాష్ట్ర వాటాను మరింత పెంచేలా ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకోసం 'తెలంగాణ రైజింగ్-2050' పేరుతో ఒక లక్ష్యాన్ని పెట్టుకుంది. తాజాగా దీనికి అనుసంధానంగా 'తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు'ను ఏర్పాటు చేయనుంది. ఈ బోర్డు ఏర్పాటుకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు కూడా పూర్తయినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వివిధ రంగాలకు చెందిన మేధావులు, నిపుణులు, ప్రముఖులను బోర్డులో నియమించాలని నిర్ణయించినట్లు, వారు ఎవరనే దానిపైనా ఇప్పటికే స్పష్టతకు వచ్చినట్లు సమాచారం. బోర్డు ఏర్పాటు, సభ్యుల నియామకం, వారు నిర్వర్తించాల్సిన విధులకు సంబంధించిన అంశాలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ నెల 24న ఢిల్లీలోని భారత మండపంలో 'వికసిత్ భారత్ 2047- రోల్ ఆఫ్ టీమ్ ఇండియా' అనే అంశంపై నీతి ఆయోగ్ నిర్వహించే సమావేశంలో 'తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు' గురించి సీఎం రేవంత్ ప్రస్తావించనున్నట్టు తెలిసింది. అంతేకాకుండా రాష్ట్ర ఆర్థిక వృద్ధికి చేపడుతున్న నూతన విధానాలు, దేశ ఆర్థిక వ్యవస్థకు అందించే సహకారం గురించీ సీఎం వెల్లడించనున్నారు. అయితే ఆ సమావేశానికి ముందే బోర్డు ఏర్పాటుకు సంబంధించిన అంశాలను సీఎం స్వయంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

అభివృద్ధే లక్ష్యంగా

భవిష్యత్తు అంశాలే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు పనిచేస్తుందని స్పష్టమవుతోంది. 2023 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి పలు దేశాల నుంచి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. సుమారు లక్ష ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడింది. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంటోంది. అయితే పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకోవడమే కాకుండా.. పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవడం, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి రూపొందించాల్సిన ప్రత్యేక ప్రణాళికలు ఈ బోర్డులో జరుగుతాయని సమాచారం. ఇప్పటికే ఐటీ, ఔషధ రంగం, పట్టణీకరణలో రాష్ట్రం ముందంజలో ఉంది. మరికొన్ని రంగాల్లోనూ అభివృద్ధి కోసం ఏం చేయాలి? రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత వృద్ధిలోకి తీసుకొచ్చేదెలా? అనే అంశాలపై బోర్డులో మేధోమథనం చేస్తారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తారు. భవిష్యత్తులో మరిన్ని కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకురావడంతోపాటు ఇక్కడ కంపెనీల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి తెలియజేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిసింది. ఇందుకోసం తెలంగాణలో ఉన్న శాంతిభద్రతల అంశం, సమతుల్య వాతావరణ పరిస్థితులు సహా ముఖ్యమైన అంశాలతో సవివర నివేదికలు తయారు చేస్తారు. కాగా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు, సంక్లిష్టతలను తగ్గించడం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, పౌష్టికాహారం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన అంశాలపై బోర్డు పనిచేయనుంది.

మేధావులు, ప్రముఖులతో సీఎం భేటీలు..

రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయాన్ని పెంచేందుకు ఉన్న మార్గాలు, ఆర్థిక క్రమశిక్షణ, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి వంటి అంశాలపై మేధావులు, ప్రముఖులతో సీఎం రేవంత్ తరచూ సమావేశమవుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్‌తోనూ రేవంత్ సమావేశమయ్యారు. తాజాగా ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీతోనూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఆయనతో మాట్లాడుతున్న సందర్భంగానే తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు గురించి సీఎం ప్రస్తావించారు. బోర్డులో భాగస్వామ్యం పంచుకోవాలని బెనర్జీని ఆహ్వానించగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. కాగా, బోర్డు చైర్మన్, సభ్యుల విషయంలోనూ స్పష్టత రావడంతోత్వరలోనే ప్రకటించనున్నట్టు సమాచారం.

'వక్ఫ్' చట్టాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే

» ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ రెహమానీ

నల్లగొండ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు ఉద్యమిస్తామని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ ఖలీద్ సైఫుల్లా రెహమానీ, ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ముస్లింల హక్కుల కాలరాసేందుకు జరుగుతున్న చర్యలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముస్లిం లా బోర్డు ఆధ్వర్యంలో నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో బుధవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సభలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తూ దేశాన్ని ముక్కలు చేసే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. భారతదేశంలో ముస్లిం, ఆదివాసీలు ఎక్కడా కనపించడం లేదన్నారు. బంగ్లాదేశ్ పేరుతో సుమారు 8 వేల మంది ముస్లిం పేదలను అరెస్టు చేశారని ఆరోపించారు. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో పెద్దసంఖ్యలో మదర్సాలు మూసివేశారన్నారు. ఉత్తరాఖండ్‌లో ఏకరీతి పౌరసత్వాన్ని అమలు చేశారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో నిరుపేద ముస్లింల గృహాలను బుల్డోజర్లతో కూల్చివేశారని చెప్పారు. రాజ్యాంగంలోని కొన్ని ఆర్టికల్స్‌ను ఉపయోగించుకుని ముస్లింల హక్కులను కాలరాసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా లా బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 25న జరిగే మానవహారం, జూన్ 1న ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఘాట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ప్రసంగించారు. అంతకుముందు లాబోర్డు ఆధ్వర్యంలో నల్లగొండలో ర్యాలీ నిర్వహించారు. కాగా, ఈ బహిరంగ సభ నేపథ్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి సహా పలువురు స్థానిక బీజేపీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.



నల్లగొండ సభలో ప్రసంగిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

మావోయిస్టు చీఫ్ ఎన్‌కౌంటర్

కొత్త దళపతి ఎవరు?

వేణుగోపాల్, రాజన్‌లలో ఒకరికి చాన్సు!

ప్రజాసంఘాల నేతల మనోగతం

మళ్లీ గణపతికే ఇవ్వొచ్చంటున్న ఇంకో వర్గం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు (బస్వరాజ్, బీఆర్) ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో తదుపరి సారథి ఎవరన్న ఆసక్తి సర్వత్రా ఏర్పడింది. కేంద్ర కమిటీలోని 17 మంది సభ్యుల్లో ఎవరు దళపతి కానున్నారు..? బెంగాల్‌కు చెందిన రాజనా..? లేక తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మల్లోజుల వేణుగోపాల్‌కు అవకాశం దక్కుతుందా అన్న చర్చ జరుగుతోంది. వేణుగోపాల్ ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. దండకారణ్యంలో కీలక బాధ్యతలు చూస్తున్నారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగానూ వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరిలోనే ఒకరికి అగ్ర పదవి లభించే అవకాశం ఉందని ప్రజాసంఘాల నేతలు చెబుతున్నారు. తిప్పిరి తిరుపతి, బాలకృష్ణ వంటి నేతలు కూడా కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. అయితే తాజా పరిస్థితుల్లో మాజీ దళపతి గణపతికే పార్టీ బాధ్యతలు కట్టబెట్టే అవకాశం ఉందని ఓ వర్గం నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రం బాధ్యతల్లో ఉన్నారు. 70 ఏళ్ల వయస్కుడైన ఆయనకు క్లిష్ట సమయంలో మరోసారి పార్టీ పగ్గాలు అప్పగిస్తారా అన్న చర్చ కూడా నడుస్తోంది. 2004లో సీపీఐ మావోయిస్టు పార్టీ ఏర్పాటుకు ముందు గణపతి పీపుల్స్‌వార్‌కు కేంద్ర కమిటీ కార్యదర్శిగా 15 ఏళ్లపాటు పనిచేశారు. పీపుల్స్‌వార్-ఎంసీసీ విలీనమై మావోయిస్టు పార్టీ ఆవిర్భవించిన తర్వాత 2004 నుంచి 2018 వరకు ఆయన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో బస్వరాజ్ మిలిటరీ కమిషన్ చీఫ్‌గా ఉన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో గణపతి బాధ్యతలు వదులుకోవడంతో 2018లో బస్వరాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జిగానూ ఆయనే ఉన్నట్లు తెలిసింది. ఇప్పుడు ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించడంతో రెండు పదవులు ఖాళీ అయినట్లయింది. అసలే ఆ పార్టీ తీవ్రమైన గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఎప్పుడు, ఎవరు పారామిలిటరీ డ్రోన్ కెమెరాలకు చిక్కుతారు.. ఎవరు, ఎప్పుడు ఎన్‌కౌంటర్లో మరణించారన్న వార్త వస్తుంది అన్న భయం పార్టీతోపాటు ప్రజాసంఘాల్లోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో అగ్ర పదవిని అనుభవజ్ఞుడైన గణపతికే తిరిగి కట్టబెడతారా.. లేక కొత్తగా మరొకరిని ఎంపిక చేస్తారా అన్నది త్వరలో తేలనుంది.

మావోయిస్టు 'ఉంగా' లొంగుబాటు

ఎటపాక, మే 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ (మావోయిస్టు) పార్టీ సభ్యుడు ముచ్చకీ ఉంగా అలియాస్ కిశోర్ ఎటపాక స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు వివరాలను రంపచోడవరం ఓఎస్డీ జగదీష్ అడహల్లీ వెల్లడించారు. 'ఉంగా స్వగ్రామం సుక్మా జిల్లా దంతేష్పురం గ్రామం. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మాడ్ డివిజన్ ఒకటో కంపెనీ, ఒకటో ప్లటూన్ సభ్యుడుగా వ్యవహరిస్తున్న ఉంగా 2020లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎదురు కాల్పులు, రోడ్లు తవ్విన ఘటనలో నిందితుడిగా పోలీసు రికార్డులో ఉన్నాడు' అని ఓఎస్డీ తెలిపారు.


ఆస్పత్రి నుంచి తీసుకెళ్లి చంపారు!

రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపణ

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ(మావోయిస్టు) పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు(బస్వరాజ్) ఎన్‌కౌంటర్ బూటకం అని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నేత బల్లా రవీంద్రనాథ్ ఆరోపించారు. తీవ్ర అనారోగ్యంతో ఒడిశాలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నంబాలను పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆ తర్వాత ఎన్‌కౌంటర్ చేశారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై స్వతంత్ర న్యాయవిచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

పలువురు అగ్రనాయకులు, కేశవరావు అంగరక్షకులున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. మావోయిస్టు పార్టీ పత్రిక అవామ్-ఇ-జంగ్ చీఫ్ ఎడిటర్ సజ్జా వెంకట నాగేశ్వర్‌రావు కూడా మృతిచెందినట్లు ప్రచారం జరుగుతున్నా.. పోలీసులు నిర్ధారించలేదు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఓ డీఆర్‌జీ జవాను మృతిచెందగా.. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల కథనం ప్రకారం.. మూడంచెల భద్రత ఉండే మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు.. పార్టీ అగ్ర నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు, డీవీసీఎం నేతలు అబూజ్‌మఢ్ అడవుల్లో సమావేశమైనట్లు ఈ నెల 19న ఇంటెలిజెన్స్ వర్గాలు ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ఉప్పందించాయి. దాంతో అదే రోజు తెల్లవారుజామున నారాయణపూర్, బీజాపూర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన డీఆర్జీ బలగాలు, స్థానిక పోలీసులు కూంబింగ్ చేపట్టారు. "72 గంటల పాటు ఆపరేషన్ కొనసాగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. మావాళ్లు ఎదురు కాల్పులు జరిపారు. మూడు గంటలపాటు ఇరువైపులా కాల్పులు కొనసాగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయిన తర్వాత.. బలగాలు గాలింపును కొనసాగించాయి. 27 మంది మావోయిస్టుల మృతదేహాలు, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, కార్బైన్ తుపాకులు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం" అని నారాయణపూర్ పోలీసులు మీడియాకు తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ బీఆర్ దాదా అలియాస్ గంగన్నను గుర్తించామన్నారు. ఈయనకు మరో 10 పేర్లున్నట్లు తెలిపారు. మిగతా వారిలో కేశవరావు అంగరక్షకులు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ, పీఎల్‌జీఏ నేతలు, సభ్యులు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతులను ఇంకా గుర్తించాల్సి



కాలేజీ రోజుల్లో కేశవరావు(ఫైల్)

ఉందన్నారు. కేశవరావుపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు రూ.కోటిన్నర రివార్డు ప్రకటించగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో కూడా రివార్డులున్నట్లు వెల్లడించారు. కాగా.. మృతిచెందిన మిగతా మావోయిస్టుల వివరాలు గురువారానికి తెలిసే అవకాశాలున్నాయి.



ఏపీలోని శ్రీకాకుళం జిల్లా జీయన్నపేటలో కేశవరావు నివాసం


సిక్కోలులో పుట్టి.. అంచెలంచెలుగా అగ్రస్థానానికి

నంబాల కేశవరావు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జీయన్నపేట గ్రామం. వాసుదేవరావు, భారతమ్మ దంపతులకు 1954లో కేశవరావు జన్మించారు. వాసుదేవరావు ఉపాధ్యాయుడు కాగా.. భారతమ్మ గృహిణి. కేశవరావు పెద్దన్నయ్య ఢిల్లీశ్వర్‌రావు, తమ్ముడు రాంప్రసాద్ విశాఖలో ఉంటున్నారు. అక్క ఉష విజయవాడలో, చెల్లెలు జలజాక్షి శేఖరాపురంలో, మరో సోదరి సత్యవతి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. చిన్నప్పటి నుంచి కబడ్డీ ఆటగాడిగా పేరున్న కేశవరావు నౌపడా హైస్కూల్‌లో 8-10 తరగతులు చదివారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేశారు. వరంగల్ ఆర్ఈసీలో బీటెక్ పూర్తిచేశారు. అప్పటికే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ)లో క్రియాశీలంగా ఉన్న కేశవరావు.. ఎంటెక్ చదువుతున్న సమయంలో(1975) మెస్‌లో జరిగిన ఓ గొడవ(ఒకరు మృతిచెందారు)కుతోడు.. జాతీయ ఎమర్జెన్సీ కారణంగా అజ్ఞాతంలోకి వెళ్లారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరారు. జీయన్నపేటలో తన మిరప పొలం పనులు చూసుకుంటుండగా.. తనకోసం పోలీసులు రావడంతో కొండల్లోకి పారిపోయారు. పోలీసులు అతణ్ని చింతపల్లి అడవుల్లో అరెస్టు చేసి, విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. బెయిల్‌పై బయటకు వచ్చాక.. పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి 45 ఏళ్లుగా ఇంటిముఖం చూడకుండా, పీపుల్స్‌వార్.. ఆ తర్వాత మావోయిస్టు పార్టీల్లో కీలక భూమిక పోషించారు.

మిలటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తుడు

కేశవరావు తొలుత గంగన్న అనే పేరుతో సీపీఐఎంఎల్ తూర్పుగోదావరి జిల్లా సభ్యుడిగా పనిచేశారు. రాష్ట్రకమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాక బసవరాజుగా పేర్గాంచారు. క్రమంగా అగ్రనాయకుడిగా మారారు. ఈయన 1987లో బస్తర్ అడవుల్లో శ్రీలంకకు చెందిన ఎల్‌టీటీఈ విలిటెంట్ల వద్ద ప్రత్యేక శిక్షణ పొందినట్లు సమాచారం. 1992లో సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2000-04 మధ్య కాలంలో పీపుల్స్ వార్ కేంద్ర మిలటరీ కమిషన్(సీఎంసీ) కార్యదర్శిగా కొనసాగారు. 2004లో పీపుల్స్‌వార్, సీపీఐ(ఎంఎల్) తదితర గ్రూపులు సీపీఐ(మావోయిస్టు) పార్టీగా రూపాంతరం చెందాయి. అప్పటి నుంచి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి మావోయిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన హయాంలో కేశవరావు మిలటరీ ఆపరేషన్లలో కీలక పాత్ర పోషిస్తూనే.. 2018 వరకు కేంద్ర మిలటరీ కమిషన్ చీఫ్‌గా పనిచేశారు. వివిధ రాష్ట్రాల్లో సాయుధ పోరాటాన్ని ఉధృతం చేశారు. 16 రాష్ట్రాల్లో రెడ్ కారిడార్‌ను నడిపారు. బలగాలపై మెరుపు దాడులు చేసేవారు. మిలటరీ ఆపరేషన్లలో నంబాల చెప్పిందే వేదంగా పార్టీలో కొనసాగుతుందని సమాచారం. 2018 నవంబరు 10న గణపతి అనారోగ్య కారణాలతో రాజీనామా చేయగా.. కేశవరావు ప్రధాన కార్యదర్శి బాధ్యతలను స్వీకరించారు. పీఎల్‌జీఏ దళాలకు సైతం నంబాల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు.. హిడ్మా వంటి వాళ్లు ఇతని శిష్యులేనని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు.

అలిపిరి సహా.. 27 దాడుల్లో కీలక పాత్ర



నక్సల్ ఉద్యమాన్ని, మావోయిస్టు పార్టీగా మార్చిన తర్వాత.. నంబాల 27 ముఖ్య దాడులు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు

2003 అక్టోబరు 1న చంద్రబాబు నాయుడుపై అలిపిరి వద్ద 17 క్లైమోర్ మైన్స్‌తో జరిగిన దాడిలో ఈయనే ప్రధాన సూత్రధారి.

ఒడిసాలోని కోరాపూట్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆయుధాగారంపై దాడి చేసి, ట్రక్కుల నిండా తుపాకులను దోచుకుపోయిన ఘటన వెనక ఈయనే ప్రధాన నిందితుడు..

2010లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం కేశవరావుదే. కూంబింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు రాగానే.. మావోయిస్టులు కాపుకాచి, కాల్పులు జరిపేలా వ్యూహరచన చేశారు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. తాడిమెట్లలో 76 మంది జవాన్ల మృతి

2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతో పాటు మరో 27 మంది మరణించారు

2018 సెప్టెంబరు 23న అరకులో తెలుగుదేశం పార్టీ నాయకుడు కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్యకేసులో నంబాల ప్రధాన నిందితుడు

2021లో బీజాపూర్‌లోని తెర్రం(హిడ్మా స్వస్థలం) అడవుల్లో 22 మంది జవాన్లు, 2020లో సుకుమాలో 17 మంది జవాన్లను హతమార్చిన ఘటనలకు నంబాల సూత్రధారి

2019లో దంతేవాడలో బీజేపీ ఎమ్మెల్యే భీమా మండవి, నలుగురు గన్‌మన్ల హత్యలో ఇతనే ప్రధాన నిందితుడు




నాగేశ్వర్‌రావు(ఫైల్)

నాగేశ్వర్‌రావు మృతిపై ప్రచారం

అబూజ్‌మఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పత్రిక అవామ్-ఇ-జంగ్ చీఫ్ ఎడిటర్ సజ్జా వెంటక నాగేశ్వర్‌రావు(61) కూడా మృతిచెందినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి గ్రామం. ఆయన గుంటూరులో డిప్లొమా పూర్తిచేసి, 30 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. యూజీ, డీసీఎస్‌గా పనిచేసి, అవామ్-ఇ-జంగ్ ఎడిటోరియల్ బోర్డులో సేవలందించారు. చీఫ్ ఎడిటర్ స్థాయికి ఎదిగారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు నాగేశ్వర్‌రావు మృతిని నిర్ధారించలేదు. అయితే.. బాపట్ల జిల్లా పోలీసులు మాత్రం తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని, ఈ నేపథ్యంలో నాగేశ్వర్‌రావు వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఇతనిపై వేటపాలెం ఠాణాలో ఓ కేసు ఉన్నట్లు సమాచారం.

నక్సలిజం నిర్మూలనలో మైలురాయి: అమిత్‌షా



మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు మృతిచెందడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్‌లో స్పందిస్తూ.. నక్సలిజం నిర్మూలనలో ఇదో మైలురాయి విజయంగా అభివర్ణించారు. "2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కారు దృఢ సంకల్పంతో ఉంది. కర్రెగుట్టల ఆపరేషన్ తర్వాత.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో 54 మంది నక్సల్స్ అరెస్టయ్యారు. 84 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

వెన్ను విరిగినట్టే!

దళపతిని కోల్పోయిన మావోయిస్టులు

కేంద్ర కమిటీ కార్యదర్శి స్థాయి నేత ఎన్‌కౌంటరులో హతమవ్వడం ఇదే తొలిసారి

కీలక దశకు చేరిన కగార్ ఆపరేషన్.. ఒక్క ఏడాదిలోనే 540 మంది ఎన్‌కౌంటర్

కేంద్రం అత్యాధునిక సాంకేతిక యుద్ధం .. వేలాది బలగాల గుప్పిట్లో దండకారణ్యం

(అమరావతి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భారత విప్లవోద్యమ చరిత్రలో తొలిసారి మావోయిస్టులు తమ దళపతిని ఎన్‌కౌంటర్‌లో కోల్పోయారు. కేంద్రం సాగిస్తున్న సాంకేతిక యుద్ధంతో ఏడాది కాలంగా విలవిల్లాడుతున్న మావోయిస్టులకు ఇది శరాఘాతమే.! వెన్ను విరిగినట్టే! మే నెల మావోయిస్టు పార్టీ ఉనికికి కీలకమైనది. మరో నాలుగు రోజుల్లో, అంటే ఈ నెల 25న నక్సల్బరీ ఆవిర్భావ దినోత్సవం రాబోతుంది. అలాంటి మే నెలలోనే నక్సల్స్‌కు ఊహించని దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన హోరాహోరీ ఎదురు కాల్పుల్లో బుధవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. ఈ సంఘటన మావోయిస్టుల ఏరివేత యుద్ధం చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలకు పెద్ద విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో ప్రకటించారు. బస్వరాజ్ మరణం మావోయిస్టు పార్టీకి ఎంత నష్టం అనేదానికి ఈ ప్రకటనే సాక్ష్యం. మావోయిస్టు పార్టీకి కేంద్ర కమిటీ అంటేనే నిర్దేశిత వ్యవస్థ. ఆ కమిటీకి ప్రధాన కార్యదర్శి అంటే గుండెకాయ. కేంద్ర బలగాలు ఆ గుండెకాయను మట్టుబెట్టాయి. కేంద్రం 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తానని ప్రకటించింది. ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. కానీ, గడువుకు చాలా ముందే, ఇంత త్వరగా కేంద్రం కమిటీ కార్యదర్శి, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ నేతలు అనేక మంది ఒకే ఎన్‌కౌంటర్‌లో హతమవ్వడం భద్రతాబలగాల ఆధిపత్యాన్ని నిరూపిస్తోంది.

హడలెత్తిస్తున్న హైటెక్ వార్...

2024లో ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు మరణించారు. టాప్ నాయకత్వం నుంచి జిల్లా కమిటీ సభ్యుని దాకా మరణించినవారిలో ఉన్నారు. యూపీఏ హయాంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా సగటున ఏడాదికి 80 మంది మావోయిస్టులు మరణించేవారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ అందుకు భిన్నంగా సాగుతోంది. ఒక విధంగా అత్యాధునిక సాంకేతిక యుద్ధం సాగుతోంది. వేలాది పారామిలటరీ బలగాలు, రాష్ట్ర ప్రత్యేక బలగాలు ఈ యుద్ధంలో పాల్గొంటున్నాయి, అడవులను జల్లెడ పట్టేందుకు హైటెక్ విధానాలను అనుసరిస్తున్నారు. మానవ రహిత డ్రోన్లను వాడి విజయాలు సాధిస్తున్నారు. దండకారణ్యంలో ఇద్దరు లేదా ముగ్గురి కంటే ఎక్కువ మంది కదలికలు ఉన్నా, ఆయుధాలు, ఇతర సామగ్రిని సైతం కనిపెట్టి భద్రతా బలగాలకు వాటి లొకేషన్‌తో కూడిన వివరాలను మ్యాప్‌లతో సహా అందించే అత్యాధునిక వార్ కేటగిరీ సైలెంట్ కిల్లర్ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. అవి ఒకటో, రెండో కాదు. మావోయిస్టులకు పట్టున్న అబూజ్‌మడ్, నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్, ఆంధ్రా-ఒడిసా బోర్డర్.....ఇలా ఆయా ప్రాంతాలను బట్టి, అవసరాలను బట్టి లెక్కకు మించిన డ్రోన్లను రోజువారీగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల భద్రతా బలగాలు అడవుల్లోని భారీ కొండలు, గుట్టలు ఎక్కి, దిగాల్సిన పనిలేదు. అనుమానంతో ఓ డ్రోన్‌ను ఫ్లైయింగ్ చేపిస్తే 18-25 కిలోమీటర్ల పరిధిలోని అడవిలో ఎక్కడ ఏం ఉందో సులువుగా కనిపెట్టవచ్చు. ఇవి భద్రతా బలగాల చేతికి అందిన తర్వాతే గత ఏడాది కాలంగా ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరిగిపోయింది. సగటున ఒక్కో సంఘటనలో 20 -30 మంది చొప్పున మరణిస్తున్నారు. మానవ రహిత డ్రోన్లు అడవుల్లో ఉన్న మావోయిస్టుల జాడను లోకేషన్‌తో సహా ఇస్తుండటంతో వారున్న ప్రాంతాలను బలగాలు రెండు లేదా మూడు గంటల వ్యవధిలోనే చుట్టుముడుతున్నాయి. డ్రోన్ సర్వెలైన్స్ ఇచ్చే డేటాతో ఒకేసారి వేలాది మంది భద్రతా బలగాలు మావోయిస్టులపై దాడులు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టుల వైపు ప్రాణనష్టం చాలా ఎక్కువగా ఉంటోంది.

వేధిస్తున్న వయో భారం

మావోయిస్టులను వేధిస్తున్న మరో సమస్య వయోభారం. పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన అగ్రనాయకుల్లో ఎక్కువ మంది 60 నుంచి 75 ఏళ్ల మధ్యలో ఉన్నారు. వీరిలో చాలామంది వయోభారంతో, అనారోగ్యాలతో కదల్లేని స్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన అగ్రనాయకత్వాన్ని కాపాడుకోలేని పరిస్థితి వారికి ఏర్పడింది. 2010 ప్రాంతాల్లో 96 జిల్లాల్లో బలమైన ప్రభావం చూపిన మావోయిస్టు పార్టీ 2023 నాటికి 46 జిల్లాలకు పరిమితమైంది. ఆపరేషన్ కగార్ తర్వాత ఆరు జిల్లాలకే పరిమితమైంది.

షెల్టర్ జోన్‌లలోకి తిరోగమనం..

వరుస ఎన్‌కౌంటర్లతో గడ్డు పరిస్థితుల్లో ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్రంతో చర్చలకు సిద్ధమని ప్రకటించింది. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ రెండుసార్లు శాంతి చర్చల ప్రతిపాదన చేశారు, కేంద్రం ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించలేదు సరికదా...మావోయిస్టు గెరిల్లాలకు ఆశ్రయమైన కర్రెగుట్టల ప్రాంతాన్ని జల్లెడ పట్టించింది. ఇక చర్చలకు కేంద్రం అవకాశం ఇవ్వదని మావోయిస్టు పార్టీకి సంకేతాలు వెళ్లాయి. వార్ జోన్ నుంచి షెల్టర్ జోన్‌కు వెళ్లాలని పార్టీ ముఖ్యనేతలకు కేంద్ర కమిటీ నుంచి సూచనలు వెళ్లినట్లుగా ఇటీవలి తనిఖీల్లో వెలుగు చూసిన పలు డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తోంది.

ఖాళీ అవుతున్న కమిటీలు..

గత ఏడాది సెప్టెంబరు నాటి మావోయిస్టు పార్టీ డాక్యుమెంట్ ప్రకారం కేంద్ర కమిటీ సభ్యులు 21 మంది. పొలిట్ బ్యూరో సభ్యులు 13మంది. కానీ తాజా పరిణామాలతో కమిటీ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మావోయిస్టు పార్టీకి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) కీలకమైనది. ఇందులో నుంచే అనేక మంది కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యులుగా ఉన్నారు. గత ఏడాది కాలంగా ఈ కమిటీలో 18 మంది ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఉప కమిటీల పరిధిలో 120 మంది మరణించారు. దీంతో దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ దాదాపుగా ఖాళీ అయినట్లేనని పోలీసువర్గాలు చెబుతున్నాయి. దక్షిణాదిలో కేరళలోనే ఆ పార్టీకి కొంత పట్టు ఉంది. గత ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు రాష్ట్రకమిటీ సభ్యులు అక్కడ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఏపీ, తెలంగాణల్లో ప్రత్యేకంగా దళాలు లేని పరిస్థితి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కమిటీలో 18 మంది కీలక నేతలు ఉన్నా వ్యక్తులుగానే ఉన్నారని సమాచారం. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఏఓబీ కమిటీ కూడా ఉనికిని కోల్పోయే పరిస్థితి వచ్చిందని ప్రజాసంఘాలు చెబుతున్నాయి.



ఎందుకీ పరిస్థితి?

ఒకప్పుడు నక్సల్స్‌కు అడవులు సురక్షితమైనవి. అడవుల్లో ఉంటూనే దళాల నిర్మాణం చేసి విముక్తి ప్రాంతాలను ప్రకటించారు. నగర, పట్టణ ప్రాంతాల్లో యాక్షన్లు చేపట్టేందుకు టీమ్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అయితే టెక్నాలజీ పెద్దగా లేని సమయంలో నక్సల్స్ ఏరివేతకు పోలీసు బలగాలు ప్రధానంగా మేధస్సును నమ్ముకొని పనిచేశాయి. కోవర్ట్ సిస్టమ్‌ను డెవలప్ చేసి కీలకనేతలను మట్టుబెట్టారు. అడవుల్లోకి వెళ్లి నక్సల్స్‌ను తుదముట్టించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పారమిలటరీ బలగాలను రంగంలోకి దింపి ప్రత్యేక చర్యలు చేపట్టాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు అత్యాధునిక ఆయుధాలు వినియోగించింది. చీకట్లో కూడా నక్సల్స్‌ను గుర్తించేందుకు నైట్‌విజన్ గ్లాసెస్‌ను వినియోగించింది. ఆ తర్వాత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంది. మావోయిస్టుల ఏరివేతకు సాధారణ డ్రోన్లను ఉపయోగించారు. వాటిని నక్సల్స్ కూల్చివేశారు. కానీ 2023 నుంచి అత్యాధునికమైన మానవ రహిత, శబ్దరహిత యుద్ధడ్రోన్లను మావోయిస్టు ఆపరేషన్స్‌కోసం కేంద్రం ఉపయోగిస్తోంది. ఒకవైపు పెరిగిన నిర్బంధం, మరోవైపు డ్రోన్‌దాడులు, ఆధునిక యుద్ధాన్ని ఎదుర్కోలేక ఇంకా సంప్రదాయ కాలి నడక మార్గాల్లోనే పయనిస్తూ మృత్యువులోకి వెళ్లిపోతున్నారు. అసలు అడవుల్లోనే ఉంటూ మావోయిస్టు సాయుధుడిగా ప్రాణాలు కాపాడుకోవడం ఎలా? అన్నది ఇప్పుడు మావోయిస్టు పార్టీ ముందున్న అతిపెద్ద సవాల్. కేంద్రం కోరుతున్నట్లుగా మావోయిస్టులు అస్త్రసన్యాసం చేసి సాయుధంగా లొంగిపోలేరు. అలాగని అడవుల్లోనే ఉంటూ పాత పద్ధతులు, కాలం చెల్లిన వ్యూహాలతో సాయుధపోరాటం అంటే విడతలవారీగా మృత్యువును ఆహ్వానించడమే అవుతుంది.

టాప్ ఆర్డర్ కూలిందిలా..

బెంగాల్‌లోని నక్సల్బరీలో 1967 మే 25న మొదలైన సాయుధ రైతాంగ తిరుగుబాటును అసలైన మార్గంగా గుర్తించినవారిని నక్సల్స్‌గా వ్యవహరిస్తున్నారు. 1968లో వీరంతా చారుమజుందార్ నాయకత్వాన్ని అంగీకరించి, ఆయన కేంద్ర కమిటీ కార్యదర్శిగా సీపీఐ(ఎం.ఎల్.) పార్టీని ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఏపీ నుంచి పంచాది కృష్ణమూర్తి కేంద్ర కమిటీ సభ్యునిగా ఉండేవారు. ఆ తర్వాత ఎన్‌కౌంటరులో ఆయన మరణించారు. చారుమజుందార్ పోలీసులకు పట్టుబడి 1972 జూలై 28న కస్టడీలో చనిపోయారు. పోలీసుల అదుపులో ఉండగా ఒక కేంద్ర కమిటీ కార్యదర్శి మరణించిన తొలి సంఘటన అది. ఆ తర్వాత జరిగిన అతిపెద్ద సంఘటన బస్వరాజ్ ఎన్‌కౌంటరే. 1980లో పీపుల్స్‌వార్ ఏర్పడే నాటికి సీపీఐ(ఎం.ఎల్.)గా ఉన్న పార్టీలో అనేక మంది సాయుధపోరాట పంథాలో సాగారు. కానీ పార్టీకి సారథ్యం వహిస్తున్నవారెవ్వరూ ఎన్‌కౌంటర్లలో మరణించలేదు. పీపుల్స్‌వార్ 1980లో కొండపల్లి సీతరామయ్య నేతృత్వంలో ఆవిర్భవించిన తర్వాత అనేక రాష్ట్ర కమిటీ నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. ఉమ్మడి ఏపీలో గ్రేహౌండ్స్ బలగాల ఆపరేషన్స్‌లో రాష్ట్ర కార్యదర్శి పులిఅంజయ్య, ఆ తర్వాత మాధవ్ చనిపోయారు. 1999 డిసెంబరులో పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోశ్ రెడ్డి, శీలం నరేశ్ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. 2004లో పీపుల్స్‌వార్ దండకారణ్యంలోని ఎంసీసీతో విలీనం తర్వాత సీపీఐ(మావోయిస్టు) పార్టీగా అవతరించింది. ఆ తర్వాత 2009లో కేంద్రం మావోయిస్టుల ఏరివేత కోసం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. ఇక అప్పటి నుంచి కీలక నేతల ఎన్‌కౌంటర్లు సెలక్టివ్‌గా జరిగాయి. ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్), కిషన్‌జీ (మల్లోజుల కోటేశ్వరరావు), పటేల్ సుధాకర్‌రెడ్డి(సూర్యం), శాఖమూరి అప్పారావు వంటి అనేక మంది కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఆపరేషన్ కగార్‌లో వరస ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి. ఛత్తీస్‌గఢ్-ఒరిశా సరిహద్దుల్లో గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మరణించారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ కమిటీ కీలక నేత రాంజీ మరణించారు. ఇప్పుడు కేంద్ర కమిటీ కార్యదర్శి బస్వరాజ్‌నే కోల్పోయారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు తప్పుకొన్న తర్వాత బాధ్యతలు స్వీకరించిన కేశవరావు ఉత్తరాది, దక్షిణాది మావోయిస్టు దళాలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని నడిపారు. మావోయిస్టు పార్టీని దేశమంతటా విస్తరించడంలో ప్రధానపాత్ర పోషించారు. కరోనా కాలం కూడా మావోయిస్టులను భయపెట్టింది. తెలంగాణ కార్యదర్శి హరిభూషన్ కరోనాతో ఉద్యమంలోనే మరణించారు. కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్‌కౌంటరులో మరణించిన నల్లా ఆదిరెడ్డి భార్య సరోజినిని కరోనా బలి తీసుకుంది.



తెలుగు ప్రొఫెసర్లకు అరుదైన గౌరవం

- ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీలో సభ్యులుగా చెన్నుపాటి జగదీశ్, మల్లికార్జున్ తాటిపాముల..



చెన్నుపాటి జగదీశ్



మల్లికార్జున్ తాటిపాముల

కంది, మే 21 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్‌తో అనుబంధమున్న ఇద్దరు విశిష్ట ప్రొఫెసర్లు.. అందులోనూ తెలుగు శాస్త్రవేత్తలకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీలో సభ్యులుగా ప్రొఫెసర్లు చెన్నుపాటి జగదీశ్, మల్లికార్జున్ తాటిపాముల చోటు సంపాదించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్‌లో డైరెక్టర్ బీఎస్ మూర్తి వీరితో బుధవారం వర్చువల్‌గా మాట్లాడారు. ఈ ఇద్దరు ప్రొఫెసర్లు ఐఐటీహెచ్ విద్యార్థుల పరిశోధనలకు ఎంతో సహకరించారని.. విద్యార్థుల పురోభివృద్ధికి వీరి సహకారం మరువలేనిదని కొనియాడారు. ఐఐటీ హైదరాబాద్‌కు ఇది చారిత్రాత్మక క్షణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా వల్లూరుపాలెంలో జన్మించిన జగదీశ్ చెన్నుపాటి.. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం, పార్లమెంటుకు సలహాదారుగా కూడా పనిచేస్తున్నారు. వరంగల్‌లో జన్మించిన మల్లికార్జున్ తాటిపాముల.. అమెరికాలోని స్వీన్‌బర్గ్‌కు చెందిన ఎరిక్సన్ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. టెలి కమ్యూనికేషన్స్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 2జీ నుంచి భవిష్యత్తు 6జీ నెట్‌వర్క్ వరకు.. దాదాపు 35 ఏళ్లుగా ఆ రంగంలో పరిశోధనలతో కృషి చేస్తున్నారు.

పాలమూరు- రంగారెడ్డిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించలేం

- హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 21 (ఆంధ్రజ్యోతి): పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో అవకతవకల ఆరోపణలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని తేల్చిచెప్పింది. ఈ మేరకు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ)ను కొట్టివేసింది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నాగం జనార్దన్‌రెడ్డి 2019 మార్చిలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. నాగం తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ధర్మాసనానికి తెలిపారు. ఈ వాదనలను మేఘా సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ఖండించారు. ఈ అంశంపై దాఖలైన నాలుగు పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిందని, ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేసిందని వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. నాగం జనార్దన్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

పోలీసులకు ఉత్తమ ప్రతిభ పురస్కారాలు

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 52 మంది పోలీసు అధికారులకు బుధవారం డీజీపీ జితేందర్ పురస్కారాలను అందజేశారు. పోలీసులకు అప్పగించిన విధులను సమర్థంగా నిర్వహించడం పట్ల వారి పనితీరును అభినందిస్తూ ఈ అవార్డులు ఇస్తున్నట్లు డీజీపీ తెలిపారు. ప్రజలకు వేగవంతమైన పోలీసింగ్ అందించడం ద్వారా తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, సిఐడీ డీజీ షికాగోయల్, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కేడర్‌కు ఐపీఎస్ అభిలాషా బిష్త్

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారిణి అభిలాషా బిష్త్‌ను తెలంగాణ కేడర్‌కు పంపించేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఆమె ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన ఏపీలో రిపోర్ట్ చేశారు. ఆ తర్వాత రోజు(ఫిబ్రవరి 27) నుంచే ఆమె నాలుగు నెలల చైల్డ్ కేర్ సెలవుపై వెళ్లారు. అనంతరం తనను తెలంగాణ కేడర్‌లో కొనసాగించాలని ఆమె హైకోర్టును ఆశ్రయించడంతో ఏప్రిల్ 13న ఏపీ హైకోర్టు ప్రత్యేక ఆర్డర్లు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తనను తెలంగాణ కేడర్‌కు పంపించాలని ఆమె డీజీపీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం ఆమెను ఏపీ కేడర్ నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు హైకోర్టులో ఊరట

27న రాష్ట్ర సర్వీస్‌లో చేరాలన్న ఆదేశాలు 8 వారాలు నిలిపివేత

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో తప్పనిసరి రెండేళ్లు పనిచేయాలని.. ఈ మేరకు ఈ నెల 27న సర్వీసులో చేరాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల అమలును 8 వారాల పాటు నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2017 నాటి జీవో ప్రకారం సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను ప్రభుత్వ సర్వీసుల్లో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను అట్టిపెట్టుకోవడం చెల్లదంటూ హైకోర్టులో 46 మంది డాక్టర్లు పిటిషన్ దాఖలు చేశారు. రెండేళ్లపాటు సర్వీసు పూర్తి చేయడం లేదా ఇతర రాష్ట్రాల్లో సర్వీసు పూర్తి చేసినప్పటికీ తమ సర్టిఫికెట్లు ఇవ్వకుండా మళ్లీ 27న సర్వీసులో చేరాలనడం చెల్లదని కోర్టు దృష్టికి తెచ్చారు. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ శ్రీనివాసరావు వెకేషన్ ధర్మాసనం.. ప్రభుత్వ ఆదేశాల అమలును 8 వారాల పాటు నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

చిన్నారి ప్రాణం కాపాడిన దాతృత్వం

- ఎస్ఎంఏతో బాధపడుతున్న పది నెలల పాపకు రూ.14 కోట్ల ఇంజెక్షన్
- క్రౌడ్ ఫండింగ్‌తో నిధుల సమీకరణ
- రెయిన్‌బో ఆస్పత్రిలో విజయవంతంగా చికిత్స

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే ప్రాణాంతక జన్యుపరమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పది నెలల చిన్నారికి సికింద్రాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో 'జోల్‌జెన్‌స్మా' అనే జన్యు చికిత్స విజయవంతంగా జరిగింది. 'జోల్‌జెన్‌స్మా' ఒక్క డోసు ఖరీదు సుమారు రూ.14 కోట్లు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఈ జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్‌ను సమకూర్చేందుకు క్రౌడ్ ఫండింగ్ ద్వారా దాతల నుంచి విరాళాలు సేకరించారు. సకాలంలో డబ్బు సమకూరడం, ఇంజెక్షన్ లభించడం, చికిత్స పూర్తవ్వడంతో ఆ చిన్నారి ప్రాణం నిలబడింది. పుట్టుకతోనే ఎస్ఎంఏతో బాధపడుతున్న హైదరాబాద్‌కు చెందిన విర్ధి చౌదరి (10 నెలలు) అనే చిన్నారికి రెయిన్‌బో వైద్యులు ఈ చికిత్స అందించారు. ఎస్ఎంఏ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 10వేల మంది పిల్లల్లో సుమారు ఒకరిని ప్రభావితం చేసే జన్యుపరమైన నరాల సంబంధిత సమస్య అని రెయిన్‌బో ఆస్పత్రి పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్ కోనంకి చెప్పారు.

సునీతారావుకు షోకాజ్ నోటీసు

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చాంబర్ ముందు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నిరసన తెలపడాన్ని మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇది పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని, దీనిపై వారంలోగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని సునీతారావును మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆదేశించారు. లేనిపక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు బుధవారం సునీతారావుకు అల్కా లాంబా షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అందుకే 'అక్షరమే అండగా- పరిష్కారమే అజెండాగా' నిర్వహణ

- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య
- మరో రూ.కోటితో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే కోటంరెడ్డి హామీ
- సౌత్‌మోపూరు గ్రామంలో ఘనంగా విజయోత్సవ సభ



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య, పక్కన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు తదితరులు

నెల్లూరు/తిరుపతి, మే 21(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల పత్రికలు సమస్యలను ఎత్తిచూపడంతోనే ఆగిపోతున్నాయి. 'ఆంధ్రజ్యోతి' మాత్రం మరో అడుగు ముందుకేసింది. సమస్యలను ఎత్తిచూపడమే కాదు.. వాటిని పరిష్కారించాలన్న పట్టుదలతో కృషి చేస్తున్నాం. ఆ క్రమంలో పుట్టిందే 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించి సమస్యలను పరిష్కరించాం' అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం విజయోత్సవ సభ బుధవారం నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు వేమూరి ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న వేమూరి ఆదిత్యకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొని గ్రామస్థుల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ సౌత్‌మోపూరులో జరిగిన అభివృద్ధి పనులు చూస్తుంటే ఆనందంగా ఉందని అన్నారు. ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ జనవరిలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.కోటితో సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చామని, ఆ ప్రకారం 40 రోజుల్లోనే పనులు ప్రారంభించి పూర్తి చేసినట్లు చెప్పారు. వచ్చే సంవత్సరం మరో రూ.కోటితో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని, వచ్చే ఏడాది ఇదే రోజులోపు పూర్తి చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం మంచి ప్రభుత్వం పాలన సాగిస్తుందంటే అందులో 'ఆంధ్రజ్యోతి'ది ప్రధాన పాత్ర అని కొనియాడారు. నాడు ప్రజలను తన అక్షరాలతో చైతన్యవంతుల్ని చేసిందన్నారు. అయితే ఏ ప్రభుత్వం ఉన్నా తప్పుచేస్తే తాట తీయడానికి 'ఆంధ్రజ్యోతి' ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

విద్యార్థులకు బహుమతులు

పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన సౌత్‌మోపూరు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు నలుగురికి వేమూరి ఆదిత్య, కోటంరెడ్డి సోదరులు నగదు బహుమతులను అందజేశారు. ఈ సభలో 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బ్రాంచి మేనేజరు కే హరికృష్ణ, టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా, 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాల విజయోత్సవ సభ గురువారం ఉదయం 10గంటలకు తిరుపతి జీవకోనలో జరుగనుంది.

అందంగా టాప్-24లోకి

కీలక దశకు చేరుకున్న మిస్‌వరల్డ్ పోటీలు.. 'హెడ్ 2 హెడ్' పోటీల్లో 84 మంది ఔట్

- మిస్ ఇండియా నందినీ గుప్తాకు చోటు
- రేపు టాప్-10 జాబితా ఖరారు
- అందరి దృష్టి నందిని పైనే..
- శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ సుందరీమణుల నుంచి పోటీ
- నేడు విక్టోరియా మెమోరియల్ సందర్శన



బుధవారం టీ-హబ్‌లో మిస్‌వరల్డ్ 'హెడ్ 2 హెడ్' పోటీలో పాల్గొన్న వివిధ దేశాల సుందరీమణులు

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలు రసవత్తరంగా మారుతున్నాయి. పోటీలో పాల్గొంటున్న మొత్తం 108 దేశాల సుందరీమణుల నుంచి టాప్-24 జాబితాను మిస్‌వరల్డ్ నిర్వాహక సంస్థ బుధవారం ప్రకటించింది. ఇందులో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నందినీ గుప్తా సహా.. నాలుగు ఖండాల నుంచి 24 మంది అందగత్తెలు ఉన్నారు. వీరిలో యూరప్‌లోని పోలండ్, మాల్టా, ఇటలీ, ఎస్తోనియా, జర్మనీ, నెదర్లాండ్స్ వేల్స్ చెక్ రిపబ్లిక్, ఐర్లాండ్ దేశాలకు చెందిన 9 మంది ఉన్నారు. ఇక అమెరికా-కరేబియన్ ఖండం నుంచి అమెరికా, బ్రెజిల్, జమైకా, అర్జెంటీనా, కేమెన్ ఐలాండ్స్ ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన ఆరుగురు ఎంపికయ్యారు. కాగా, ఆసియా-ఓసియానా ఖండం నుంచి భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందినవారు. ఆఫ్రికా నుంచి నైజీరియా, ఇథియోపియా, కామెరూన్, కెన్యా దేశాల సుందరీమణులు ఉన్నారు. కాగా మిస్‌వరల్డ్ పోటీదారులు 'బ్యూటీ విత్ పర్పస్' పేరుతో తమ సేవా కార్యక్రమాలను వివరించే 'హెడ్ 2 హెడ్' పోటీలు మంగళవారం ప్రారంభమై.. బుధవారం ముగిశాయి. రెండు రోజుల్లో మొత్తం 108 మంది ఈ పోటీలో పాల్గొన్న అనంతరం టాప్-24 జాబితాను ప్రకటించారు. ఈ నెల 10న ప్రారంభమైనప్పటి నుంచి బుధవారం వరకు వివిధ దశల్లో పోటీలు నిర్వహించినట్లు మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు.

రేపు తేలనున్న తుది జాబితా..

ఈ నెల 23న నిర్వహించనున్న కీలకమైన పోటీలో 24 మంది అందాలభామలు తమ ప్రతిభను చాటనున్నారు. వీరిలో నుంచి టాప్-10ను ఎంపిక చేస్తారు. వారు ఈ నెల 31న హెచ్ఐసీసీలో జరిగే తుది పోటీల్లో పాల్గొంటారు. ఆ పోటీల్లో టాప్-10లోనుంచి ఒక్కో ఖండం నుంచి ఇద్దరు చొప్పున నాలుగు ఖండాలకు చెందిన 8 మందిని ఎంపిక చేస్తారు. చివరికి ఒక్కో ఖండం నుంచి ఒకరి చొప్పున నలుగురిని ఖరారు చేస్తారు. వీరిని మిస్ వరల్డ్ ఆసియా, మిస్ వరల్డ్ ఓసియానా, మిస్ వరల్డ్ ఆఫ్రికా, మిస్ వరల్డ్ యూరప్ విజేతలుగా ప్రకటిస్తారు. ఈ నలుగురిలో నుంచి మిస్ వరల్డ్ విజేతను ఎంపిక చేస్తారు. మిగతా ముగ్గురిని రన్నరప్ 1, 2, 3లుగా ప్రకటిస్తారు.

భారత్‌కు ఆ నలుగురితో పోటీ..

బుధవారం ప్రకటించిన టాప్-24 జాబితాలో యూరప్ నుంచి అత్యధికంగా 9 మంది ఉండగా, అమెరికా-కరేబియన్ నుంచి ఆరుగురు, ఆసియా-ఓసియానా నుంచి 5, ఆఫ్రికా నుంచి 4 దేశాల ప్రతినిధులు ఉన్నారు. ప్రతిసారీ ఉన్నట్లుగానే ఈసారి కూడా యూరప్ దేశాల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. గతేడాది మిస్ వరల్డ్ విజేతగా నిలిచిన క్రిస్టినా ఇదే ఖండం నుంచి పోటీపడి విజేతగా నిలిచారు. ఆసియా-ఓసియానా నుంచి ఈసారి భారత్‌తో పాటు మరో ఐదు దేశాలు శ్రీలంక, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, ఆస్ట్రేలియా పోటీ పడుతున్నాయి. భారత్ ప్రతినిధిగా ఉన్న నందినీ గుప్తా ఆసియా-ఓసియానా ఖండం నుంచి విజేతగా నిలవాలంటే ఈ నాలుగు దేశాలతో పోటీపడాల్సి ఉంటుంది. వీరిలో నుంచి మిస్ ఆసియా-ఓసియానాగా గెలిస్తే నందినికి మిస్ వరల్డ్ టాప్-4లో చోటు లభిస్తుంది. విజేతగా నిలిచే అవకాశాలూ పెరుగుతాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆతిథ్య దేశం ప్రతినిధిగా ఈసారి నందినీ గుప్తాపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. 1951 నుంచి ఇప్పటివరకు జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో భారత్, వెనెజులా అత్యధికంగా ఆరుసార్లు మిస్ వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్నాయి. ఈసారి పోటీల్లో భారత్ గెలిస్తే.. ఇంతవరకు ఏ దేశం సాధించని అరుదైన రికార్డు సొంతమవుతుంది.

నేడు 'విక్టోరియా' సందర్శన

ఎల్‌బీనగర్: ప్రపంచ సుందరి పోటీదారులు గురువారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంను సందర్శించనున్నారు. హోంలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వరల్డ్ లైబ్రరీ (కంప్యూటర్ ల్యాబ్)ని ప్రారంభించనున్నారు. ఈ అద్భుత కట్టడాన్ని 1903లో ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ బహదూర్ నిర్మించారు.

ఆడపిల్ల వద్దనుకుని అబార్షన్!

- వైద్యం వికటించి గర్భిణి మృతి
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన



అనూష (ఫైల్)

సూర్యాపేట క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): అప్పటికే ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉండటం, మూడో సంతానంగా ఆడబిడ్డే పుట్టనుందని తెలుసుకొని.. అబార్షన్‌కు ప్రయత్నించడం ఆమె ప్రాణాలను బలిగొంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ ఘటన వెలుగుచూసింది. మృతురాలి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవపురానికి చెందిన బయ్య నగేశ్-అనూష(25) దంపతులకు నాలుగు, రెండేళ్ల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. అనూష మరోసారి గర్భం దాల్చింది. పుట్టబోయేది ఆడబిడ్డా.. మగబిడ్డా అనేది తెలుసుకునేందుకు సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన ఆర్ఎంపీని సంప్రదించారు. ఆ ఆర్ఎంపీ అనూషను నకిరేకల్‌లోని ఓ సెంటర్‌కు తీసుకువెళ్లి స్కానింగ్ తీయించగా, పుట్టబోయేది ఆడపిల్ల అని నిర్ధారణ అయింది. తీవ్ర నిరాశకు లోనైన అనూష కుటుంబసభ్యులు, పోషణ భారం అవుతుందని భావించి.. ఆమెకు అబార్షన్ చేయించాలని నిర్ణయించారు. రెండు రోజులకు మళ్లీ అదే ఆర్ఎంపీని సంప్రదించారు. అబార్షన్‌కు, మందులకు కలిపి రూ.35వేలు ఖర్చు అవుతుందని సదరు ఆర్ఎంపీ చెప్పగా, అందుకు అనూష భర్త నగేశ్ అంగీకరించాడు. తర్వాత అనూషను సూర్యాపేటలోని రామలింగేశ్వర థియేటర్ సమీపంలోని ఓజో ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ అనూషకు అబార్షన్ చేయడానికి వైద్యులు యత్నించగా, వైద్యం వికటించి తీవ్ర రక్తస్రావమైంది. అనూష పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి యాజమాన్యం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ అనూష ఈ నెల 18న మృతి చెందింది. అదేరోజు రాఘవాపురంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికుల ద్వారా విషయం వెలుగుచూసింది. ఈ ఘటనతో అబార్షన్ చేయించిన ఓజో ఆస్పత్రి యాజమాన్యం ఆస్పత్రిని మూసివేసి పరారైనట్లు సమాచారం. కాగా తన భార్య మృతికి కారణమైన వారి పట్ల చర్యలు తీసుకోవాలని అనూష భర్త నగేశ్ డిమాండ్ చేశాడు.

అనుమతుల్లేని ఆస్పత్రిలో అబార్షన్ చేశారు

సూర్యాపేటలో ఓజో ఆస్పత్రికి అనుమతుల్లేవు. ఆ ఆస్పత్రిలోనే అనూషకు నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేశారు. గతంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు ఇదే ఆస్పత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి ఆస్పత్రిని సీజ్ చేశాం. అయితే ఆస్పత్రి పేరు మార్చి వైద్య సేవలందిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. అనూష మృతి విషయంలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

\- డాక్టర్ కోటా చలం, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

2 గంటల్లోనే.. ప్రాణాలు బుగ్గిపాలు!

- టెర్రస్‌పై పడుకున్న కార్మికులు
- వాంగ్మూలాలు నమోదు
- 'గుల్జార్ హౌజ్' ఘటనపై కొనసాగుతున్న విచారణ

హైదరాబాద్ సిటీ/చార్మినార్, మే 21 (ఆంధ్రజ్యోతి): గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద ఘటనలో నలుగురు కార్మికులను చార్మినార్ పోలీసులు విచారించినట్లు తెలిసింది. సౌత్‌జోన్ డీసీపీ స్నేహ మెహరా, ఏసీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. నలుగురు కార్మికుల్లో ముగ్గురు టెర్రస్ పైన, ఒకరు బయట గేటు వద్ద పడుకున్నట్లు గుర్తించారు. వీరి వాంగ్మూలాలు కూడా నమోదు చేసినట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున 4:45 గంటల సమయంలో ఏసీ కంప్రెషర్ పేలి అగ్ని రాజుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మంటలు, పొగ వ్యాపించిన విషయాన్ని నిద్రలో ఉన్న ప్రహ్లాద్ మోదీ కుటుంబ సభ్యులు గుర్తించడానికి సుమారు 45-50 నిమిషాలు పట్టినట్లు పేర్కొంటున్నారు. అప్పటికే పొగలు దట్టంగా కమ్ముకోవడంతో ఎటు వెళ్లాలో తెలియక హాహాకారాలు చేసినట్లు తెలిసింది. వారి అరుపులతో కార్మికులు నిద్ర లేచారు. దట్టమైన పొగలు వస్తుండడంతో ఏం జరుగుతుందో తమకు అర్థం కాలేదని పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. వెంటనే అత్తాపూర్‌లో ఉంటున్న ప్రహ్లాద్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని కార్మికులు చెప్పినట్లు సమాచారం. ఉదయం 6.15 గంటల సమయంలో స్థానికులు, టెర్రస్‌పైన ఉన్న కార్మికులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అయితే టెర్రస్ గేటు తాళం కార్మికుల వద్ద ఉందా? యజమానుల వద్ద ఉందా? అన్నది తెలియడం లేదు. 6.20 గంటలకల్లా వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానికులు క్షతగాత్రులను రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే విపరీతంగా పొగపీల్చిన బాధితులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ఘటనా స్థలంలోనే ముగ్గురు మృతి చెందగా.. మిగిలిన వారు ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించినట్లు పోలీసులు చెబుతున్నారు. రెండు గంటల్లోనే 17 మంది మృతి చెందినట్లు గుర్తించారు. వారి కుటుంబ సభ్యుల వాంగ్మూలాలూ తీసుకోనున్నట్లు తెలిసింది.

నష్టంపై అంచనా రాలేదు..

అగ్ని ప్రమాద ఘటనలో వాటిల్లిన నష్టంపై ఉన్నతస్థాయి కమిటీ ఇంకా అంచనాకు రాలేదు. కమిటీ అధికారులు రెండు రోజులుగా తమ విభాగాల సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తూ వివరాలను సేకరిస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు బుధవారం మరోసారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మూడు దుకాణాల్లో ఆభరణాలు ఎన్ని ఉన్నాయి? ఇంట్లో ఏమేం వస్తువులు కాలిపోయాయి? నగదు ఏమైనా ఉందా? ఆస్తుల పత్రాలు ఉన్నాయా? అనేది క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశిస్తుండడంతో అధికారులు ఆ దిశగా ముందుకు వెళ్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటున్నారు. దుకాణాల్లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. మరో వారం రోజుల్లో నష్టంపై పూర్తి అంచనాకు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మృతుల కుటుంబ సభ్యుల్లో కొందరు బుధవారం ప్రహ్లాద్ మోదీ ఇంటికి వచ్చారు. ఘటనపై పోలీసులు, అధికారులు పంచనామా చేసిన తర్వాత కొందరిని ఇంట్లోకి వెళ్లేందుకు అనుమతించారు. ఇంట్లో టార్చిలైట్ల సాయంతో రెండు రోజులుగా సామగ్రిని వెతుకుతున్నారు. వారి షాపుల్లో పనిచేసే కార్మికుల సాయంతో ఒక్కో వస్తువును బయటకు తీసుకొస్తున్నారు. మంటల్లో కాలిపోగా, మిగిలిన వస్తువులను అత్తాపూర్‌లోని కుమార్తె ఇంటికి తీసుకెళ్లారు.

ఇన్వర్టర్ నిప్పురవ్వలతోనే ప్రమాదం!

(మొదటిపేజీ తరువాయి)

ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. నాగ్‌పూర్‌కు చెందిన అగ్నిమాపక ఫోరెన్సిక్ ఇంజనీర్ నీలేశ్ ఉకుండే, హైదరాబాద్‌కు చెందిన ఫైర్ ఇంజనీర్, సీనియర్ కన్సల్టెంట్ మహిపాల్‌రెడ్డి ప్రమాదం జరిగిన కృష్ణా పెరల్స్ దుకాణం, ఇంటిని బుధవారం సందర్శించారు. ఇన్వర్టర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా వచ్చిన నిప్పు రవ్వలే ప్రమాదానికి కారణమని వారు తేల్చినట్లు ఉన్నతాధికారి తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఇన్వర్టర్‌లో నిప్పు రవ్వలు వచ్చాయని, అవి దుకాణంలోని చెక్క ఫ్రేమ్‌లో ఎల్ఈడీ బల్బుల వద్ద పడడంతో మంటలు అంటుకున్నాయని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న నగల దుకాణం నుంచి పొగలు రావడాన్ని ఆదివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పనిమనిషి గుర్తించాడన్నారు. ఈ విషయాన్ని మొదటి అంతస్తులో ఉన్న యజమానికి చెప్పాడని, తర్వాత అందరూ కలిసి బకెట్లలో, నల్లా పైపు నుంచి నీటిని తీసుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారని తెలిపారు. అయినా దుకాణంలో మంటలు ఎగసిపడ్డాయన్నారు. అప్పటి వరకు మొదటి అంతస్తులో ఉండి మంటల్ని అదుపు చేయడానికి సలహాలు, సూచనలు చేసిన ప్రహ్లాద్ మోదీ కుటుంబ సభ్యులు.. దట్టమైన పొగ కమ్ముకోవడంతో పాటు మంటలు చెలరేగడంతో గదిలోకి వెళ్లారని చెప్పారు. మంటల తీవ్రత పెరగడంతో సుమారు 6.16 గంటల సమయంలో స్థానికుడు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాడన్నారు. మొగల్‌పుర అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది కేవలం మూడు నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారని.. అప్పటికే తీవ్రమైన మంట, దట్టమైన పొగ అలుముకోవడంతో గదిలో ఉన్న ప్రహ్లాద్ మోదీ కుటుంబ సభ్యులు ఊపిరాడక మృతి చెందారని పేర్కొన్నారు. మెట్ల మార్గంలో భవనం పైకి వెళ్లి ఉంటే వారు ప్రాణాలతో బయటపడే అవకాశం ఉండేదని నిపుణులు చెబుతున్నారని ఉన్నతాధికారి అన్నారు. కానీ, గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోవడం, కిటికీలు మూసి ఉండడంతో అప్పటికే వ్యాపించిన పొగ, గ్రౌండ్ ఫ్లోర్‌లో చెలరేగిన మంటల వేడికి 17 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. గదిలోకి మంటలు వ్యాపించలేదని, ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు అలాగే ఉన్నాయని తెలిపారు. మృతులు వేసుకున్న దుస్తులకు కూడా ఏమీ కాలేదని గుర్తుచేశారు. పొగ, వేడి తీవ్రత కారణంగానే వారు మృతి చెందినట్లు గుర్తించారని ఉన్నతాధికారి చెప్పారు.

పెద్దమొత్తం వెచ్చించి ఇళ్లు కొంటున్నవారు కొద్ది మొత్తం ఖర్చు పెడితే అగ్నిప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. కేవలం రూ.800 నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేస్తే.. అగ్నిప్రమాదాల్ని గుర్తించే పరికరాలు ఇళ్లలో అమర్చుకోవచ్చంటున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.